1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 8
పుటలు : 52

రు. 25 లు

తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక





భారతీయభాషల సంస్థ-విశ్వవిద్యాలయంగా మారుతోందా?!

## కొత్తమాటల పుట్టింపు

తెలుగులో మునుచేర్పులను వెనుచేర్పులను వెతకడం మొదలిడితే ఇప్పటికే నాకు నూటికి పైగా కనబడినాయి. నుడివరులు నడుము కట్టుకొని వెతికితే ఇంకా ఎన్నో దొరుకుతాయి

-- స.వెం.రమేశ్

CIIL

## భాషాపెత్తనం దిశగా కేంద్రప్రభుత్వ విధానాలు



ఫిబ్రవరి నుండి మొదలవుతుంది....

## కొయ్యబొమ్మలాట కళాకారుని ఆత్మకథ

# 'గొంబే గౌడ' రామన గౌడ

**కన్నడ మూలం : డా. చంద్రప్ప సొబటి**

**తెలుగు అనువాదం : రంగనాథ రామచంద్రరావు**

### తెలుగు నేల నుంచి కన్నడ లోగిలి చేరిన కొయ్యబొమ్మలాట !

**భా**రతీయ జానపద కళల్లో ఆకర్షణీయమైన కళ కొయ్యబొమ్మలాట! ఇది ఒక ప్రత్యేక సముదాయానికి చెందిన కళకాదు. ఒక వ్యాపకపు కళ. అయితే అనేక సముదాయాలు ఈ కళాప్రదర్శనను వృత్తిగా చేసుకున్నాయి. ఇలా వృత్తిపరంగా చేసుకున్న వంశాలలో 'గొంబె'గౌడ రామనగౌడగారి వంశమూ ఒకటి. వీళ్ళు రెడ్డిలింగాయత సముదాయానికి చెందినవారు. ఆంధ్రలోని శ్రీశైలం వీరి మూల నెలవు. శ్రీశైల మల్లికార్జునుని చెల్లెలుగా భావించే హేమారెడ్డి మల్లమ్మ కులం లేదా గోత్రం వీరిది. హేమారెడ్డి మల్లమ్మను కులదేవతగా ఆరాధించే సంప్రదాయం వీళ్ళల్లో ఉంది. ఈనాటికీ ప్రతీఏటా జరిగే జాతర కార్యక్రమాల్లో శ్రీశైలానికి వెళ్ళి మల్లికార్జునుని దర్శించుకుని వచ్చే వంశపారంపర్యమైన పద్ధతి వీళ్ళల్లో ఇప్పటికీ ఉంది.

విష్ణువు, హరుడు వీరి ఆరాధ్యదైవాలు. కులదైవం శ్రీశైల మల్లికార్జునుడు, హేమారెడ్డి మల్లమ్మలు; కుంకుమ రెడ్డి: శాక్తేయులు. మాతృప్రధాన సంస్కృతి కలవారు. ఆచరణాల సందర్భాలలో కుంకుమను ఉపయోగిస్తారు. ఉదాహరణకు నుదుట కుంకుమ పెట్టుకుంటారు, యల్లమ్మ ప్రభావమూ వీరిపై ఉంది. వీళ్ళు లింగారాధకులు. అంటే శివుని ఆరాధకులు.

13-14 శతాబ్దాలలో జరిగిన శైవ, వైష్ణవ ధార్మిక ఘర్షణల పరిణామంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల శ్రీశైలం కొండ నుంచీ ఈనాటి కర్నాటక ప్రాంతానికి వలస వచ్చినవారు. ఆస్తిఅంతస్థులను అక్కడే వదిలిపెట్టి వలస వచ్చిన కారణంగా కొందరికి సంచార జీవితం సాగించవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఈ దూర ప్రయాణ సమయంలో వీరికి కొయ్యబొమ్మలాటతో పరిచయం ఏర్పడింది. ఆసక్తితో ఆ ఆటను నేర్చుకుని అందులో నైపుణ్యాన్ని సాధించారు. అప్పటి నుంచి కొయ్యబొమ్మలాట ప్రదర్శిస్తూ కర్ణాటకలోని వివిధ గ్రామాలలో తిరిగి ఈనాటి కుందగోళ రెడ్డేర నాగనూరు గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. అప్పటికే గ్రామగ్రామాల్లో వీళ్ల నిర్వహించిన కొయ్యబొమ్మలాట ప్రదర్శనలు వీళ్ళను ధనవంతుల్ని చేసింది. పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టింది. ఆ కారణంగా అక్కడికి వచ్చి స్థిరపడిన కొంత కాలంలోనే వారికి 'ఊరి గౌడ' పదవి దొరికింది. ఆ కారణంగా అదే గ్రామంలోని మూలనివాసులకు, వలస వచ్చినవారికి మధ్య ఘర్షణ మొదలైంది. ఊరి నాయకత్వపు ప్రశ్న తలెత్తింది. ముందు నుంచీ అదే గ్రామస్థులైన ఊరి గౌడ వంశానికి, గొంబెగౌడ పూర్వీకులకు మధ్య గొడవలు జరిగాయి. రాను రాను ఈ గొడవలు తీవ్రరూపం దాల్చటంతో ఇక్కడ ఉండటం ప్రాణాలకు ముప్పని అనుమానించిన 'గొంబె'గౌడ వంశస్థులు తమ బొమ్మలను, సంపాదించిన సొమ్ములను మూటకట్టుకుని కుటుంబంతో అక్కడి నుంచి మళ్ళీ వలసపోయారు.

అలా బయలుదేరిన వాళ్లు హావేరి జిల్లాలోని రాణిబెన్నూరు తాలూకా అంతరవళ్ళి గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు.

'గొంబె'గౌడ పూర్వీకులు తెలుగే మాట్లాడేవారట. ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న రెడ్డిలింగాయతుల్లో ఇప్పటికీ 'తెలుగు' వాడుక ఉంది. బళ్ళారి, చిత్రదుర్గ జిల్లాలలో ఈ 'తెలుగు భాష' వాడకం ఎక్కువ ఉనికిలో ఉంది. అందుకు నివసించే ప్రాంతం ముఖ్యమైంది. సరిహద్దు ప్రాంతాలతో పోలిస్తే 'మధ్య కర్నాటక'లో ఈ తెలుగుభాషా ప్రభావం తక్కువ. సుమారు నాలుగైదు తరాల నుంచి తెలుగు వాడకపు గురుతులు వీళ్ళల్లో లేవు.

వీరి వంశంలో కొయ్యబొమ్మలాట కాయకపు చరిత్ర సుమారు 600 సంవత్సరాల కన్నా ఎక్కువగానే ఉంది.

విజయనగరం రాజు కృష్ణదేవరాయల కళాపోషణ ఈ కళా ప్రదర్శకుల జీవనానికి ఎంతో ఆలంబన అయింది. వీరి కళా గొప్పదనాన్ని మెచ్చుకున్న విజయనగర రాజులు వీరికి రాగి శాసనాలు ఇచ్చారు. అప్పటి నుంచి వీరి పూర్వీకుల ఇంటి పేరు 'జీవనగౌడ' అన్నది మరుగై 'గొంబె'గౌడ అనే ఇంటిపేరు ముందుకొచ్చింది. ఇది వీరి కళానైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

వీరు ఈ కళలో చేసిన సాధనకుగాను కర్నాటక ప్రభుత్వం ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'రాజ్యోత్సవ పురస్కారం' ఈ ఇంటికి చెందిన నలుగురికి లభించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి ఈ పురస్కారం లభించటం ఈ 'కొయ్యబొమ్మలాట కళాప్రదర్శన' గొప్పదనానికి నిదర్శనం అని చెప్పవచ్చు.

ఫిబ్రవరి సంచిక నుండి ధారావాహికంగా'**అమ్మనుడి**'లో వెలువడుతుంది

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




జనవరి 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రి కలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచ నతో జోడించాలి. ముందుగా సోషల్ మీడి యాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | భాషాపెత్తనం దిశగా కేంద్రప్రభుత్వ విధానాలు | | 07 |
| విద్య–మాధ్యమం: | భారతీయ భాషల.... | ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు | 09 |
| కొత్తమాట: | కొత్తమాటల పుట్టింపు | స.వెం.రమేశ్ | 11 |
| యంత్రానువాదం: | యంత్రానువాదంలో వాక్యవిశ్లేషకం | పి.సంగీత | 16 |
| నుడుల ఎదుగుదల: | వాణిజ్యం – స్థానిక నుడులు | జె.డి.ప్రభాకర్ | 18 |
| సంప్రదాయం–సాధికారత: | అమ్మనుడి కోసం తపించిన... | డా॥.పి.శివరామకృష్ణ'శక్తి' | 19 |
| శ్రద్ధాంజలి: | మేధోశిఖరం, గాంధేయవాది.... | | 25 |
| భాషాశాస్త్రజ్ఞుల సంఘం: | భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం..... | జి. ప్రవీణ్ | 31 |
| సాహిత్యరంగం: | ఒక కథ–యెన్నో ప్రశ్నలు | డా॥ మధురాంతకం నరేంద్ర | 37 |
| పుస్తక సమీక్షలు: | | | 22, 47 |
| మాటల నిర్మాణం: | పదనిష్పాదనకళ | వాచస్పతి | 27 |
| నవల : | మాఊరు | అగరం వసంత్ | 39 |
| | జగమునేలిన తెలుగు– 14 | డి.పి.అనూరాధ | 43 |
| ధారావాహికలు: | పడమటి గాలితో... | ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి | 19 |
| | అడుగుజాడలూ ఆనవాళ్లు–5 | ఈమని శివనాగిరెడ్డి | 33 |
| కవితలు : | అక్షరాన్ని నేను | బి.గోవర్ధనరావు | 46 |
| | కాలపేటిక | డా॥ ఎన్.గోపి | 48 |
| | భావవిప్లవం | మేడా మస్తాన్‌రెడ్డి | 49 |


| ముఖచిత్రం | కార్టూన్లు | బొమ్మలు | కంప్యూటర్ |
|---|---|---|---|
| **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **సరసి** | **చిదంబరేశ్వరరావు** | **బండారు రఘురాం** |

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
నుడి నాడు నెనరు మాసపత్రిక

## చందా వివరాలు

జీవిత చందా : రూ.5000

4 సం॥ చందా : రూ.1000

1 సం॥ చందా : రూ. 300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, పిన్‌కోడ్‌నెంబరులతో కూడిన తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు. **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

## **అమ్మనుడి** చదువరి పలుకులివి...

**న**వంబరు సంచికలో మధురాంతకం నరేంద్ర గారు పత్రికల వైభవదశ గురించీ, చరమదశ గురించీ చాలా ఆవేదనతో రాసినది చదివాక నాకు ఒక సూచన చెయ్యాలనిపించింది. "అందరికీ అందుబాటులో వుండేలా కొన్ని పత్రికలుండాలి గదా?" అన్నారు. నిజమే. అందుకు మనం ఒక పని చేయవచ్చును. ఈ విషయం గురించి రాసిన ఆవేదనని ప్రచురించిన పత్రికనే నిలుపుకుంటే ఎలా వుంటుందో ఆలోచించవచ్చును. అమ్మనుడి పత్రిక ప్రధానంగా భాషా సంబంధమైన విషయాలమీద దృష్టి పెడుతున్నప్పటికీ, కథలకీ, సీరియల్ నవలలకీ కూడా వేదికగా మారేలా, నరేంద్ర గారి వంటి రచయితలూ, అవి చదవ గోరే పాఠకులూ కొన్ని ప్రయత్నాలు చెయ్యవచ్చును. ఈ పత్రికకి చందాలు కట్టడం, కట్టించడం, విరాళాలు ఎంత వీలైతే అంత పంపడం, సేకరించడం చేస్తే, కొంత ఉపయోగంగా వుంటుందనిపిస్తోంది. సాహిత్యం చదివే వారు, సాధారణంగా మేధా శ్రమలు చేసే విద్యావంతులై వుంటారు. శారీరక శ్రమలు చేసే వారితో పోలిస్తే, వీరికి జీతాలు గానీ, పెన్షన్లు గానీ, రిటైర్ మెంటు తర్వాత వచ్చే 'బెనిఫిట్స్' గానీ చెప్పుకోదగ్గ స్థాయిలోనే వుంటాయి. సినిమాలకీ, హోటళ్ళకీ, పెళ్ళిళ్ళకీ, పుట్టిన రోజు ఫంక్షన్లకీ, బట్టలకీ, ఫర్నిచర్ కీ, వాహనాలకీ, నగలకీ, విహార యాత్రలకీ, వగైరాలకి ఎంతో కొంత ఖర్చు పెట్టని మేధా శ్రామిక కుటుంబాలు అరుదు. సాహిత్యం పట్ల ఆసక్తి వున్న రచయితలూ, పాఠకులూ ఈ కోణంలో ఆలోచిస్తే, కొన్ని పత్రికలైనా అదృశ్యం కాకుండా కొన్నాళ్ళయినా మనగలుగుతాయనిపిస్తోంది. చివరిగా, ఇలా ఒక సలహా ఉచితంగా ఇచ్చి తప్పుకోవడం బాగుండదు కాబట్టి, నా తరఫునించీ, నా మిత్రుడు జె.యు. బి.వి. ప్రసాద్ తరఫునించీ 30,000 (మొత్తం ముప్పయ్ వేలు) 'అమ్మనుడి' కి విరాళంగా పంపుతున్నాను. వీలైనప్పుడల్లా పంపిస్తూ వుంటాము.

– బి.ఆర్. బాపూజీ

(పెన్షన్ వచ్చే రిటైర్డ్ ప్రొఫెసర్)

## స్పందనలు

**పదనిష్పాదనకళ:** డిసెంబరు సంచికలో "నిజానికి తెలుగువారి దృష్టిలో తెలుగూ, సంస్కృతమూ రెండు వేఱువేఱు భాషలు కావు. మన కావ్య సంప్రదాయాన్ని అనుసరించి, తెలుగుని యథేచ్ఛగా సంస్కృతపదాలతోను, సమాసాలతోను నింపివేయవచ్చు" అని తెలిపారు.

మరి, అవసరాలకు తగ్గట్టు మనం కొత్తపదాల్ని తయారు చేసుకోవాలి అనే సందేశంతోనే కదా మీరు వ్యాసాలు రాస్తున్నారు. కావలసిన మాటలన్నీ సమృద్ధంగావున్న సంస్కృతాన్ని పూర్తిగా తీసుకుంటే పోలా? ఇంకా తెలుగుజాతి అంటారెందుకు?

"పదాలు ఒక జాతియొక్క మేధశ్చరిత్రని సూచిస్తాయి. పరాయి పదాల్ని భారీగా వాడడమంటే ఒక జాతిగా మనకి బుద్ధిలేదని, స్వకీయత(originality) శూన్యమనీ ఒప్పుకోవడమే అవుతుంది" – అని రాశారు. దీని అర్థమేమిటి వాచస్పతిగారూ?

**–డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు, గుంటూరు**

**పదనిష్పాదనకళ:** నాలుగు నెలలుగా **'అమ్మనుడి'**లో వస్తున్న 'పదనిష్పాదనకళ' ఎంతో ఆసక్తితో చదివిస్తున్నది. శాస్త్రీయంగా వివరిస్తున్నారు. ఇంతకీ మీ రచనలో సంస్కృతపదాలూ, పదబంధాలూ పుష్కలంగా దర్శనమిస్తున్నాయి. చక్కని తెలుగుమాటలను వాడుకోదగినచోట కూడా సంస్కృతాన్నే ఆశ్రయించడం తెలుగుదనమెట్లాఅవుతుంది! తెలుగు ధాతువులనుండి మాటలను పుట్టించే ప్రయత్నం అసలే లేదు! మిమ్మల్ని(మీ రచనను) ఎలా అర్థంచేసుకోవాలి?

**–డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు గుంటూరు**

**పెన్నానది పేర్ల వెనుక చరిత్ర:** రాష్ట్రంలోని నదుల పుట్టుక, పయనం, ప్రవహించే గ్రామాలు, ఉపనదులు, తీరం వెంబడి కొలువైన పుణ్యక్షేత్రాలు, ప్రముఖులు, సాహితీ చారిత్రక ప్రశస్తి గురించి గ్రంథరచన చేస్తున్న నాకు డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి పెన్నా గురించి వ్రాసిన వ్యాసంలోని శాసనాలు, సాహిత్యంలో పెన్నా ప్రస్తావన గురించిన సమాచారం కొంత ఉపయుక్తంగా వుంది.

**– అంగత వరప్రసాదరావు, డైరెక్టర్, భూగర్భజలం & జలగణన శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**జగమునేలిన తెలుగు:** ఈ నవలను పుస్తకంగా వెలువరించండి. చాలా ఆసక్తికరంగా ఉంది. రచయిత్రికి అభినందనలు. ఈ రచనను ఒక పుస్తకంగా వెలువరిస్తే బాగుంటుంది

**–డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఒంగోలు**

**ఆఫ్రికాలో అమ్మనుడి....:** పత్రికలో గిరిజన సంస్కృతి, సాహిత్యం, ఆచారవ్యవహారాలు, వారిపట్ల ప్రభుత్వాల చిన్నచూపు మొదలైన అంశాలపై శక్తి సంస్థ నిర్వాహకులు డా॥ పి. శివరామకృష్ణ వ్రాస్తున్న వ్యాసాల ద్వారా మైదానంలో నివసించే వాళ్ళకు తెలియని విషయాలను పూసగుచ్చినట్లుగా తెలియచేస్తున్నారు. వారి కృషి అభినందనీయం. డిసెంబర్ పత్రికలో గుగి జైలు రచన 'బందీ'లో తనకు స్ఫూర్తినిచ్చిన విషయాలను తడుముతూ 'పరాయిభాష' పరాయి సాహిత్యం మన జ్ఞాపకాలను, ఆయాదేశకాలాలతో మన అనుబంధాలను చంపేస్తాయి అని ఆయా భాషల శాఖల పాఠాలు మార్పిస్తాడు" –అని పేర్కొనడం మన రెండు తెలుగు రాష్ట్రాల వారికి హెచ్చరికగా ఉంది.

**– చెరుకుపల్లి శ్రావణి, హైదరాబాదు**


వీళ్ళంతా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు సార్!
ENGLISH MEDIUM SCHOOL
అయ్యో అయ్యో అయ్యో!
అయ్యో!
అయ్యో
అయ్యో
దక్షిణాదిన వాడే 'అయ్యో' అనే పదాన్ని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో చేర్చడం జరిగింది!
సరసి


సిగ్గుపడి మొహం దాచుకోకండర్లా! ఏమీ అడగన్లెండి బైటకి రండి!!
ఆంధ్ర
బెంగాల్‌లో తెలుగుకు అధికార భాష హోదా తెలుగువారికి గుర్తింపు..
సరసి
బెంగాల్‌లో
తెలుగుకు గుర్తింపు
అధికారిక భాషగా గుర్తించిన మమత కేబినెట్
కోల్‌కతా, డిసెంబరు 22: పశ్చిమ బెంగాల్‌లో తెలుగుకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. తెలుగును మరో అధికారిక భాషగా గుర్తిస్తూ రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం నిర్ణయం తీసుకుంది. బెంగాల్‌లో చాలాకాలంగా తెలుగును అధికారిక భాషగా గుర్తించాలని అక్కడ స్థిరపడిన తెలుగు వారు డిమాండ్ చేస్తున్నారు. ఖరగ్‌పూర్‌లో ఎక్కువగా తెలుగువారు నివసిస్తున్నారు. ఇప్పటికే బెంగాల్‌లో హిందీ, ఉర్దూ, నేపాలీ, గురుముఖి, ఒరియా భాషలను కూడా అధికారిక భాషగా గుర్తించారు. ఆ తర్వాత రాజ్‌బాంగ్షి, కామటపురి, సంతాలి భాషలను కూడా అధికారిక భాషలుగా గుర్తించారు. తాజాగా తెలుగు కూడా ఆ జాబితాలో చేరడం విశేషం. కాగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలుగు వారి మద్దతు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నారు.
ంధ్రజ్యోతి Wed, 23 December 2020
https://epaper.andhra

సంపుటి : 6 సంచిక : 8
**అమ్మనుడి**
జనవరి 2021

సంపాదక హృదయం

# భాషాపెత్తనం దిశగా కేంద్రప్రభుత్వ విధానాలు

**ఒక** భాష తక్కిన భాషలపై పెత్తనం సాగించడం స్వరాజ్యం కాబోదన్న మాటను చెప్పింది గాంధీగారు. హిందీని జాతీయభాషగా ప్రకటించాలనే చర్చ సందర్భంలో ఆయన ఈ మాట చెప్పాడు. అంతేకాదు, మొదటిభాష ఎల్లవేళలా మాతృభాషదేననీ, ఆ తర్వాతే హిందీగానీ, మరేదైనా గానీ అని ఆయన స్పష్టం చేశాడు. "సరైన ఎదుగుదలను అమ్మనుడితోనే పొందగలుగుతామని, అమ్మభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు" అని ఆయన వివరించి చెప్పాడు.

'పరపీడన పరాయణత్వం'తో నిండిన చరిత్ర నుండి బయటపడి స్వేచ్ఛాయుత సమాజాన్ని నిర్మించుకోవడం కోసమే మన స్వాతంత్ర్యోద్యమం నడిచింది. విదేశీయుల పాలన నుండి రాజకీయ విముక్తిని పొందినా పాలకుల పెత్తనం నుండీ, సమాజంలోని అన్ని విధాల ఆధిపత్యాల నుండీ మనం విముక్తిని సాధించవలసి వుంది. ఈ లక్ష్యంతోనే మనం రాజ్యాంగాన్ని నిర్మించుకొన్నాం. ఆ సందర్భంలోనే ఏ ఇతర అంశాల పైనా జరగనంత లోతుగా ఎంతో సమయం 'జాతీయభాష', దేశంలోని ప్రజల భాషల ప్రతిపత్తి, అప్పటికి పాలకభాషగా ఉన్న ఆంగ్ల వినియోగం అనే అంశాల మీద మన రాజ్యాంగ నిర్మాతలు చర్చించారు. చివరకు – జాతీయభాషగా ఏ భాషనూ నిర్ణయించలేకపోయారు. ఆంగ్లాన్ని కొనసాగిస్తూ దానితోపాటు పాలనా అనుసంధాన (link) భాషగా హిందీని వినియోగించుకోవాలని నిర్ణయించారు. అయితే పదిహేను ఏళ్లలో ఇంగ్లీషు స్థానంలో దేశీయ భాషను తేవాలనీ నిర్ణయించారు. కాని, పాలకుల అశ్రద్ధ వల్ల ఆ విషయం మరుగునపడిపోయి, నిరాటంకంగా ఆంగ్లం అన్నివిధాలా పాలనలో బలపడింది. పాలనారంగంలో హిందీని కూడా అన్నివిధాలా అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితం భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం అధికారంలోకొచ్చి పూర్తిబలంతో ముందుకు సాగుతున్నది. తాను అంకితమైన హిందుత్వ జాతీయవాద విధానాలను క్రమక్రమంగా అన్నిరంగాలలోను అమలులో పెడుతున్నది. పాకిస్తాన్, చైనాలతో సరిహద్దుల వంటి సమస్యలతోపాటు, ఉగ్రవాదం, తదితర సమస్యల పరిష్కారానికై కఠిన విధానాలను చేపట్టింది. దానితోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాంతీయ నాయకత్వాలు, బలమైన జాతీయ విధానాలకు అడ్డంకిగా పరిణమించకుండా, కేంద్రాన్ని అత్యంత శక్తివంతమైన అధికార కేంద్రంగా చెయ్యడం కోసం దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చెయ్యడానికి పూనుకొంది. భారతీయ జనతాపార్టీ రాజకీయ ఎత్తుగడలతోపాటు పాలనావిధానాలను గమనించేవారికి ఇది స్పష్టంగా అర్థమవుతుంది.

జాతీయ భద్రతకు సంబంధించిన ఈ విధానాలను ఎక్కువమంది ప్రజలు ఆమోదించవచ్చు. దేశం భద్రంగా ఉండాలనే అందరూ కోరుకొంటారు. అందుకై ప్రభుత్వం అనుసరించే విధానాలలో కొద్దిపాటి భేదాభిప్రాయాలు ఉండవచ్చుగాక. అయితే, రాష్ట్రాలు బలహీనపడాలని ఎవ్వరూ కోరుకోరు.

ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకేసారి ఎన్నికలు, ఒకే పన్నుల విధానం వగైరా నినాదాలు, లక్ష్యాలు బాగానే ఉండవచ్చు. అయితే దేశమంతా ఒకే భాష అంటే కుదరదు. దేశంలోని వివిధ ప్రాంతాల, రాష్ట్రాల మనుగడకు భాష, విద్య, సంస్కృతి, చరిత్ర, సహజవనరులు, అభివృద్ధి వంటి అంశాల్లో కేంద్రం సహకారం అందిస్తూ వాటి అభివృద్ధికి తోడ్పడాలి. అంతేగాని, అందుకు విరుద్ధమైన విధానాలను చేపట్టకూడదు. అప్పుడు ప్రతిఘటన నెదుర్కోవలసివస్తుంది. అది ప్రజల మధ్య ఐక్యతకు, శాంతికి, అభివృద్ధికి భంగం కలిగిస్తుంది.

ఇప్పుడు కేంద్రపాలకులు అనుసరించదలచుకొన్న – ముఖ్యంగా పరిపాలన, విద్యారంగాల్లో భాషా విధానం పట్ల వారు చేపడుతున్న చర్యలు పూర్తిగా సందేహాస్పదంగా ఉన్నాయి. ఇవి రాష్ట్రాల – ముఖ్యంగా హిందీయేతర భాషా రాష్ట్రాల మౌలికతకు, మనుగడకు గొడ్డలిపెట్టు కానున్నాయి. పూర్తిగా అమలులో కొచ్చినట్లయితే క్రమంగా ఇవి దేశైక్యతకు మాత్రమే కాదు, ఈ ప్రభుత్వం ఆశించే హిందూత్వ విధానాలకు కూడా ప్రతిబంధకం కానున్నాయనే అంశాన్ని పాలకులు తెలుసుకోవాలి.

ఇప్పుడు గత ఏడాదికి పైగా చర్చల్లో నలుగుతూ ఇటీవలే బయటకు వచ్చిన జాతీయ విద్యావిధానంలోనూ,

అందులో పేర్కొన్న భాషావిధానానికి సంబంధించిన అంశాల విషయంలోనూ ఈ పోకడ వుంది.

జాతీయ విద్యావిధానంలో ఉన్న ముఖ్యమైన లోపాలను ఆగస్టు, సెప్టెంబరు, డిసెంబరు 'అమ్మనుడి' సంపాదకీయాల్లో ప్రస్తావించాము. అంతేగాక, ఈ అంశంపై కొన్ని వ్యాసాలను కూడా ప్రచురించాము.

ఇప్పుడు తాజాగా ముందుకొచ్చిన మరొక అంశం – 'భారతీయ భాషలకు ఒక జాతీయ విశ్వవిద్యాలయాన్ని' ఏర్పాటు చేస్తూ కేంద్రం తీసుకొన్న నిర్ణయం. దీనిపై భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘ అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు విశ్లేషణాత్మక వ్యాసాన్ని ఈ సంచికలో చదవండి. భారతీయ భాషల అభివృద్ధికి కృషిచేయడం కోసం ఇప్పటికే పనిచేస్తున్న సి.ఐ.ఐ.ఎల్.(మైసూరు)ను శక్తిమంతం చేసే బదులు, దానిని జాతీయ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. భాషలపై పరిశోధన, వాటి అభివృద్ధి జరిగేందుకు కృషి జరగాలి గాని, అందుకై వున్న సంస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలి గాని, విశ్వవిద్యాలయ చట్రంలో దానిని బిగించకూడదనేది ఆయన వక్కాణింపు. నిజమే, భాషల కోసం ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలు ఎంత దీనమైన స్థితిలో ఉన్నాయో మనం చూస్తున్నాం. విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా తన అనుభవంతో వ్రాసిన మాటలతో ఎక్కువమంది ఏకీభవిస్తారు.

దేశభాషలన్నిటికీ మూలం సంస్కృతమనీ, సంస్కృతం నుండే అన్ని భాషలూ పుట్టాయనే విశ్వాసంతో ఉన్నవారు భారతీయ జనతాపార్టీ సైద్ధాంతిక భావజాలంపై పలుకుబడి కలిగివున్నారు. ఇది ఏనాడో తిరస్కరించబడిన ఆధిపత్యవాదం. ఇటువంటి వాదాలకు వర్తమానమూ భవిష్యత్తూ రెండూ ఉండవు. శాస్త్రీయ నిరూపణలకు సరిపడినవే నిలుస్తాయి. ఇప్పుడీ భారతీయ భాషల జాతీయ విశ్వవిద్యాలయ నిర్మాణం కోసం నియమించబడిన మేధావుల్లో కాలం చెల్లిన నమ్మకాలను పట్టుకొని వేళ్లాడేవారిదే పెద్దపీట. భారతీయ భాషలన్నిటినీ సంస్కృతంతో సంస్కరించాలనీ ఆ విధంగా సువిశాల భారతదేశానికొక జాతీయభాషను నిర్మాణం చెయ్యాలనే పవిత్ర లక్ష్యంతో  వీరి ఆలోచనలు సాగుతున్నాయన్నది నిజం కాదా?

ప్రభుత్వం గుర్తించిన విశిష్ట ప్రాచీన భాషలు ఆరు. అవి: తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడం, ఒరియా, మలయాళం. జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకై నియమించిన కమిటీలో వీటి ప్రాతినిధ్యం ఎంత? తెలుగుకు ప్రాతినిధ్యం ఎందుకు లేదు?

భాషారాష్ట్రాలెందుకు ఏర్పడ్డట్లు! మనది యూనిటరీ వ్యవస్థ కాదని, ఫెడరల్ విధానాలను మనం అనుసరించాలని కేంద్రపాలకులకు తెలియదా? రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించని విధంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ దేశాన్ని ముందుకు నడిపించవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై వుంది. భాష చాలా సున్నితమైన అంశం. దీనితో రాజకీయాలాడడమే ప్రమాదం. ఇందుకు సంబంధించి స్వాతంత్ర్యానికి పూర్వమూ, ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ఎన్నో చేదు సంఘటనలనూ చరిత్రనూ మనం చూశాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది రాజకీయ విస్ఫోటనాన్ని కలిగించే ప్రమాదం ఉన్నది.

చివరగా మరొకమాట : పాలకులు ఈ దేశ ఐక్యతా సాధకంగా హిందుత్వ అంశాన్ని చూస్తున్నారు. అయితే హిందుత్వ అనే మాటకు వీరు చెప్పే అర్థం వేరు. విశాల హైందవ భావనతో కూడుకున్న పరిభాష అది. అది మతాలకు అతీతం. ఈ పుణ్యభారతదేశంలోని అన్నిమతాల అవలంబకులూ హిందువులేనని అంటారు. కాని, హిందూ అనే మాట వినగానే చాలామంది దాన్నొక మతంగా అనుకొంటారు! నిజానికి ఈ పాలకపార్టీని బలపరచేవారిలో కూడా కొన్ని వర్గాలు ఆవిధమైన ఆలోచనలతో ప్రభావితమైనవే. అదృష్టవశాత్తూ వీరి సంఖ్య పరిమితం. అయితే అన్నిరకాల హిందూభావజాలాల వారిలోనూ ఉన్న భావన సంస్కృతం దైవభాష అని. అందుకే దానిపట్ల ఆరాధనాభావం. దేవుడికి రూపమే లేనప్పుడు దైవభాష ఎక్కడనుండి వచ్చింది! సంస్కృతం కూడా మానవసమాజం నిర్మించుకొన్న భాషే. అది కొన్ని ప్రయోజనాలకు అద్భుతంగా తన పాత్రను నిర్వహించి, చరిత్రలో నిలిచిపోయింది. దాన్ని మనం గౌరవించుకోవాలి. కావాలంటే నేర్చుకోవాలి. అంతేగాని, దాన్ని ఒక 'వేలుపుభాష'గా చేసి, ప్రత్యేక పవిత్రతనాపాదించడమేగాక, ప్రజాభాషలనెత్తిన ఆధిపత్యం వహించే సాధనంగా వారి జీవితాల్లోకి చొరబడడాన్ని సహించకూడదు.

ఇప్పుడు భారతీయ భాషల జాతీయ విశ్వవిద్యాలయం ఆలోచన రెండు రకాలుగా తప్పు. 1. ఆచరణలో దేశీయభాషల అభివృద్ధికి ఉపయోగపడకపోగా, ఇప్పుడు అప్రతిష్టకు లోనవుతున్న అనేక విశ్వవిద్యాలయాల సరసన ఇదీ చేరుతుంది.

2. ఈ విశ్వవిద్యాలయ ఆశయాలు సందేహాస్పదం. వాటిని పైన వివరించాము. అదంతా నిజమే అయితే, ఇది దేశానికీ ప్రజలకూ విషాదాన్నే మిగిల్చుతుంది.

కేవలం పార్టీ రాజకీయాల కోణం నుంచిగాక, దేశంయొక్క ప్రజలయొక్క శ్రేయస్సునూ, భవిష్యత్తునూ దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలని పాలకవర్గాల నేతలకు, మేధావులకు, ప్రజానీకానికి మనవి చేస్తున్నాము!

సామల రమేష్ బాబు

తేదీ : 30-12-2020



ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# 'భారతీయభాషల సంస్థ' విశ్వవిద్యాలయంగా మారుతోందా?!

నవంబరు 27, 2020 న భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యా విభాగంలోని భాషా విభాగం ఒక జీ.ఓ.ను విడుదలచేసింది. స్థూలంగా ఆ జీ.ఓ. ప్రకారం ఇప్పుడు మైసూరులో ఉన్న భారతీయభాషల సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) అనే కేంద్ర ప్రభుత్వసంస్థను భారతీయ భాషా విశ్వవిద్యాలయంగా మార్చాలి. కొత్తగా ప్రారంభించబోయే భారతీయ అనువాద, వ్యాఖ్యానాల సంస్థను కూడ అందులో చేర్చాలి. దీనికోసం పదకొండుమంది సభ్యుల సలహాసంఘం ఒకదానిని కూడా ఏర్పాటు చేసింది. పత్రికలలో వచ్చిన వార్తల ప్రకారం ఈ పనులన్నీ రెండు నెలల్లో జరగాలి. ఆ జీ.ఓ. సారాంశం ఇలా ఉంది:

మైసూరులో ప్రతిపాదిత భారతీయ భాషల విశ్వవిద్యాలయమూ (భాభావి) ఇంకా అనువాద, వ్యాఖ్యానాల భారతీయ సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, ఐఐటిఐ) విధివిధానాలను వివరించడానికి ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేయడమైనది. ఈ సలహాసంఘం ఈ దిగువన చూపిన నిబంధనలలో పేర్కొన్న సూచనల ప్రకారం సమస్యలను అధ్యయనం చేసి, తమ సిఫారసులను ప్రభుత్వ పరిశీలన కోసం అందించాలి.

భారతీయ భాషలవిశ్వవిద్యాలయ లక్ష్యాలనూ ఉద్దేశాలను కమిటీ సిఫారసు చేయాలి. అందులో భారతీయభాషల సంస్థ (సిఐఐఎల్) లక్ష్యాలనూ ఉద్దేశాలనూ కూడా చేర్చాలి. అనువాద, వ్యాఖ్యానాల భారతీయ సంస్థకి స్వయంప్రతిపత్తిని ఇస్తూ భారతీయ భాషల విశ్వవిద్యాలయ పాలనా నిర్మాణం జరగాలి. భారతీయ భాషల విశ్వవిద్యాలయం (భాభావి) ఇంకా అనువాద, వ్యాఖ్యానాల భారతీయ సంస్థ (అవ్యాభాసం) లో విభాగాలూ, కేంద్రాలూ శిక్షణాశాలలూ ఉంటాయి. భాభాసం (సిఐఐఎల్) కి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను ఈ సలహాసంఘం అధ్యయనం చేసి, భూమి, భవనాలు, మానవశక్తి (విద్య+విద్యేతర) ఇంకా వాటిని ప్రతిపాదిత భారతీయ భాషల విశ్వవిద్యాలయ (భాభావి), అనువాద, వ్యాఖ్యానాల భారతీయ సంస్థల(అవ్యాభాసం) కోసం వినియోగ పరంగానూ వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలనూ సూచించాలి.

భారతీయ భాషల సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్)ను ఐఐటిఐతో సహా భాభావిగా మార్చడానికి కావలసిన పెట్టుబడి, తిరుగుడల (కాపిటల్, రికరింగ్) మొదలైన ఆర్థిక అవసరాలను కూడా కమిటీ సూచించాలి. ఏదైనా అదనపు భూమి అవసరమైతే కూడా ఈ సలహాసంఘం సూచించవచ్చు. భాభాసం (సిఐఐఎల్)ను అవ్యాభాసం (ఐఐటిఐ)తో కూడిన భాభావిగా మార్చడానికి అవసరమైన పరివర్తనా నిబంధనావళిని సమకూర్చాలి. ప్రాచీన భాషల విశిష్ట అధ్యయన కేంద్రాల (ఎక్సలెన్సు సెంటర్స్ ఆఫ్ క్లాసికల్ ల్యాంగ్వేజస్) పని తీరును అధ్యయనంచేసి వాటిని ప్రతిపాదిత విశ్వవిద్యాలయంలో ఎలా కలపవచ్చో సూచించాలి.

ఈ పనులు చేయడానికి ఉద్దేశించిన సలహాసంఘానికి భారత దేశానికి పూర్వ ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసి ఇప్పుడు తిరుపతిలోని కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయానికి ఛాన్సెలర్‌గా ఉన్న పద్మభూషణ్ ఎన్. గోపాలస్వామి, ఐఏఎస్. గారు నేతృత్వం వహిస్తున్నారు. ఆయన తరువాత ఇందులో ఇంకా, విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం అధ్యక్షుడూ, భాభాసం ఇన్చార్జ్-డైరెక్టరూ కూడా కేంద్ర ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా ఉన్నారు. ఇక మిగిలినవారిలో తమిళం, హిందీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఒడియా, సంస్కృత భాషలకు చెందిన సాహితీవేత్తలు సభ్యులుగా ఉన్నారు. వీరు కాక సంస్కృత ప్రమోషన్ ఫౌండేషన్‌కు చెందినవారు మరొకరు. వీరిలో అందరూ సాహిత్యకారులే. అయితే, సమస్యల్లా ఎక్కడ వచ్చిందంటే, భారతీయ భాష సంస్థ మాత్రం భాషాశాస్త్రానికి సంబంధించిన సంస్థ. ఈ సలహాసంఘంలో భాషాశాస్త్రజ్ఞుల ప్రాతినిధ్య లేమి కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

**భాషల శాస్త్రీయ అధ్యయనమే ప్రధాన లక్ష్యంగా భారతీయ భాషా సంస్థ (సి.ఐ.ఐ.ఎల్.) ను ఇప్పటికి సరిగ్గా 50 ఏండ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నెలకొల్పింది. భాషల మధ్య తులనాత్మక పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఉమ్మడి లక్షణాల అధ్యయనంద్వారా భారతీయ భాషలను సమన్వయపరుస్తూ ఐక్యతను పెంచడానికీ వాటి అభివృద్ధికి సహాయపడటం ద్వారా ఈ దేశ ప్రజల భావోద్వేగ సమైక్యతకు దోహదం చేయటం దీని ఉద్దేశం. భాషా విశ్లేషణ, భాషా బోధన, భాషా సాంకేతికత, భాషా వినియోగం, విద్య, అక్షరాస్యత, సామాజిక మాధ్యమాలూ, పాలన, భావోద్వేగ సమైక్యత వంటి వివిధ సామాజిక - సాంస్కృతిక రంగాలలో భాషకు సంబంధించి ఎప్పటికప్పుడు పొడసూపే సమస్యల పరిష్కారానికి వాటిపై పరిశోధన, వాటి అభివృద్ధి కార్యకలాపాలన్నీ దీని ద్వారానే నిర్దేశించబడతాయి.** అల్పసంఖ్యాక, ఆపన్న, అంతరించిపోతున్న భాషలూ వాటి సంస్కృతుల వివరణ, క్రోడీకరణలో ఈ సంస్థ పాల్గొంటుంది. విద్యారంగంలో వాటి ఉపయోగం కోసం నమూనాలు, పద్ధతులు, బోధనాసామగ్రి, మానవ వనరులను కూడా అభివృద్ధి చేస్తుంది. 8వ షెడ్యూల్‌లో ఉన్న భాషల అభివృద్ధికి ప్రణాళికల రచన, అన్ని స్థాయిలలో బోధన, పరిపాలనా

మాధ్యమంగా వీటి వినియోగానికి సంబంధించి ప్రభుత్వ విధానాల అమలు చేయడంలో ఈ సంస్థ ప్రభుత్వానికి సహాయపడుతుంది. దీనికి దేశమంతటా ప్రాంతీయ భాషా బోధనా కేంద్రాలు ఉన్నై (రీల్యాసం). వీటిలో 15 భారతీయ భాషల్లో అనేక కోర్సులద్వారా ఆయా భాషలను బోధిస్తారు. ఈ మధ్యనే ఈ సంస్థకు క్లాసికల్ భాషల విశిష్ఠ కేంద్రాల నిర్వహణ బాధ్యతను కూడా అప్పగించారు. ఈ దేశంలోనూ విదేశాలలోనూ భారతీయ భాషల అభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాలపైన దీనిదే చివరిమాట..

అందువల్ల భాషా పరిశోధన తదితర అభివృద్ధి విభాగాలలో ముఖ్యమైన సహకార యోజనలను రూపొందించడానికీ అమలు చేయడంలో ఈ సంస్థకు ప్రత్యేక చట్టబద్ధత ఉంది. మరి అటువంటి సంస్థను కేంద్రం ఎందుకు భారతీయ భాషల విశ్వవిద్యాలయంగా మార్చాలని అనుకుంటోంది? కారణాలు అనేకం. అంటే విశ్వవిద్యాలయంగా మార్చితే ఇప్పుడున్న భారతీయ భాషల సంస్థ పనితీరు మెరుగుపడుతుందనా? లేక భాషాశాస్త్ర పరిశోధనలతోబాటు బోధన, డిగ్రీలను ప్రదానం చేసే సంస్థగా మార్చాలనుకొంటోందా? ఇప్పటికే దేశంలో ఎన్నో రకాల భాషా విశ్వవిద్యాలయాలు ఉన్నై. వాటిలో కొన్ని మచ్చుకి: రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, పంజాబీ, ద్రావిడ విశ్వవిద్యాలయాల తోపాటు, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఆంగ్ల, విదేశీ భాషల విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయం, ఇందిరాగాంధీ జాతీయ తెగల విశ్వవిద్యాలయం, గోవింద్‌గురు తెగల విశ్వవిద్యాలయం, మణిపూర్ తెగల విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ కేంద్ర తెగల విశ్వవిద్యాలయం, తెలంగాణా తెగల విశ్వవిద్యాలయం, ఇంకాకొన్ని ఇలాంటివే భాషా సంస్కృతులే ప్రధానంగా ఏర్పడిన విశ్వవిద్యాలయాలు ఉన్నై. **పరిశోధనా సంస్థలను విశ్వవిద్యాలయాలుగా మార్చితే పనితీరు మెరుగవుతుందను కోవడంలో ఔచిత్యం ఏమీలేదు. ఇప్పటికే భాషా సంస్కృతులకు అనేక విశ్వవిద్యాలయాలు ఉండగా మరో పరిశోధనా సంస్థను విశ్వవిద్యాలయంగా మార్చడం దేనికి సంకేతం?** భారతీయ భాషా సంస్థను ఇదివరలో అంటే 2011 లో ఒకసారి ఇలానే విశ్వవిద్యాలయంగా మార్చడానికి ఒక 60 పుటలతో అన్ని హంగులూ ఆర్భాటాలతో ముసాయిదా ప్రతి తయారైంది. దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే సమయానికి ఆ పనికంతటికీ పూనుకొన్న కేంద్ర ప్రభుత్వ ఉన్నతవిద్యాశాఖ సెక్రటరీ మారడంతో అది మూలబడింది. ఇలా మళ్ళీ బల్లమీదకు రావడానికి కారణం ఏమిటని ఆలోచిస్తే మనకు ఒక విషయం బోధపడుతోంది. భాభాసం కేంద్ర హిందీ సంస్థాన్, కేంద్ర ఇంగ్లీషూ విదేశీ భాషల సంస్థ, కేంద్ర సంస్కృత సంస్థలతోపాటు ఇతర భారతీయ భాషలలో పరిశోధనకోసం ప్రత్యేకంగా ఏర్పరిచిన సంస్థ. 1969లో పద్మశ్రీ డా. దేవీప్రసన్న పట్టనాయక్ నిర్దేశకత్వంలో మొదలైంది. వందలాది పరిశోధకులతో కొంత కాలం సజావుగా నడిచి ఏర్పరచుకున్న లక్ష్యాలను నెరవేరుస్తూ సాగిన సంస్థ. అయితే గత రెండు దశాబ్దాలుగా రిటైరు అయిన ఉద్యోగుల స్థానాలను మళ్ళీ నింపక పోవడంతో ఈనాడు ఆ సంస్థలో పట్టుమని పది పదిహేను మంది పరిశోధకులు గూడా లేని పరిస్థితి. గడిచిన పదేళ్లలో అసలు నిర్దేశక నాయకత్వం లేకుండానే గడిచింది. ఇప్పటికీ ఆ సంస్థకు అవసరమైన భాషాశాస్త్రవేత్త నిర్దేశక నాయకత్వం లేకుండానే నడుస్తోంది. ఇలా పరిశోధకులను ఎంపికచేయకుండా, ఖాళీ పడిన స్థానాలను నింపకుండా రెండు దశాబ్దాలపాటు ఏ సంస్థ మాత్రం తనకు ఉద్దేశించిన లక్ష్యాలను సాధించుకొంటూ పోగలదు. ఇలా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిర్వీర్యం కావడానికి ముఖ్య కారణం కేంద్ర ప్రభుత్వ లోపమే. అలా నిర్వీర్యం చేసిన సంస్థను మళ్లీ పునరుద్ధరించేందుకు భారతీయ విశ్వవిద్యాలయంగా మార్పిడి అనే కొత్త ఆలోచనను బయటపెట్టింది.

**ఆయితే ఈ ఆలోచనపై రెండు రకాల అభిప్రాయాలు ఏర్పడినై. ముఖ్యంగా, ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగవర్గంలో ఎక్కువమంది ఈ మార్పును ఆహ్వానిస్తున్నారు. కారణం, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నిర్వాకంతో నిద్రావస్థకు చేరిన తమ సంస్థకు కొత్త రక్తం ఎంతో కొంత అందుతుందని నమ్మకం కలగడం. విశ్వవిద్యాలయంగా రూపొందితే కేంద్ర ప్రభుత్వ కట్టుబాట్ల నుంచి బైటపడి విశ్వవిద్యాలయాలకు ఉండే స్వయంప్రతిపత్తితో కొత్త ఊపిరి పీల్చుకోవచ్చునే ఆలోచన. ఇక రెండవ అభిప్రాయం, దేశమంతటా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలూ సంస్థలలో ఉన్న భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. వీరందరూ ఈ సంస్థను భాషాశాస్త్ర పరిశోధనలకు ఒక ఆర్థిక వనరుగానూ, సమాచార నిధిగానూ ఎన్నో అవకాశాలను అందించే కామధేనువుగా చూస్తున్నారు. ఒకవేళ ఇదేగనక విశ్వవిద్యాలయంగా రూపొందితే వారందరికీ వనరులనిధి దాదాపుగా అడుగంటినట్లే అని భావిస్తున్నారు. అయితే భారతీయ భాషల సంస్థను ఒక విశ్వవిద్యాలయంగా మార్చి దాన్ని ఒక గొప్ప అంతర్జాతీయ స్థాయి పరిశోధనా సంస్థగా రూపొందుతుందని అనుకోవటంకంటే దాన్ని ఇప్పుడు ఉన్న సంస్థగానే ఉంచి స్వతంత్ర ప్రతిపత్తిని గనక అందించగలిగితే దాంట్లో ఏర్పడిన వందలాది ఖాళీలను నింపుకొని గణనీయంగా గుణాత్మకమైన పరిశోధనల బాట పట్టవచ్చు. ఎన్నో జాతీయ పరిశోధనా సంస్థలు స్వయం ప్రతిపత్తితో తమ పరిశోధనలలో విజయాలను సాధించి అంతర్జాతీయ స్థాయిలో మన్ననలను పొందాయి. ఇప్పుడు భారతీయ భాషల సంస్థకు కూడా స్వయం ప్రతిపత్తే మందు. స్వయం ప్రతిపత్తితో కొత్త ఊపిరులతో కోల్పోయిన ప్రాభవాన్ని పొందడమేగాక మళ్లీ అంతర్జాతీయ స్థాయిని పొందే అవకాశం వస్తుంది.**

విశ్వవిద్యాలయంగా మారితే పూర్వ ప్రాభవం రాదా? అంటే రావచ్చు. గుణాత్మకమైన పరిశోధనలు ఆ సంస్థలో ఉన్న ఉద్యోగ వర్గంపై ఆధారపడివుంటాయి. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న పరిశోధనా సంస్థలు ఏవీ అభివృద్ధిపథంలో నడిచినట్లు దాఖలాలు లేవు. విద్యాసంస్థలు, పరిశోధనాసంస్థల అభివృద్ధి వాటి స్వయం ప్రతిపత్తిపై ఆధారపడివుంటుంది. **చీటికిమాటికి అధికారుల చెప్పుచేతలలో నడిచే సంస్థలు అనేక రకాల సామాజిక రుగ్మతలకులోనుకాక తప్పదు. విద్యా-పరిశోధనా వ్యవస్థలు అధికార నియంత్రణ నుండి బైటపడాలి. న్యాయవ్యవస్థకు ఉన్న స్వయంప్రతిపత్తిలాగే విద్యావ్యవస్థ కూడా పూర్తిగా తనకు తానే ఒక స్వతంత్ర వ్యవస్థగా కొనసాగిన నాడే-మన విద్యా పరిశోధనా రంగాలు అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధిని సొంతం చేసుకోగలవు.**

స.వెం.రమేశ్

# కొత్తమాటల పుట్టింపు

**అందరికీ** చేమోడుపులు. ఒక నుడిని బాగా ఎదిగిన నుడి అని చెప్పడానికి ఆనవాలు ఏమిటి అంటే, పెరనుడి నుండి వచ్చిన ఏ మాటకైనా తన కుదురులతోనే కొత్తమాట పుట్టింపుకు వీలు కలిగించగలగడం. అటువంటి నుడులు, అంటే బాగా ఎదిగిన నుడులు, వేళ్లమీద లెక్కించగలిగినన్నే ఉన్నాయి. మన బారతనాడులో వేలేండ్ల కిందటనే పాళీ, సంసుక్రుతం ఎదిగిన నుడులు అయినాయి. ఇటీవల తమిళం కూడా ఈ మట్టుకు చేరుకొనింది.

ఇట్ల తన కుదురులతోనే మాటలపుట్టింపుకు వీలుకలిగించే చేవ తెలుగుకు ఉందా అంటే లేదు లేనేలేదు అంటున్నారు తెలుగు తెలివరు(మేదావు)లు. ఉంది అనేది నా అందింత(ప్రతిపాదన). తెలుగులో ఇదివరకు ఎన్నడూ కొత్తమాటలు రాలేదా, ఎవ్వరూ కొత్త మాటల్ని తేలేదా అంటే ఆ పని జరిగిందనే చెప్పాలి. ఎట్లా జరిగింది? అయిదు తీరులుగా జరిగింది.

1. ఉన్నదున్నట్లుగా పెరనుడి మాటలను తెచ్చుకొని వాడడం. స్వేచ్ఛ, చరిత్ర, బస్, కార్ వంటివి.
2. పెరనుడి మాటలకు ‘డు, ము, వు, లు’ చేర్చి వాడడం. అధ్యక్షుడు, వికలాంగుడు, శౌచాలయం, ముద్రణాలయం వంటివి.
3. పెరనుడి మాటలను తెలుగు చప్పుడుకు వీలుగా మార్చుకొని వాడడం. సంద్రం, కబురు, ఆసుపత్రి, బస్సు, కారు వంటివి.
4. ‘అచ్చతెలుగు’ పేరుతో చేంతాడంత మాటల్ని పుట్టించడం. అంచయేనుగుమావంతు, చదువుల ముదుకడు, గడుసుకైదువ జోదు, మినుకుటూర్పులవాడు, ఏనుగుతోలుదాల్పు, కప్పుగుత్తుకవాడు వంటివి. పై నాలుగు తెరగులూ చదువునేర్చినవారూ తెలివరులూ నుడివరు(బాషావేత్త)లూ చేసిన చేస్తున్న పని. మొదటి రెండుతీరులూ అయితే నన్నయనుండి లేదా ఇంకా ముందునుండి, ఇప్పటి ‘ఈనాడు’ వరకూ సాగుతూ వస్తున్నాయి.
5. చదువుతో పొంతులేనివారు, పల్లెటూరి పాటరు (శ్రామికు)లు, అడుగుబడుకు బతుకులు పుట్టించే మాటలు. రామములక(టొమేటో), గబ్బుచమురు(కిరోసిన్), వానగూడ(రెయిన్ కోట్), పొద్దుమాను(గడియార స్తంబం), రెక్కమాను(రైల్వేసిగ్నల్ పోల్), చిచ్చుగోలు(గ్యాస్టవ్ లైటర్), చలిచట్ట(స్వెటర్) వంటివి. పైవాటికంటే ఈ తీరు మాటలే గొప్పవి. ఇవే అప్పటపు తెలుగుమాటలు. తెలివరుల కంటే పాటరులే మేలు అనిపిస్తుంది కదా. అయితే తమ కంటిముందుకు వచ్చిన కొత్త ఉరువులకు పేర్లు పెట్టగలరు కానీ ఆనిమి(సాంకేతిక) మాటలను పుట్టించలేరు, ఎసిది(శాస్త్ర) నెన్నొడి (పరిబాష)ని పొందించలేరు పాటరులు.

**‘ఆనిమిమాట’ అనడానికి దానికి రెండు ఆలుడు(లక్షణా)లు ఉండాలని నుడివరులు చెపుతుంటారు. 1) విడమరచి చెప్పినట్లుగా కాకుండా చిట్టిపొట్టి మాటగా ఉండాలి 2) తననుండి మరికొన్ని మాటల పుట్టుకకు తావునివ్వాలి. ఈ రెండు ఆలుడులు తెలుగుకు లేవు, కాబట్టి తెలుగులో ఆనిమి మాటలను పొందించలేము అంటారు నుడివరులు. ఇది పెద్ద తప్పుడుమాట. అక్కరలేమితో పట్టనితనమన్నా అయుండాలి, వెతకలేక సోమరితనమన్నా అయుండాలి, తెలుగును తొక్కేయాలనే కుత్రతలపన్నా అయుండాలి, అంతేకాని ఇది వాళ్ల తెలివితక్కువతనం మట్టుకు కానేకాదు.**

తెలుగులో కుదురులూ చేర్పులూ కలసిన మాటలు చాలా చాలా ఉన్నాయి. కుదురుల నుండి చేర్పులను విడదీయాలి. ఎటువంటి కుదురుకు ఎటువంటి చేర్పు కలిస్తే కొత్తమాట పుడుతున్నదో చూడాలి. ఆ తీరులో కొత్తమాటలను పుట్టించాలి. కొన్ని పనిపలుకు(క్రియావాచకా)లకు చేర్పులను చేర్చితే పేరుపలుకులు(నామవాచకాలు) పుడుతాయి : కోరు+ఇక=కోరిక. కొన్ని పేరుపలుకులకు చేర్పులను చేర్చితే కొత్త పేరుపలుకులు పుడుతాయి : ఎరుక+ఉవ=ఎరుకువ. కొన్ని పేరుపలుకులకు చేర్పులను చేర్చితే కొత్త పనిపలుకులు పుడుతాయి : పుప్పొడి(pollen) +ఇల్లు = పుప్పొడిల్లు(pollenise); పుప్పొడి+ఇంచు= పుప్పొడించు(pollinate). ఈ పుప్పొడించు అనే పనిపలుకును మరలా పేరుపలుకుగా మార్చవచ్చు : పుప్పొడించు = పుప్పొడింత(pollination).

తెలుగులో మునుచేర్పులను వెనుచేర్పులను వెతకడం మొదలిడితే ఇప్పటికే నాకు నూటికి పైగా కనబడినాయి. నేను నుడివరిని కాను, నుడెసిదిని(బాషాశాస్త్రాన్ని) చదవలేదు. నుడివరులు నడుము కట్టుకొని వెతికితే ఇంకా ఎన్నో దొరుకుతాయి.

నాది లేదా మనది అనే చెడ్డనుగు(దురబిమానం)తో చెప్పడం లేదు. నేనెరిగిన నాలుగయిదు నుడులలో ఎంతో చేవ కలిగినది తెలుగు. తెలుగులో ఎసిదానిమి(శాస్త్రసాంకేతిక) మాటలను పుట్టించడం చాలా తేలిక. అవి కూడా చిట్టి పొట్టిగా అలతి అలతిగా పలకడానికి తేలికగా ఉంటాయి. పెరమాటలతో కాకుండా తెలుగుమాటలతో పిల్లలకు చదువులు చెపితే పిల్లలూ ఎదుగుతారు తెలుగూ ఎదుగుతుంది. ‘డు, ము, వు, లు, ని, ను, కి, కు, వల్ల, నుండి, ఇంచు/ఇంచి, కోసం, తో, కంటే, చేసి....’ ఇటువంటి కూర్పులనూ చేర్పులనూ మట్టుకే మిగిలించి, మిగిలినదంతా పెరమాటలతో నింపేసి, తెలుగు ఇక్కువం(మాద్యమం)లో చదువులు సాగాలని చాటడం సరికాదు. మన్నించండి, ఎవరినీ నొప్పించాలని ఈమాటను అనలేదు, తెలివరులూ నుడివరులూ ఇకనైనా తెలుగును తలకెత్తుకొంటారనే ఆబతో అన్నాను.

ఈ నోయి(గ్రందం)ని రాయాలనే కోరిక పదేళ్లనాటిది. చేర్పుల కోసం నా వెతుకులాట అప్పుడే మొదలయింది. నాలుగేళ్ల కిందటే

నలబై పొరట(పేజీ)లను రాసి, వేరే పనుల ఒత్తిడితో పక్కన పడేసినాను. మరలా ఇన్నేళ్లకు దుమ్ముదులిపినాను.

తెలుగు ఎంతో చేవకలిగిన నుడి. చేతనయిన నుడి. ఇంత గొప్ప నుడి ఒడమి(సంపద)ని పాతర వేసి పెట్టేసి, పొరుగిళ్ల దగ్గర అడుక్కొని తింటున్నాం. ఇకనైనా మన కలిమిని వెలికితీద్దాం.

**1**

"కాపటేళ లేసింది కాపుగువ్వ
కానలోకి పోయింది కాపుగువ్వ
కడుపు బరువు దించింది కాపుగువ్వ
కాళ్లు కడుక్కోనొచ్చింది కాపుగువ్వ

కుంపట్లో బొగ్గునెత్తి కాపుగువ్వ, పల్
కసబిసా తోమింది కాపుగువ్వ
కాడిమడక కట్టుకొని కాపుగువ్వ
కాన దున్నేకి కదిలింది కాపుగువ్వ "

మా పక్కింట్లో ఒక ముసలవ్వ ఉంది. కాపటేళకే (వేకువనే) లేచేస్తుంది. వక్కరోట్లో వక్కాకును పెట్టి టక్కుటిక్కుమని దంచతా పైపాటను అందుకొంటుంది. ఇక మనం కునకాలన్నా కునకలేము. ఏదో నాలుగు నుడుగులు అయితే పోనీలే అనుకోవచ్చు. కాపటేళ నుండి మాపటేళ వరకూ కాపుగువ్వ చేసే పనులన్నీ ఉంటాయి ఆ పాటలో. నారుచల్లడం నుండి పైరుకోత వరకూ వరిపంట కాపుదన మంతా ఉంటుంది అందులో. చేయగలిగింది ఏమీ లేదు మేలుకొని లేవడం తప్ప.

లేచి పడకను చుట్టిపెట్టి, నీళ్లర(బాత్‌రూం)లోకి వెళ్లినాను. మరుగుదొడ్డి మునకతొట్టీ(బాత్ టబ్) ఒకే అరలో ఉంటాయి మాయింట. కడుపుబరువుని దించినాను. చేగడుగు(హేండ్ వాష్)తో చేతుల్ని రుద్దినాను. పలుదుం(టూత్ బ్రష్) మీద పదదు(పేస్ట్)ను వేసుకొని పళ్లు తోముకొన్నాను. మూతిముక్కూ కడుక్కొన్నాను. తుండడ(టవల్)తో తుడుచుకొన్నాను. కాసేపు పసలిక(వ్యాయామం) చేసినాను. మరికాసేపు సోదాకిక(వార్తాపత్రిక)ను తిరగేసినాను. ఆకలివేస్తుంటే నలిదిండి(టిఫిన్) చేసుకొందామని లేచినాను. కొద్దిగా నూక ఉంటే, ఉప్పిండి చేసుకొని తినినాను. కానీరు(కాఫీ) కాచుకొని తాగినాను. ఇవ్వేళ రాతపనేమీ లేదు. తోటపని కూడా లేదు. తోచక చిన్నయ్యవాళ్ల ఇంటితట్టుకు అడుగులు వేసినాను.

నన్ను చూసిన చిన్నయ్య, "రా అన్నయ్యా రా, నీకోసమే ఎదురుచూస్తున్నాం" అని రాకేర్చి(స్వాగతించి)నాడు నన్ను.

అప్పటికే అక్కడ నారాయణ, సెందిల్ కూడా కూర్చుని వున్నారు. ఏదో పెనగువ(చర్చ) గట్టిగా జరుగుతున్నట్లుంది వాళ్ల నడుమ.

''ఉసురువం(ప్రపంచం)లో ఏమూలనుండి కొంగొత్త ఆనిమిమాట(సాంకేతికపదం) వెలువడినా, దానికి ఈడైనమాటను అన్నినుడులలోనూ పుట్టించలేము. ఉసురువంలోని ఏడువేల పైచిలుకు నుడులలో కొంగొత్త ఆనిమిమాటల పొందికకు అనువు అయినవి సంసుక్రుతం, గ్రీకు, లాటిన్ వంటివి అయిదారుమట్టుకే ఉన్నాయి. ద్రావిడనుడులకు ఆ చేవ లేనేలేదు" అన్నాడు నారాయణ.

''ద్రావిడనుడులు అని అన్నిటినీ ఒకే గాటన కట్టద్దు. ఆనిమిమాటల పుట్టింపుకు మా తమిళ్ చాలా అనువయినది. మీకు తెలియదేమో, మేము మరెసిద(ఇంజినీరింగ్), విరుగెసిద(మెడిసన్)కి చెందిన ఆనిమిమాటలను అన్నిటినీ తమిళ్‌లో పుట్టించుకొన్నాం" అంటూ తగులుకొన్నాడు సెందిల్.

"నారాయణా, తెలుగంటే నీకు చిన్నచూపు. సంసుక్రుతం మట్టుకే గొప్పనుడి అని నీ అనిపింపు. అందుకనే ఇట్ల మాట్లాడుతున్నావు" అన్నాడు చిన్నయ్య.

"ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకు? నేను చెప్పింది నిక్కం. ఆనిమిమాటల్ని పుట్టించడంలో సంసుక్రుతానికి ఉన్న చేవలో ఒక్కవంతు కూడా తెలుగుకు లేదు" కుండబద్దలు కొట్టినట్లు అన్నాడు నారాయణ.

ఇక నేను కలిపించుకోక తప్పలేదు. "నువ్వు చెపుతున్నది తప్పు నారాయణా. సంసుక్రుతం ఒకప్పుడు మన బారతనాడులో పెన(అనుసందాన)నుడిగా ఉండేది. కాబట్టి రెండువేలేళ్ల నుండి వెయ్యేళ్ల కిందటివరకూ సంసుక్రుతంలోనే ఎసుదు(శాస్త్రా)లన్నీ వెలువడినాయి. ఆ తరిలోనే, ఆనిమిమాటలూ, వాటి పొందికకు కావలసిన పలు నుడిగంటు(నిగంటువు)లూ సంసుక్రుతంలో ఏర్పాటు అయినాయి. తెలుగులో ఆ పనిని ఇంతవరకూ మొదలు పెట్టలేదు. మొదలిడి చేసితే సంసుక్రుతం కంటే చిన్నమాటలతో తెలుగులో నెన్నొడి పుడుతుంది" అన్నాను.

"నువ్వు చెప్పేది నిక్కం అయితే, ఏదయినా ఒకమాటను పుట్టించి చూపించు. వెర్టిబ్రేట్ అనే ఇంగ్లీసు ఆనిమిమాటను, సంసుక్రుతం ఆనుగా తెలుగులో సకశేరుకం అనవచ్చు. దానికి ఎదురుమాట అకశేరుకం. వీటిని తెలుగుకుదురులతో ఎట్ల చెప్పగలం. వెన్నెముక కలవీ, వెన్నెముక లేనివీ అని విడమరపుగా చెప్పగలం కానీ ఆనిమిమాటలుగా చెప్పగలమా?" డీకొంటూ అడిగినాడు నారాయణ.

"బాగా చెప్పగలం. చెప్పాలన్న కోరిక కలగాలి ముందు. తెలుగులో ఒక విడిత(ప్రత్యేకత) ఉంది. కొన్ని మాటలకు ఉమ్మడిగా ఒక్కొక్క చేర్పు కనబడుతుంటుంది. ఇట్లాంటి ఒక చేర్పు 'ఏలు'. ఇది విడిగా నుడిగంటులలో కనబడదు. ఇదివరకు చెప్పినట్లు, తెలుగులో ఇటువంటి పనులను మనం ఇంకా మొదలిడలేదు కాబట్టి, నిండైన నుడిగంటులు వెలువడలేదు. కుందేలు, తాబేలు, తోడేలు, పొట్టేలు, గొడ్డేలు, ఆడేలు అనే పేరులలో ఉమ్మడిగా 'ఏలు' ఉంది. ఏలు అంటే 'జీవి' అనే తెల్లం(అర్తం) తెలుస్తున్నది కదా. ఈ ఏలును చేర్పుగా చేసి కొత్త ఆనిమిమాటలను పుట్టించవచ్చు. నువ్వు అడిగింది అకశేరుకం, సకశేరుకం అనే రెండు మాటలకే. అకశేరుకాల్లోని తొమ్మిది వగలకు పేర్లను పెట్టలేక ఊరుకొన్నారు మీ సంసుక్రుతంవాళ్లు. అవి గ్రీకు, లాటిను మాటలుగా అట్లాగే ఉన్నాయి

తెలుగు పొత్తాలలో. అన్నిటికీ తెలుగుపేర్లను పుట్టిద్దాం ఇప్పుడు” అంటూ మొదలు పెట్టినాను......

| | | | |
|---|---|---|---|
| 1. | వెన్ను+ఇడి+ఏలు= వెన్నిడేలు | అకశేరుకము | వెన్ను అనేది కుదురుమాట. ఆ మాటకు రెండు చేర్పులు చేరినాయి. ‘ఇడి’ అనే చేర్పుకు ‘లేని’ అని తెల్లము. ‘పామిడి తురగపుపాదము’లో అన్నమయ్య పామిడిని వాడినాడు. పాము + ఇడి, అంటే ‘పాములు లేకుండా’ అని. వెన్నిడేలు అంటే వెన్నులేని ఏలు అని. |
| 2. | తొలి+ఏలు = తొలేలు | ప్రోటోజోవా | ప్రోటో అంటే తొలి లేదా మొట్టమొదటి. |
| 3. | తూటు+ఏలు = తూటేలు | పోరిఫెరా | తూట్లుతూట్లుగా ఉండేది. |
| 4. | చదును+ఏలు = చదునేలు | ప్లాటి హెల్మెంతిస్ | చదునుగా ఉండేది. |
| 5. | పేలిక+ఏలు = పేలికేలు | నిమాటి హెల్మెంతిస్ | పేలికలాగా సన్నగా పొడవుగా ఉండేది. |
| 6. | బొజ్జ+ఏలు = బొజ్జేలు | సీలెంటిరేటా | బొజ్జను కలిగి ఉండేది. |
| 7. | చుట్టు+ఏలు = చుట్టేలు | అనిలెడా | తాకితే చుట్టచుట్టుకొనేది. |
| 8. | కీలు+ఏలు = కీలేలు | ఆర్త్రోపొడా | కీళ్లను కలిగి ఉండేది. |
| 9. | జిగట+ఏలు = జిగటేలు | మొలస్కా | తాకితే జిగటగా ఉండేది. |
| 10. | గరుకు+ఏలు = గరుకేలు | ఇకైనొడెర్మేటా | తాకితే గరుకుగా ఉండేది. |
| 11. | వెన్ను+ఏలు = వెన్నేలు | సకశేరుకము | వెన్ను కలిగినది. |
| 12. | నీరు+ఏలు = నీరేలు | జలచరము | నీటిలోనే ఉండేది. |
| 13. | ఇరు+ఏలు = ఇరేలు | ఉబయచరము | నీటిలోనూ నేలమీదా ఇరుతావులా ఉండేది. |
| 14. | పాకు+ఏలు = పాకేలు | సరీసృపము | నేలమీద పాకేది. |
| 15. | తుర్రు+ఏలు = తుర్రేలు | పక్షి | తుర్రు అంటే మిన్నులో ఎగరడం. తెన్నాటి తెలుగువారిలో తుర్రు అనేమాట వాడుకలో ఉంది. పక్షిని తురవ అంటారు. పొద్దుతుర్రే (పైకెగిరే) దిక్కును తెలుగులో తూరుపు అంటాము. |
| 16. | రొమ్ము+ఏలు = రొమ్మేలు | క్షీరదము | రొమ్ములు కలిగినది. |
| 17. | మెడ+ఏలు = మెడేలు | జిరాఫీ | మెడ పొడవుగా ఉండేది. |
| 18. | కత్తి + ఏలు = కత్తేలు | కడ్గమృగం | ............................. |
| 19. | జడ+ఏలు = జడేలు | యాక్ | ఒళ్లంతా జడలు ఉండేది. |
| 20. | గెంతు+ఏలు = గెంతేలు | కంగారూ | ............................. |

“మచ్చుకు కొన్నిమాటలే ఇవి. వేలమాటలను ఈ ‘ఏలు’తో పొందించవచ్చు. నారాయణా నువ్వు గొప్ప తెలివరివి. నీ తెలివిని పెరనుడి కోసం కాకుండా అమ్మనుడి కోసం వాడు. పెరనుడి తగులా(వ్యామోహా)న్ని వదిలించికో” అంటూ ముగించినాను.

“ఇప్పుడిక ఇంటికెళ్లి ఏం వండుకొని తింటావులే అన్నయ్యా. ఇవ్వేళ మాయింట్లో నీరేలుకూర. ఇక్కడే తినేసి వెళ్లు” అన్నాడు చిన్నయ్య. నీరేలుకూర అనే మాటను విని అందరమూ హాయిగా నవ్వుకొన్నాం.

## 2

“**అ**న్నయ్యా, మొన్న నువ్వు ‘ఏలు’తో కొట్టిన దెబ్బకు దిమ్మతిరిగి బొమ్మ కనబడింది నారాయణకు. ఇక మన జోలికి రాడు” అంటూ వచ్చినాడు చిన్నయ్య.

నాకు ఒళ్లు మండింది. “చిన్నయ్యా నువ్వు మాట్లాడుతున్నది తప్పు. నారాయణ కూడా మనలో ఒకడు. అతని అనిపింపును అతను చెప్పినాడు. అది సరికాదు అని దిద్దినాం మనం. ఇట్ల అందరినీ వద్దనుకొంటూ ఎడం చేసుకొంటూ పోతే చివరకు మనం ఇద్దరమే మిగులుతాం. నిక్కానికి నారాయణ నీకన్నా నాకన్నా తెలివయినవాడు. నుడెసిది(బాషాశాస్త్రం)ని చదివినవాడు. సంసుక్రుతం కూడా మనిసి నోటినుండి పుట్టిన నుడే అని మరచి, అదొక వేలుపునుడి అనే తలపుతో దానిమీద పేరనుగు(తీవ్ర అబిమానం)ను ఏర్పరచుకొన్నాడు. ఆ తలపును అతనినుండి తొలగించి తెలుగుదారిని పట్టించాలి కానీ ఇట్ల ఏవగించుకోకూడదు. వెళ్లు, వెళ్లి నారాయణను పిలుచుకొని రా”

అన్నాను.

కాసేపటికి చిన్నయ్యా నారాయణా కలిసి వచ్చినారు. నారాయణ మూతిని నల్లగా పెట్టుకొని ఉన్నాడు. నేనే పలకరించినాను.

''నారాయణా, ఎందుకట్లా ఉన్నావు? మొన్న మనం పోట్లాడుకోలేదు, మాట్లాడుకొన్నాం అంతే నీకు పెరనుడి మీదున్న అక్కరను అమ్మనుడి మీదకు మరల్చాలని అనుకొంటున్నవాళ్లమే కానీ నీకు ఎదిరివాళ్లం కాము. మామీద కనలు(కోపం) పడవద్దు" అన్నాను అనుగుగా. ఆ మాటతో నారాయణ మూతి విప్పారింది.

"అన్నయ్యా, 'ఏడు' అనే చేర్పు ఒకటుందని ఆనడుమ ఒకసారి అన్నావు. ఏడు అనేది ఒక అంకె కదా!" అన్నాడు చిన్నయ్య.

"ఏడు అంటే అంకె మట్టుకే కాదు, ఏడాది కూడా. అంతేకాదు చేర్పుగా కూడా ఈ ఏడు కనబడుతుంది. వెతికే ఓపికలేక పట్టించుకోవడం లేదు మనం" చెప్పినాను.

"అయితే ఆ చేర్పును గురించి విడమరచి చెప్పవా" అడిగినాడు చిన్నయ్య..

"తెలుగులో విడి ఎసలు(గుణం) ఒకటుంది. ఉసురులు అయినా ఉరువులు అయినా, ఒకే కూటువకు చెందిన కొన్నిటికి, ఉమ్మడి కడసడులు ఉంటాయి. వాటిని మనం చేర్పులుగా వాడుకోవచ్చు. కుందేలు, తాబేలు, తోడేలు, పొట్టేలులలోని 'ఏలు'తో ఇదివరకు 'ఏలెసిది(జంతుశాస్త్రం) ఆనిమి మాటలను పుట్టించినాం కదా. ఇటువంటిదే 'ఏడు' కూడా. నేరేడు, మారేడు, తంగేడు, జిల్లేడు, బొంజేడు, ఈదేడు, నాగేడు, కోయేడు వంటి చెట్ల పేర్లలో కడసడిగా ఏడు ఉంది చూడండి. దీనిని వాడి కొత్త మాటలను పుట్టించవచ్చు" అంటూ విడమరచి చెప్పినాను.

"ఏదీ నాలుగయిదు మాటలను పుట్టించి చూపించు అన్నయ్యా" అన్నాడు చిన్నయ్య. .

"నేను మలేసియాకు వెళ్లినపుడు, అక్కడి తెలుగువాళ్లు నాకొక పండును చూపించినారు. దాని పేరు దూరియాన్. మన పనసపండును పోలి, దానికంటే చిన్నదిగా ఉంది. ఒళ్లంతా పెద్ద పెద్దవి కూచిగా ముళ్లు ఉన్నాయి. ఆ పండు తలమీద పడితే, ముళ్లు దిగబడి చనిపోతారట. దూరియాన్ అంటే 'మలే' నుడిలో ముళ్లుకలిగిన పండు అని తెల్లమట. ఆ చెట్టును కూడా దూరియాన్ చెట్టు అనే అంటారు. ఆ పండుకు తెలుగుపేరును పెట్టమని నన్ను కోరినారు వాళ్లు. నేను 'ముళ్లేడు' అని చెప్పినాను. అట్లాగే డ్రాగన్పండు అని మనకు దొరుకుతున్నది కదా, అది మన జెముడుపండు వంటిదే. దానికి జెముడేడు అని పెట్టుకోవచ్చు. వెన్నవంటి గుజ్జు కలిగిన పండు కాబట్టి అవకాడోను వెన్నేడు అనవచ్చు. కలివిపండును పోలిన బెర్రీలను కలివేడు అనవచ్చు" అని మారాడినాను.

"నువ్వు చెప్పినదానిని ఒప్పుకొంటాను. అయినా ఇది కొత్తదేమీ కాదు. మన పెద్దవాళ్లు కూడా,రామములక, రామగుమ్మడి, సీమచింత, మొగలిపనస, సీమరేగు వంటి కొత్తపేర్లను చెట్లకు పెట్టుకొన్నవాళ్లే కదా" అన్నాడు చిన్నయ్య.

"అవును, నువ్వు చెప్పినవే కాదు, తక్కోలం, తక్కాళి(టొమేటో), బూదిపుచ్చ(బూడిదగుమ్మడి), పరంగిపుచ్చ(తియ్యగుమ్మడి), సీమపొగడ (సపోటా), చీనీనిమ్మ(బత్తాయి), గడ్డిచేమంతి, లంజిగొంజి(లంటానా), తురకవేప, గబ్బుతులసి, ఒయ్యారిబామ(పార్తీనియం).... వంటివి ఎన్నో ఉన్నాయి. అయితే ఏబై అరవై ఏళ్ల లోపు తెలుగువాళ్లలో ఈ అలవాటు అణగారిపోయింది. అన్నిచోట్లా ఉన్న ఇటువంటి మాటలను కూడా పోగేసుకోవాలి మనం. మలేసియా తెలుగువాళ్లలో బుట్టకూర (కేబేజీ), పూబుట్టకూర (కేలీఫ్లవర్) అనే మాటలున్నాయి. వాళ్లు పుట్టించుకొన్న మాటలివి. అయితే ఇవేవీ ఆనిమిమాటలుగా ఒదగవు కాబట్టి ఎసిదివి(శాస్త్రీయం)గా ఆనిమిమాటల పుట్టింపుకోసం 'ఏడు'ను తీసుకొన్నాను" చెప్పినాను.

"సరిగ్గా దీనినే అడగాలనుకొంటున్నాను. ఆ పండుకీ ఈ కాయకీ మాటలను పుట్టించడం కాదు, ఒక ఎసిదికి చెందిన ఆనిమిమాటలను పుట్టించగలగాలి. అందుకు ఈ 'ఏడు' ఒదుగుతుందా?" అంటూ డీకొన్నాడు నారాయణ.

"పూనుకొంటే పుట్టించగలం. ఎప్పుడో ఎందుకు, ఇప్పుడే పూనుకొందాం. ఏడెసిది(బోటనీ)కి చెందిన ఆనిమిమాటల గ్రీకు, లాటిను కుదురులను తడుముదాం. ఆ కుదురులకు తెలుగు కుదురులను వెతుకుదాం. తెలుగుకుదుర్లకు 'ఏడు'ను చేర్చుదాం. సరేనా నారాయణా" అంటూ మొదలిడినాను.

| | | | |
|---|---|---|---|
| 1. | పూత+ఏడు = పూతేడు | MAGNOLIOPHYTA | పువ్వులు పూచేది. |
| 2. | పూత+ఆమి+ఏడు = పూతమేడు | CRYPTOGAM | పువ్వులు పూయనిది. 'అమి' అనే తెలుగు చేర్పుకు less అని తెల్లము. |
| 3. | నీరు+ఏడు = నీరేడు | HYDROPHYTE | నీటిలో ఉండేది. |
| 4. | తేలు+ఏడు = తేలేడు | FLOATING PLANT | నీటిలో తేలేది. |
| 5. | మునుగు+ఏడు = మునుగేడు | SUBMERGED PLANT | నీటిలోపల ఉండేది. |
| 6. | వరపు+ఏడు = వరపేడు | XEROPHYTE | వరపు అంటే dry. ఎడారిమొక్కలు. |
| 7. | ఇరు+ఏడు = ఇరేడు | AMPHIPHYTE | నేలనా నీటిలోనూ ఉండేది. |
| 8. | తీగ+ఏడు = తీగేడు | CLIMBING PLANT | ................................. |
| 9. | నేల+ఏడు = నేలేడు | EMBRYOPHYTA | నేలమీద బతికేది. |
| 10. | పాచి+ఏడు = పాచేడు | BRYOPHYTE | .................. |
| 11. | కాడ+ఏడు = కాడేడు | HORNEOPHYTOPSIDA | ఆకులు లేకుండా కాడలు మట్టుకే ఉండేది. |

| | | | |
|---|---|---|---|
| 12 | నలి+ఏడు = నల్లేడు | MARCHANTIOPHYTA | ఇది ఒక ఎసిదరి పేరుతో పొందించిన ఇంగ్లీసు పేరు. నల్లేరులాగా పలకలకాడ కలిగినది. అందుకే నల్లేడు అన్నాం. పలకేడు అని కూడా అనవచ్చు. |
| 13. | తూడు+ఏడు = తూడేడు | TRACHEOPHYTE | తూడు కలిగినది. |
| 14. | బిత్తలి+ఏడు = బిత్తలేడు | RHYNIOPHYTA | ఆకులు లేకుండా బిత్తలి(నగ్నము)గా ఉండేది. |
| 15. | డాబు+ ఏడు = డాబేడు | ZOSTEROPHYLLOPHYTA | డాబు అంటే girds. డాబు వంటి ఆకులు గలది. |
| 16. | నక్క+అడుగు+ఏడు=నక్కడుగేడు | LYCOPODIOPHYTA | తోడేలు అడుగువంటి ఆకులు కలది అని తెల్లము. పొందించడానికి చిన్నదిగా ఉంటుందని తోడేలును నక్కను చేసినాం. తోడేలడుగేడు అని కూడా అనవచ్చు. |
| 17. | మూ+పాయ+ఏడు = ముప్పాయేడు | TRIMEROPHYTOPHYTA | మూడు పాయలుగా చీలిన ఆకులుకలది. |
| 18. | ఆకు+ఏడు = ఆకేడు | PTERIDOPHYTA | కాండం, కొమ్మలు లేకుండా ఆకులు మట్టుకే ఉండేది. |
| 19. | విత్తు+ఏడు = విత్తేడు | SPERATOPHYTE | విత్తులు కలిగి ఉండేది. |
| 20. | విత్తు+ఆకు+ఏడు = విత్తాకేడు | PTERIDOSPERMATOPHYTA | ఆకేడులోనే విత్తులు కలిగినది. |
| 21. | మొగలి+ఏడు = మొగలేడు | PINOPHYTA | మొగలి వంటిది. |
| 22. | ఈత+ఏడు = ఈతేడు | CYCADOPHYTA | ఈత వంటిది. |
| 23. | వెలివిత్తు+ఏడు = వెలివిత్తేడు | GYMNOSPERMAE | వివృతబీజ వృక్షం. |
| 24. | లోవిత్తు+ఏడు = లోవిత్తేడు | ANGIOSPERMAE | ఆవృతబీజ వృక్షం. |
| 25. | ఒకబద్ద+ఏడు = ఒకబద్దేడు | MONOCOTYLEDON PLANT | ఏకదళ బీజపు మొక్క. |
| 26. | కవబద్ద+ఏడు = కవబద్దేడు | DECOTYLEDON PLANT | ద్విదళ బీపు మొక్క. |
| 27. | బూజు+ఏడు = బూజేడు | FUNGI | శిలీంద్రం. |
| 28. | నాచు+ఏడు = నాచేడు | ALGAE | శైవలం. |

"అంతా బాగుంది కానీ, ఇన్ని ఇంగ్లీసు మాటలకు తెలుగుమాటలను పొందించినామే, సంసుక్రుతము నుండి వచ్చినవాటికి తెలుగుపేర్లను పొందించగలమా? మచ్చుకు, ద్రాక్షకు తెలుగుపేరును చెప్పు చూద్దాం" అంటూ తగులుకొన్నాడు చిన్నయ్య.

"తప్పక చెప్పగలను కానీ, ఆ సంసుక్రుతములోకి పోయిన తెలుగుమాటలెన్నో ఉన్నాయి. కసరు చవి కాకరకాయను కూడా సంసుక్రుతము నుండి దిగుమతిగా చెప్పుకొనే మనవాళ్లకు తెలుగు కుదుర్లను వెతికే కోరిక ఎక్కడిది చెప్పు. ద్రాక్ష అంటే దప్పిని తీర్చేది కాబట్టి దప్పేడు అని పెట్టుకోవాలి" అని ముగించినాను.

*(తరువాయి వచ్చే సంచికలో...)*









తప్పక చదవవలసిన 4 పుస్తకాలు

**ప్రముఖ రచయిత, కవి, నాటకకర్త, హేతువాది డా॥ మలయశ్రీ రచనలు**

**తొలి తెలుగు చక్రవర్తులు** 1,2 భాగాలు:

కాకతీయులే మన తెలుగు సమస్తాంధ్రసామ్రాట్టులు. తొలి దశలో తొమ్మిది పది దశాబ్దాలలో కాకతీయులు చాళుక్య రాష్ట్రకూటులకు దండనాథులుగా, మలిదశ - 11వ శతాబ్దిలో కళ్యాణి చాళుక్యులకు సామంతులు. 1158 నుంచి 1323 వరకు వీరు స్వతంత్ర చక్రవర్తులు. కాకతి చక్రవర్తులలో ప్రముఖులు నలుగురు. వీరి చరిత్రలు - జనజీవితాలను చిత్రిస్తూ డా॥ మలయశ్రీ నాలుగు చారిత్రక నాటకాలను రచించారు. ఒకటవ భాగంలో శ్రీ కాకతీయరుద్రదేవచక్రవర్తి(1158-1195), శ్రీ కాకతి గణమతిదేవ చక్రవర్తి(1199-1262), రెండవ భాగంలో మహారాణి కాకతిరుద్రమదేవి(1262-1289) శ్రీ కాకతి రెండవప్రతాపరుద్ర చక్రవర్తి (1290-1328) మొదటిభాగం రు.100లు, రెండవభాగం రు 100లు.

**పరిష్కారం,** మరి 15 కథలు - రు.100లు రచయిత : డా॥ మలయశ్రీ

**నిజమైన వేమన పద్యాలు** - రు.100లుఎంపిక- కూర్పు-భావాలు : డా॥ మలయశ్రీ

పుస్తకాలకోసం డా॥మలయశ్రీ 1-113/7, ఆదిత్యభవన్, వేమననగర్, రేకుర్తి,
కరీంనగర్-505 451(తెలంగాణ) ఫోన్: 98665 46220

పి. సంగీత
98480 84364

# యంత్రానువాదంలో 'వాక్యవిశ్లేషకం' అక్కర

**1. పరిచయం**

*గత* దశాబ్ద కాలంలో, సంగణక భాషాశాస్త్రం ప్రపంచవ్యాప్తంగా పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. ఆంగ్లంలోనేకాక ఇతర భాషలలో సంగణక సహాయక భాషా సాధనాలు రూపొందించేందుకు పరిశోధకులు మొగ్గుచూపుతున్నారు. ఈ భాషా సాధనాలలో యంత్రానువాదం అత్యంత ఆసక్తికరమైన మరియు కష్టసాధ్యమైనదిగా పేర్కొనబడింది. ప్రపంచ భాషలలో ఏ భాష నుండైనా మనకు కావలసిన భాషకు సులువుగా, తక్కువ సమయంలో అనువాదం చేసుకునేందుకు యంత్రానువాదం ఎంతో దోహదపడుతుంది. యంత్రానువాదంలో వాక్యవిశ్లేషకం (పార్సర్) అత్యంత ఆవశ్యకం. పార్సర్ అనేది వాక్యాన్ని వ్యాకరణపరంగానూ అర్థపరంగానూ విశ్లేషించేందుకు ఉపయోగించే సాధనం. ఈ వ్యాసంలో వాక్యవిశ్లేషకం గురించి దాని ఆవశ్యకత గురించి మేము రూపొందించిన తెలుగు వాక్యవిశ్లేషకం గురించి క్లుప్తంగా వివరిస్తున్నాను.

**2. వాక్యవిశ్లేషణ - పరిచయం**

వాక్యంలో ఉన్న ప్రతి పదానికీ అదే వాక్యంలో ఉన్న ఇతర పదాలకూ మధ్యగల అంతర్గత సంబంధాన్ని వ్యాకరణపరంగా/ వాక్యనిర్మాణపరంగా (syntactically) లేదా అర్థపరంగా (semantically) విశ్లేషించడాన్ని పార్సింగ్ అంటారు. పదాల మధ్య ఉన్న సంబంధాలు కనుగొని ప్రతి సంబంధానికీ ఒక ప్రత్యేక టాగ్‌ను ఇవ్వడం పార్సింగ్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశ్యం. ఒక వాక్యం యొక్క విశ్లేషణలో (parse), నాడికలు (nodes), వాక్యంలోని పదాలకు టీకలూ (సంవర్గ చిహ్నాలూ) పదాల మధ్య రేఖలూ వాటి మధ్యన ఉన్న సంబంధాన్ని తెలియజేస్తాయి (క్రింది బొమ్మలను చూడండి). ఈ పార్సింగ్ ప్రక్రియకు ఉపకరించే సాధనాన్ని పార్సర్/వాక్యవిశ్లేషకం అంటారు. ఏ వాక్యంలోనైనా ముఖ్యమైనది క్రియ. అయితే క్రియ, వాక్య నిర్మాణంలో కీలకమైన పాత్రను పోషించడానికి చాలా కారణాలు ఉన్నప్పటికీ ఆ అంశాన్ని మనం ఇక్కడ విపులంగా చర్చించడం లేదు. వాక్యంలో ఉన్న పదసంబంధాలు అన్నీ కూడ క్రియను అధారంగా చేసుకుని ఏర్పడినవే కనుక, వాక్యవిశ్లేషకం నిర్మాణంలో క్రియ తప్పనిసరిగా ప్రధానపాత్ర పోషిస్తుంది. అయితే ప్రతిసారీ క్రియాసహిత వాక్యాలే కాక కొన్నిసార్లు క్రియారహిత వాక్యాలు సాధారణంగా కూడా ఉపయోగించడం జరుగుతుంది (ఉ.దా. "నేను వైద్యుడిని"). ఇలాంటి క్రియారహిత వాక్యాలకు మాత్రం మేము రూపొందిస్తున్న వాక్యవిశ్లేషకంలో అంతరంగనిర్మాణంలో సహాయక క్రియను చేర్చి బాహ్యనిర్మాణంలో తొలగించడం జరుగుతుందని భావించడం జరిగింది.

సాధారణంగా వాక్యంలో ఏర్పడిన నిర్మాణాత్మకమైన సందిగ్ధత(structural ambiguity)ని తొలగించటానికి వాక్యవిశ్లేషకాన్ని ఉపయోగించడం జరుగుతుంది. వాక్యవిశ్లేషణ చేసేందుకు అనేక వ్యాకరణ సిద్ధాంతాలు అందుబాటులో ఉన్నా కూడా వాటిలో సంగణక ప్రక్రియలకు ఎక్కువగా ఉపయోగించేవి పద నిర్మాణ ఆధారిత (dependency) మరియు పద వర్గ (constituency) వ్యాకరణ సిద్ధాంతాలు. పద నిర్మాణ ఆధారిత (Dependency) వ్యాకరణ సిద్ధాంతం పాణినీయ వ్యాకరణ సాంప్రదాయం నుండి తీసుకోబడినది. ఈ సిద్ధాంతం భారతీయ భాషలకు అనువైనది అని ప్రముఖ భాషాశాస్త్ర పరిశోధకుల అభిప్రాయం. ఈ పత్రంలో పద నిర్మాణ ఆధారిత వ్యాకరణ సిద్ధాంతాన్ని ఉపయోగించడం జరిగింది.

ఆధునిక పద నిర్మాణ ఆధారిత సిద్ధాంతం ఫ్రెంచ్ భాషాశాస్త్రవేత్త లూసియన్ తెస్నేర్ (1959) ప్రతిపాదించారు. ఆయన రాసిన "ఎలిమెంట్స్ అఫ్ స్ట్రక్చరల్ సింటాక్స్ (Elements of structural syntax)" అనే పుస్తకంలో ఈ వ్యాకరణ సిద్ధాంతం గురించి స్పష్టమైన రీతిలో వివరించి, ఇది ఏ భాషను విశ్లేషించేందుకైనా అనువైనది అని పేర్కొన్నారు.

వాక్యవిశ్లేషకం రూపొందించే క్రమంలో టీకాసమితి (tagset) ఎంపిక అనేది చాలా ముఖ్యమైన అంశం. పదాల మధ్య గల సంబంధాన్ని తెలియజేయడానికి ప్రతి సంబంధానికి ప్రత్యేకమైన పేరు గల టీకా సమితి అవసరం అవుతుంది. ప్రస్తుతం అనేక రకాల టీకా సమితులు వాడుకలో ఉన్నప్పటికీ వాటిలో పెన్ (penn) టీకాసమితి, ప్రేగ్ టీకాసమితి, స్టాన్ఫోర్డ్ టీకాసమితి, UCREL టీకాసమితి, అన్‌కోరా (anncora) టీకాసమితులు ప్రధానమైనవి. ఈ వాక్యవిశ్లేషకానికి అన్‌కోరా (anncora) టీకాసమితి ఉపయోగించడం జరిగింది. అన్‌కోరా (anncora) టీకాసమితి పాణిని వ్యాకరణం ఆధారంగా రూపొందించబడింది. ఈ టీకాసమితి వాక్యంలోని పదాల మధ్య ఉన్న కారక మరియు అకారక సంబంధాల గురించి వివరిస్తుంది. అయితే కారక సంబంధాలు క్రియకు మరియు ఇతర నామవాచకాలకూ మధ్య ఏర్పడే సంబంధాల గురించి తెలియజేస్తే, అకారక సంబంధాలు మాత్రం క్రియతో కాకుండా వాక్యంలోని ఇతర భాగాలతో ఏర్పడే సంబంధాల (ఉదా. రవి యొక్క ఇల్లు - ఈ పదబంధంలో "రవి"కి మరియు "ఇల్లు"కి మధ్య గల సంబంధం అకారక సంబంధం) గురించి తెలియజేస్తాయి. అన్‌కోరా (anncora) టీకాసమితిలో ప్రస్తుతం 19 రకాల కారక సంబంధాలు అందుబాటులో ఉన్నాయి. అవి: కర్త (k1), కర్మ (k2), ప్రయోజక కర్త (pk1), కర్త సమానాధికారణ (k1s) మొదలగు సంబంధాలు ఉన్నాయి. ఈ టాగ్ సెట్ లో ఉన్న సంబంధాలేగాక కొత్త వాక్య సంబంధాలు కావలసివచ్చినప్పుడు కొత్త పేర్లు ఈ టీకాసమితిలో చేర్చడం జరుగుతుంది.

ఈ క్రింది విభాగంలో తెలుగు వాక్యవిశ్లేషణ ఎందుకు కష్టం, ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో అన్నఅంశాలు చర్చించబడ్డాయి.

**3. విభక్తులు - వాక్యవిశ్లేషణ**

తెలుగులో విభక్తులు వివిధ రకాల ప్రత్యయాల ద్వారా సూచింపబడతాయి. అయితే ఒక విభక్తికి ఒకే ప్రత్యయం కనుక వాడినట్టయితే వాక్య విశ్లేషణం చాలా సులువుగా ఉండేది. కానీ తెలుగులో ఒకే విభక్తికి అనేక ప్రత్యయాలు, ఒకే ప్రత్యయానికి అనేక విభక్తులు వాడే సదుపాయం భాషలో ఉండటం వల్ల వాక్య విశ్లేషణ కష్టతరమైన ప్రక్రియగా మారుతుంది.

**3.1. ఒకే ప్రత్యయం - అనేక విభక్తులు**

తెలుగు వాక్యంలోని నామవాచక పదాలు చాలావరకు విభక్తి

ప్రత్యయాలను కలిగి ఉంటాయి. ప్రథమావిభక్తికి-ø (ప్రత్యయం ఏమీ లేకపోవడం), ద్వితీయావిభక్తికి-ని/ను, షష్ఠీవిభక్తి -యొక్క-ø ప్రత్యయాలు తరచుగా ఉపయోగిస్తారు. అయితే చాలా సందర్భాల్లో ఒకే ప్రత్యయం అనేక విభక్తులను వ్యక్తపరుస్తుంది. ఉదాహరణకు:

1. రవికి జలుబు చేసింది.
2. నేను రవికి పుస్తకం ఇచ్చాను.

పై రెండు వాక్యాల్లో "రవి" నామవాచకానికి "-కు/కి" ప్రత్యయం చేర్చబడింది. కానీ కింది రెండు వాక్యాల్లో వాడిన "-కి/కు" ప్రత్యయానికి వేర్వేరు అర్థాలు ఉన్నాయి. ఇలాంటి విభక్తి సందిగ్ధత




తొలగించేందుకు వాక్యవిశ్లేషణ చాలా ఉపయోగపడుతుంది.

### 3.2. ఒకే విభక్తి - అనేక ప్రత్యయాలు

అంతేకాకుండా ఒకే విభక్తి, వేర్వేరు ప్రత్యయాల ద్వారా కూడా వ్యక్తం కావడం భాషలో చాలా తరచుగా జరుగుతుంది. ఉదాహరణకు,

3. నేను రవిని చూశాను
4. నేను సినిమా(ø) చూశాను

అనే రెండు వాక్యాలను తీసుకుందాం. మొదటి వాక్యంలో "నేను" అనే పదం "చూశాను" అన్న క్రియాపదానికి కర్తగా వ్యవహరిస్తే, "రవిని" అనే పదం వాక్యంలో కర్మగా వ్యవహరిస్తోంది. అలాగే రెండవ వాక్యంలో "నేను" కర్తగా వ్యవహరిస్తే, "సినిమా" కర్మగా వ్యవహరిస్తోంది. ఈ రెండు వాక్యాలనూ పరిశీలిస్తే మొదటి వాక్యంలో కర్మకు "-ని" అనే ప్రత్యయం చేర్చబడింది. కానీ రెండవ వాక్యంలో కర్మకు "-ని" ప్రత్యయం చేర్చబడలేదు. రెండు వాక్యాల్లో ఒకే రకమైన క్రియను ఉపయోగించినప్పటికీ విభక్తులలో తేడాలు ఉన్నాయి. ఇటువంటి తేడాలు సహజంగా కర్మ యొక్క చేతన (animate), అచేతన (inanimate) లక్షణాల కారణంగా ఏర్పడుతాయి. అయితే వాక్యవిశ్లేషకం ఈ రెండు వాక్యాలను క్రింద బొమ్మల్లో చూపించిన




విధంగా విశ్లేషిస్తుంది.

వాక్యవిశ్లేషణని ఇంకొన్ని ఉదాహరణలతో అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. "నేను రవి-కి/తో ఆ విషయం చెప్పాను" అనే వాక్యంలో "-కి/తో" ప్రత్యయాలు రెండూ తృతీయా విభక్తిని




సూచిస్తున్నాయి.

పైన గీసిన చెట్ల పటాలను పరిశీలిస్తే "కి" / "తో" ప్రత్యయాలు రెండూ ఒకే సంబంధాన్ని సూచిస్తున్నాయి. కానీ ఉదాహరణకు "రవి కత్తితో మామిడిపండును కోశాడు" అనే వాక్యాన్ని తీసుకుంటే "తో" ప్రత్యయం "కత్తి"తో ఉపయోగించినప్పటికీ "రవితో/కత్తితో" అనే రెండు నామవాచకాలు ఒకే సంబంధాన్ని చూపించడం లేదు. ఇలాంటి వ్యాకరణ సందిగ్ధతలను తీర్చుతూ వాక్యాలను స్వయంచాలకంగా విశ్లేషించడంలో సంగణక విశ్లేషకం పాత్ర ఎంతైనా అవసరం అవుతుంది.

ఈ పత్రంలో కేవలం విశ్లేషకాన్ని పరిచయం చేసే ప్రయత్నం మాత్రమే జరిగింది. అందుకోసం దానికి తగిన చాలా సులువైన వాక్యాలను పైన ఉదాహరణలుగా వివరించడం జరిగింది. అందువల్ల విశ్లేషకానికి సంబంధించిన మరిన్ని ముఖ్యమైన అంశాలను, వివిధ వాక్య నిర్మాణాలను విశ్లేషకం ఎలా విశ్లేషిస్తుందో వివరంగా భవిష్యత్తు పరిశోధనల్లో అధ్యయనం చేసి మీ ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతుంది.

### 4. యంత్రానువాదంలో వాక్యవిశ్లేషకం యొక్క పాత్ర:

యంత్రానువాదంలో వాక్యవిశ్లేషకం కీలక పాత్ర వహిస్తుంది అనడంలో ఏలాంటి సందేహం లేదు. తెలుగు భాషలోని రచనలను ఇతర భాషలలోకి అనువాదం చేయడంలో తెలుగు వాక్యవిశ్లేషకం చాలా ముఖ్యమైనది. యంత్రానువాదంలో విశ్లేషకం ఒక విభాగంగా చేర్చబడింది. దీని సహాయంతో వాక్య నిర్మాణాన్ని క్షుణ్ణంగా విశ్లేషించి పద సంబంధ సమాచారం సేకరించవచ్చు. అలాంటి సమాచారం ఆ భాష అనువాద ప్రక్రియ జరిగేటప్పుడు చాలా అవసరం అవుతుంది. ముఖ్యంగా, ఒక భాషా కుటుంబం నుండి ఇతర భాషా కుటుంబాలకు అనువదించేటపుడు అందులో తలెత్తే వాక్య నిర్మాణ సందిగ్ధతని (structural ambiguity) తొలగించటంలో వాక్యవిశ్లేషకం చాలా సహాయపడుతుంది. ప్రస్తుత కాలంలో వాక్యవిశ్లేషకాలపై పరిశోధన పోటాపోటీగా సాగుతున్న తరుణంలో, చాలా సాంకేతిక సంస్థలు, భాష శాస్త్రవేత్తలు వీటి నిర్మాణాల్లో నిమగ్నమై ఉన్నారు. యూనివర్సల్ డిపెండెన్సీ (universal dependency) అనే సంస్థ వారు ముఖ్యమైన ప్రపంచ భాషలన్నింటిలోనూ వాక్యవిశ్లేషకాలను నిర్మించేందుకు టీకాసహిత (annotated corpus) పాఠాలను తయారుచేస్తున్నారు. తెలుగులో 1023 వాక్యాల టీకాసహిత పాఠాలను (annotated corpus) వారి జాలచోటులో (website) పొందుపరచడం జరిగింది.


రచయిత పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం,

జె. డి. ప్రభాకర్,
8500227185

# వాణిజ్యం - స్థానిక నుడులు

ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులను, సేవలను, వినియోగదారులకు చేరువ చేసేందుకు ప్రజల భాషలనే ఉపయోగిస్తున్నాయి. ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు, సేవా నైపుణ్యాలతో సమానంగా ప్రజల భాషలు వాణిజ్య రంగంలో చోటు చేసుకున్నాయి. కాలానుగుణంగా పెరుగుతున్న పోటీ ప్రపంచంలో వాణిజ్య సంస్థలు తమ రూపాన్ని మార్చుకుంటూ ఉన్నాయి. గతంలో వ్యాపార వాణిజ్య సంస్థలు వస్తూత్పత్తుల మీద మాత్రమే దృష్టి సారించేవి. వినియోగదారులు తమకు కావలసిన ఉత్పత్తులను కొనడానికి దుకాణాలను ఆశ్రయించేవారు. కొనుగోలుచేసే ఆ వస్తువుల ఉత్పత్తి వివరాలు కూడా ఆ తయారుచేసే పరిశ్రమ నిర్ణయించిన భాషలోనే ఉండేవి. ఎక్కువగా ఇంగ్లీషు భాషలోనే వస్తూత్పత్తి వివరాలు ఆ కాలంలో ఉండేవి. కానీ నేడు ఆధునిక కాలంలో, వస్తువులను వాడుకొనే వినియోగదారుల భాషలో కూడా వస్తువుల ఉత్పత్తి వివరాలు ఉంటున్నాయి. వస్తువుల తయారీ నుంచి వాటి క్రయవిక్రయాల వరకు ఈ మార్పును మనం నేడు చూస్తున్నాం. గతంలో వాణిజ్యరంగం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే వ్యాపారం చేసేవారు. కానీ వినియోగదారుల సంస్కృతిని వారి భాష నేపథ్యాన్నీ దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తులనూ వాటి విక్రయాలనూ చేస్తున్నారు.

**డిజిటల్ (సాంఖ్యిక) ప్రకటనలలో ప్రధాన పాత్ర:**

వాణిజ్య రంగంలో వస్తూత్పత్తి ఒక ఎత్తయితే వాటిని ప్రజలకు పరిచయం చేసే ప్రకటనలు మరో ఎత్తు. ఆ ప్రకటనలు ప్రజల భాషలోనే ఉంటేనే ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయని గ్రహించారు. పరిశ్రమలూ వివిధ వాణిజ్య సంస్థలూ ఈ నిర్ణయానికి రావడానికి గల కారణం నేటి డిజిటల్ యుగమే. గూగుల్ కెపి జిఎమ్ 2017 లో జరిపిన అధ్యయన నివేదిక ప్రకారం, మనదేశంలో 23.4 కోట్ల ప్రజలు అంతర్జాలాన్ని తమ స్థానిక భాషలోనే వినియోగిస్తున్నట్టు, కేవలం 1.75 కోట్ల ప్రజలు మాత్రమే ఇంగ్లీషును ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. అయితే 2021 నాటికి 53.60 కోట్ల ప్రజలు వారి స్థానిక భాషలలో అంతర్జాలాన్ని ఉపయోగిస్తారని తెలిపారు. ఇంగ్లీష్ కన్నా స్థానిక భాషల విషయాల్లోనే 75% స్పష్టత ఎక్కువగా ఉందనీ ప్రజలు విశ్వసిస్తున్నారని మరొక అధ్యయనంలో తేలింది. ఈ మార్పులను ఆధారంగా చేసుకుని, ప్రజల అభిరుచులను భావాలను పరిగణనలోకి తీసుకొని వస్తూత్పత్తిదారులూ వ్యాపారులూ వారి తీరు మార్చుకున్నారు.

స్థూల జాతీయ ఉత్పత్తిలో (GDP) మనదేశంలో సేవారంగం ముఖ్య భూమిక పోషిస్తోంది. దినదిన ప్రవర్ధమానం చెందుతున్న ఏకైక రంగం ఈ సేవారంగం అని చెప్పొచ్చు. 2017 నాటి స్థూల జాతీయ ఉత్పత్తిలో 61.50 శాతం సేవా రంగం నుండి వస్తోంది. విద్య, వైద్యం, రవాణా, హోటళ్లు మొదలగు సంస్థలన్నీ ఈ సేవా రంగం క్రిందికి వస్తాయి. ఈ సేవలను ప్రజలకు చేరవేయడానికి భాషే ప్రధానం. ఉదాహరణకు ఒక డాక్టరు రోగుల రోగాన్ని తెలుసుకోవడానికి ఆ రోగులతో మాట్లాడడానికి స్థానిక భాషలే ప్రధానం. అలాగే మిగిలిన సంస్థలు తమ సేవా వివరాలను వినియోగదారులకు అందించడానికి స్థానికనుడులే ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి.

**స్థానిక భాషల పెట్టుబడితో లాభాలు :**

పరిశ్రమలూ, సేవా సంస్థలూ పెట్టే పెట్టుబడులకు అదనంగా ఉత్పత్తుల, సేవా వివరాలకు సంబంధించిన ప్రకటనలకు స్థానిక భాషల పైన పెట్టుబడి పెట్టవలసి వస్తోంది. ఆయా ఉత్పత్తుల, సేవా వివరాలను మూల భాషలో నుండి స్థానిక భాషలోకి అనువదించడానికి అనువాదకులు అవసరమవుతారు. దీని ద్వారా మూల భాషలూ, స్థానిక భాషలూ తెలిసినవారికి ఉద్యోగ పరికల్పన జరుగుతుంది. పరిశ్రమలూ, సేవా సంస్థలూ స్థానిక భాషలపై పెట్టే ఈ అదనపు పెట్టుబడి వారి ఉత్పత్తులనూ, సేవలనూ ప్రపంచవ్యాప్తంగా భాషా, సంస్కృతి అవరోధాలు లేకుండా ప్రతివారికీ ఉత్పత్తులనూ, సేవలనూ విస్తరింపచేయడానికి ఉపయోగపడుతుంది. వినియోగదారులు కూడా ఉత్పత్తి, సేవా వివరాలను తమ స్థానిక భాషలో చదువుకోవడానికి సులువుగా ఉంటుంది. దీనితో వస్తువుల, సేవల ఉపయోగం, వినియోగం కూడా పూర్తిగా అవగతమవుతుంది. నేడు ఒక ఉత్పత్తి వివరాలను తెలుగుతోపాటు అనేక భాషల్లో పొందుపరచడం మనం చూస్తూ ఉన్నాం. అలాగే వస్తువుల, సేవల ప్రకటనలు డిజిటల్ (సాంఖ్యిక) మాధ్యమంలో వినియోగదారులను ఆకర్షిస్తాయి. ఫలితంగా వారి మార్కెట్ రెట్టింపు అవ్వడానికి అవకాశాలు కూడా ఎక్కువే. ఈ విధంగా నేడు ప్రపంచీకరణ అంతా కూడా స్థానికీకరణ వల్లనే జరుగుతుంది. భాషకు వాణిజ్యాన్ని పెంపొందించే లక్షణాలు కూడా ఉందని గ్రహించిన బహుళజాతీయ సంస్థలు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మొదలగు సంస్థలు స్థానిక భాషలపై తమ దృష్టిని నెలకొల్పాయి. సాంకేతిక నిపుణులు కూడా స్థానిక భాషల విలువను తెలుసుకుని కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా భాషల అడ్డుగోడల్ని కూల్చేందుకు సిద్ధమవుతున్నాయి. అందువలన పరభాషపై మక్కువ తక్కువ చేసుకుని అమ్మనుడిలోనే ఆదాయం ఉందని గ్రహించాలి.

రచయిత పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం,

ధారావాహిక

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 8

పాశ్చాత్యులు భారతదేశంలో వర్తకం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. దానితోపాటు వాళ్ళ సిబ్బంది కూడా అనతికాలంలోనే పెరిగింది. కుంఫిణీ కొలువులో పనిచేసే తెల్లదొరలను సివిల్ సర్వెంట్స్ అంటారు. భారత దేశంలోని గిడ్డంగుల్లో పనిచేసే సివిల్ సర్వెంట్లను క్రీ.శ. 1674లో నాలుగు వర్గాలుగా పరిగణించేవారు. ప్రాథమిక స్థాయి పనివాళ్ళను "అప్రెంటిస్" అనేవారు. వారికి అనుభవం వచ్చాక ఐదారేళ్ళలో చిన్నరైటర్‌గా ఉద్యోగోన్నతి పొందేవారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పైగా అధికారుల మెప్పు పొంది పనితనం వచ్చాక జూనియర్ ఫాక్టర్ గా ఆపై సీనియర్ ఫాక్టర్‌గా స్థిరపడేవారు. వీళ్ళని ఇంగ్లండ్ నుంచే తీసుకువచ్చేవారని ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో వివరించాడు. ఈ నేపథ్యంలో వ్యాకరణాలు, నిఘంటువులు, వాచకాలు మొదలయిన వాటి అవసరం ఏర్పడింది. లాటిన్, ఫ్రెంచ్, పోర్చుగీస్ తదితర భాషలకు తెలుగు జోడించారు. దేశీయులైన వాళ్ళు ద్విభాషీలుగానో అనువాదకులుగానో వారి వద్ద చేరేవారు. నిఘంటు నిర్మాణం చేసిన పాశ్చాత్యుల రచనలు వరుసగా వివరించడం ఈ వ్యాస రచనలో ఒక భాగం.

**బెంజిమిన్ బ్రాన్‌ఫిల్:**

బెంజిమిన్ బ్రాన్ ఫిల్ 1791లో నెల్లూరు కలెక్టర్‌గా పనిచేశాడు. 1793 నాటికి నూజివీడు కమిటీలో సభ్యుడు కావడంతో తెలుగు ఎక్కువగా వినియోగించవలసిన అవసరం ఏర్పడింది. అందువల్ల తాను తెలుగు మాట్లాడటమే కాకుండా తనకింద పనిచేసే అప్రెంటీస్‌లకి తెలుగు నేర్పించవలసిన అవసరం కలిగింది. అందువల్ల 1793 జూన్ 7వ తేదీన నిఘంటు రచన ప్రారంభించాడు. ఇంతవరకూ బాగానే ఉంది. తెలుగు అక్షరమాల పూర్తిగా తెలియనివాడు తెలుగుభాషపై సాధికారికత లేనివాడు నిఘంటునిర్మాణం చేస్తే ఎలా ఉంటుందో బెంజమిన్ బ్రాన్‌ఫిల్ ఉదాహరణగా చెప్పొచ్చు. అంతకుముందే పేర్‌మోటల్ అనే ఫ్రెంచ్ పాదిరి కూర్చిన ఫ్రెంచ్ అక్షరాల క్రమంలోనే తెలుగు నిఘంటు నిర్మాణం చేశాడు. పైగా భాష కూడా ఆనాటి ప్రజల వాడుకభాష, పండితుల వ్యావహారిక పదప్రయోగాలు మిళితం చేసి 823 పుటల నిఘంటువు తయారు చేశాడు. ఇతని నిఘంటువు అట్టమీద "చదివి చద్వకొండా" అని ఉచిత ఉపదేశం చేశాడు. ఈ మాటను ఎడికాంబెల్, సి.పి. బ్రౌన్ తమ నిఘంటు పీఠికలో పేర్కొంటూ బెంజమిన్ రచనను అజ్ఞానపు రాతలని తేల్చి పారేశారు. ఐతే ఇక్కడో విషయం ప్రస్తావించాలి. తెలుగులో అసలు ఏ నిఘంటువు లేని రోజుల్లో ఈ సాహసం చేయడం, అదీ అచ్చువేయడం కొంత మెచ్చుకోదగిన విషయమే. అనంతరం 1794లో నూజివీడు జమిందారిపై సూపరింటెండెంట్‌గా, ఆ తర్వాత మచిలీపట్నం మూడవ డివిజన్ కలెక్టర్‌గా పనిచేసి 1804లో ఇంగ్లండ్ వెళ్ళాడు. అంతకుమించి బెంజిమిన్ బ్రాన్‌ఫిల్ విషయాలు తెలియవు.

**విలియం హోవెల్:**

భారత దేశంలో 1706లో జన్మించాడు. బాల్యంలో చదువులు, ఆపై ఉన్నత చదువులు, కళాశాలవిద్య మొదలయిన వివరాలు తెలియవు. కాని 1821 ప్రాంతంలో బళ్ళారిలో అసిస్టెంట్ గా చేరాడు. 1825 నాటికి కడపలో ఒక మిషన్ కేంద్రాన్ని ప్రారంభించి విద్యాలయాలు నెలకొల్పాడు. అనాథలకు, పేదలకు చదువునేర్పే పాఠశాలలు, నామమాత్రంగా ప్రారంభించాడు. పేదలకు అవసరం మేర వైద్యం కూడా అందించాడు. 1842 వరకూ కడపలోనే పనిచేసి తెలుగు పుస్తకాలు తయారు చేశాడు. కొన్ని అనువాదాలు కూడా చేశాడు. 1834లో ఆంధ్ర వ్యాకరణము ముద్రించాడు. ఎ కాటికిజం ఆఫ్ తెలుగు గ్రామర్ (బళ్లారి 1834) అనే టైటిల్ తో ముద్రణ అయింది.

**జాన్ కర్నక్ మారిస్:**

జాన్ కర్నక్ మారిస్ 1798 అక్టోబర్ లో జన్మించాడు. తండ్రి జాన్ మారిస్ బొంబాయి సివిల్ సర్వీస్ కు చెందినవాడు. జాన్ కర్నక్ 1813-1815లో రాయల్ నేవీలో పనిచేశాడు. 1815-17 ప్రాంతంలో ఇంగ్లండ్‌లో ప్రాచ్య భాషలు బోధించే హెయిల్ బరీ కళాశాలలో చదివాడు. 1818లో రైటరుగా చెన్నపట్టణానికి వచ్చాడు. కొంతకాలం సర్కారు వారి ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఆ తర్వాత తెలుగు ట్రాన్స్‌లేటర్ గా, 1821లో మచిలీపట్టణంలో మెజస్ట్రేటుగా, 1823లో ప్రభుత్వానికి అనువాదకుడిగా పనిచేశాడు. ఈ కాలంలోనే పాఠశాలల కోసం తెలుగు సెలక్షన్స్ సిద్ధం చేశాడు. 1824లో సెయింట్ జార్జ్ కళాశాల బోర్డు సెక్రటరీగా, 1831లో బోర్డ్ ఆఫ్ రెవెన్యూ సభ్యుడిగా, అనంతరం యాక్టింగ్ సెక్రటరిగా, 1832లో ప్రభుత్వానికి పూర్తికాలపు అనువాదకుడిగా పనిచేశాడు. ఈ కాలంలోనే తెల్లవాళ్ళకు తెలుగు నేర్పడం, తెలుగు వాళ్ళకు ఇంగ్లీషు నేర్పడం ప్రారంభించాడు. 1835 నాటికి మద్రాసు గవర్నమెంట్ బాంక్ సూపరింటెండెంట్ గా చేశాడు. ఈలోగా తాను తయారుచేసిన తెలుగు నిఘంటువు, వాచకాలు ముద్రించాడు. అనంతరం మద్రాసు జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్ కి సంపాదకుడిగా వ్యవహరించాడు. తర్వాత ప్రతిష్ఠాత్మకమైన రాయల్ సొసైటీ సభ్యుడుగా ఉన్నాడు. 1846లో ఉద్యోగ విరమణ అనంతరం 1558లో మరణించాడు.

**అలెగ్జాండర్ డంకన్ కాంబెల్**

తెలుగు త్రిలింగ శబ్దభవమని తొలిగా చెప్పినవాడు అలెగ్జాండర్

డంకన్ కాంబెల్. శ్రీశైల, దక్షారామ, భీమేశ్వరమనే త్రిలింగాల నడిమిభాగం తెలుగువారి ఆవాసస్థానమనీ తెలుగుకే తెనుగు, ఆంధ్రము, జంటూ, వరుగి అనే పర్యాయ పదాలున్నాయని వివరంగా విశ్లేషించాడు కాంబెల్ మహాశయుడు. మూడు లింగాలను గుర్తించడానికి విస్తృత పరిశోధనలు చేశాడు. ప్రాచీన చరిత్రకారులు ఆంధ్రదేశం గురించి భావించినవన్నీ ఉదహరిస్తూ వివిధ భారతీయ పురాణాల్లో ఆంధ్ర ప్రసక్తి ఉన్న ఉదాహరణల్లో వివరంగా తన వ్యాకరణ పీఠికలో రాశాడు. మెకంజీ దొర సేకరించిన రాత ప్రతులను, శాసనాలను, ఇతర ఆధారాలను వివరంగా ఆధారాలతో సహా విజయనగరరాజుల జాబితాను కాలానుగుణంగా వివరించాడు.

1807లో రైటర్ గా చెన్నపట్టణానికి వచ్చిన కాంబెల్ అక్కడే పండితుడుగా ఉన్న ఉదయగిరి నారాయణయ్యవద్ద ఆంధ్ర శబ్ద చింతామణిని చదివాడు. నారాయణయ్య నేతృత్వంలో ఐదేళ్ళపాటు ఆంధ్రకౌముది, అహోబల పండితీయం మొదలయినవి చదివాడు. చదివితే క్షుణ్ణంగా చదవాలి ఆసాంతం నేర్చుకుని ఆకళింపు చేసుకోవాలనే మనస్తత్వం కాంబెల్‌ది. ప్రతినిత్యం గురు సాన్నిహిత్యంలో చదివేటప్పుడు ఒక నోట్సు తయారు చేసుకునేవాడు. తను నేర్చుకున్న నోట్సు ఇతరులకు ఉపయోగపడాలని ఆరు ప్రకరణాల్లో 519 సూత్రాలతో ఆంధ్ర వ్యాకరణాన్ని ఇంగ్లీషులో రాశాడు. ఇది 1816లో అచ్చయింది. 19వ శతాబ్దంలో మద్రాసులో అచ్చయిన తొలిపుస్తకం యిది. “ఎ గ్రామర్ ఆఫ్ ది తెలుగు లాంగ్వేజ్ కామన్‌లీ టర్మ్‌డ్ జెంటూ, పెక్యూలియర్ టు ది హిందూస్ ఇన్ హాబిటింగ్ ది నార్త్ ఈస్టర్న్ ప్రావిన్సిస్ ఆఫ్ ది ఇండియన్ పెనిన్సులా” అనే టైటిల్‌తో ముద్రించాడు. జెంటూ అనే పదం యూరోపియన్‌లు సృష్టించారని అందుకే ఈ వ్యాకరణానికి ఆభాషలో తయారు చేశానని చెప్పాడు. ఈ పుస్తకం ఫోర్ట్ సెయింట్ జార్జ్ ప్రభుత్వానికి సమర్పించాడు. కళాశాల పక్షాన కాపీరైటు కొని, వారి ప్రెస్‌లోనే అచ్చువేసి, ఇండియా గవర్నర్ జనరల్‌కి అంకితం యిచ్చాడు. కాంబెల్ వ్యాకరణంలో రోమన్ లిపి వాడాడు. ఇందులో ఆరు అధ్యాయాలున్నాయి. 1. తెలుగు అక్షరాలు 2. ద్విత్వ సంయుక్తాక్షరాలు. 3.నామవాచకాలు, సర్వనామాలు, 4. విశేషణాలు 5. క్రియలు 6. వాక్య నిర్మాణం. ఆంధ్ర శబ్ద చింతామణినే అనుసరించినా దేశ్యానికి ప్రథమ స్థానమిచ్చాడు.

తొలి ప్రకరణమయిన తెలుగు అక్షరాలను విస్మరించాడు. శుద్ధాంధ్రానికి ముప్పై ఏడు వర్ణాలన్నాడు. క్ష-ఱ, పూర్ణానుస్వారాలను, విసర్గను, హల్లుల్ని వర్ణమాలగ తెలిపాడు. ఉచ్చారణ విషయంలో తెలుగులో పదాది యకార, వకారాలు దోషమన్నాడు. సంస్కృత పదాదిలో అయి-అవులు వాడకూడదనీ, ఋ, ౠలను రు-రూలు రాయడం దోషమన్నాడు. రెండో ప్రకరణంలో సంధిలక్షణం (పూర్వ) పదాంత (పర) పదాది వర్ణాలకి కలిగే మార్పుల్ని, పద మధ్యస్వరలోపాన్ని సంధి అని నిర్వచనం చేశాడు. కళాద్రుత ప్రకృతి కాలను నిర్వచనం చేసి వివరించాడు. కళలకు సంధి రాకపోతే యకారం, ద్రుత ప్రకృతులకు సంధి జరగకపోతే నకారం వస్తుందని తెలిపాడు. అత్వ-ఇత్వ-ఉత్వ సంధుల్ని సోదాహరణంగా వివరించాడు. ఎడు-అంత-ఏసి అన్న పదాలు, ఆకు-అన్ని-అమ్మ-అక్క-అయ్య-అత్త అవ్వ అన్న పదాలు పరమైనమపుడు ఎట్టి హ్రస్వాచ్చుకయిన సంధి నిత్యమని సూత్రీకరించాడు. ఉదా. చేరెడు - పోకంత - ఏనిమిదేసి - సుబ్బమ్మ-తాటాకు. తృతీయ ప్రకరణం దేశ్య తద్భవ, గ్రామ్య లక్షణాల వివరణ. దేశ్యాన్ని అచ్చ దేశ్యంగా పరిగణించాడు. దేశ్యాల్ని ప్రథమ, ద్వితీయ, తృతీయ దేశ్యాంగాలుగా విభజించాడు. డుమంతాలు ప్రథమ దేశ్యాలు. ము-ఎము-అము అంతమయ్యేవి ద్వితీయాలు. స్త్రీ సమములు తృతీయాలు. ఈ విభజననే గురుమూర్తి శాస్త్రి, ఉదయగిరి శేషయ్య, అబ్బయ్య నాయుడు వంటి దేశీయ వ్యాకర్తలు, సి.పి.బ్రౌన్, ఆర్డెన్ వంటి విదేశీయ వ్యాకర్తలు అనుసరించారు.

దేశ్యాలలోనే లింగ వచన విభక్తులతోపాటు ఔపవిభక్తికాల్ని వివరించాడు. తత్సమాలను నిర్దేశించి అజంత హలంతాలకయే కార్యాన్ని సూత్రీకరించాడు. హలంతాలలో ప్రతిహలంతానికి తత్సమరూపాన్ని ప్రదర్శించడమేకాక విశేష రూపాన్ని సహితం చూసి కొన్నింటికి గల ప్రథమాంత తుల్య, ద్వితీయాంత తుల్య ద్వైరూపాల్ని ఇచ్చాడు.

ఉదా: సంపద్ = సంపత్తు =సంపద

హనుమత్-హనుమంతుడు=హనుమానుడు-హనుమ

తత్సమాల తర్వాత తద్భవరూప ప్రక్రియ వివరణ ఉంది. కొన్ని అన్యదేశాల్ని ఉదాహరించి, సర్వనామాన్ని నిర్వచించాడు.

చతుర్ధ ప్రకరణంలో దేశ్య, తత్సమ, విశేషణాలను గూర్చిన వివరణ ఉంది. పంచమ ప్రక్రియలో క్రియారూప భేదాలున్నాయి. ఎద-ఎడి వీటిని భవిష్యదర్థక ప్రత్యయాలుగా గ్రహించాడు.

కర్తరి, కర్మణి - ప్రేరణార్థక - నపుంసకాలని (Neuter Verb) క్రియలు నాలుగు విభాగాలు. భూత - వర్తమాన భవిష్యత్తధర్మార్థకాలని కాలాలు నాలుగు విధాలు. క్రియల్లో గ్రామ్యరూపాలు చూపాడు. కారకము - వాక్య నిర్మాణ విభాగం, కృత్తద్ధితాలు ఆరవ ప్రకరణంలోని విషయాలు. ఈ విభాగంలోని వాక్యాలు నీతిబోధకాలు.

ఉదా: స్త్రీలకు అణకువ మంచిది.
మొగవాళ్ళకు ధైర్యమే గత్యము
మాటకు ప్రాణము సత్యము
బోటికి ప్రాణము మానము.

ఆయా విభక్తులు ఏయే అర్థాల్లో ప్రయుక్తాలో వివులీకరించాడు. రామాయణగాథల్ని అభ్యాసాలుగా చేశాడు. అనుబంధంలో సంఖ్యావాచకాలు, పరిమాణార్థకాలు, కొలమానాలు ఉన్నాయి.

ఈ వ్యాకరణంలో చెప్పుకోదగినవి ఆంగ్ల వ్యాకరణ పద్ధతులు అనుసరించకుండా తెలుగు పద్ధతులను, తెలుగు సంప్రదాయాలను వివరించడం అనంతర వ్యాకర్తలకు మార్గదర్శకమయింది.

కాంబెల్ వ్యాకరణ రచనకు సహాయపడిన నారాయణయ్యకు ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలో ఆంగ్ల విభాగాధిపతిగా ఉద్యోగ మిప్పించాడు. ఆ తర్వాత సుప్రీమ్ కోర్ట్ ఆఫ్ జూడికేచర్‌లో ఇంటర్

ప్రెటర్ అయ్యాడు. పాశ్చాత్యులకు విద్యావిషయకంగా తోడ్పడినవారిని, అనువాదాలకు సహాయపడినవారికి మంచి జీతంతో ఉన్నతమైన ఉద్యోగాలు యిప్పించి కృతజ్ఞత చాటుకున్నట్టు- ఆయా దొరల జీవిత చారిత్రక క్రమం తెలియజేస్తుంది.

కాంబెల్ 1812 నుండి దేశభాషల అధ్యయన సంఘానికి కార్యదర్శిగా పనిచేశాడు. అదే తర్వాత కాలేజి బోర్డుగా మారింది. ఈ బోర్డుకు కార్యదర్శిగా, పరీక్షాధికారిగా 1812 నుండి 1820 వరకు పనిచేశాడు. కాంబెల్ ప్రతిభను గుర్తించిన అధికారులు నిఘంటువుకూడా తయారు చేయమని ఆదేశించారు. 1820లో బళ్ళారికి కలెక్టరుగా పనిచేస్తూనే నిఘంటు రచన ప్రారంభించి 1821కి పూర్తి చేశాడు. మామిడి వెంకయ్య ఆంధ్ర దీపికను ఆధారంగా చేసుకుని అదే క్రమంలో తయారుచేశాడు. మధ్యలో కొత్త పదాలను కలుపుతూ తెలుగు భాషకు ఇంగ్లీషు అర్ధాలను వివరించాడు. 1848 నాటికి రెండు ముద్రణలను పొంది అత్యధిక ప్రతులు అమ్మకం జరిగినట్టు తెలుస్తుంది. 1849లో మూడవ ముద్రణ హిందూ ప్రెస్ మద్రాసు వారు వెలువరించారు.

1820లో బళ్ళారిలో కలెక్టరుగా ఉన్న సమయంలో తెలుగు విద్యావిధానంపై సమగ్రంగా నివేదిక తయారు చేశాడు. ప్రాథమిక దశలో మాతృభాష అవసరం గుర్తించి మాతృభాషలోనే విద్యా బోధనగావించాడు. అనంతరం ఇంగ్లీషువారికి అవసరమైన చోటమాత్రమే ఇంగ్లీషు నేర్పించినట్టు Selections from educational Records 1840- 1859, E.d., by JA Richey, Part II, 1922లో వివరాలు తెలుస్తాయి. జిల్లా కేంద్రాలలో పనిచేసిన అనంతరం 1827లో కాలేజి బోర్డు సభ్యుడయ్యాడు. ఈ కాలంలో మద్రాసు లిటరరీ సొసైటీ సభ్యుడుగా సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ సర్కారువారి తెలుగు ట్రాన్స్‌లేటర్ గా పనిచేశాడు. ఈకాలంలోనే పాఠశాలలో తెలుగు పుస్తకాల తయారీ, ప్రచురణ బాధ్యతలు కూడా స్వీకరించాడు. ఏ పనిచేసినా సాధికారికంగా నిరూపించి నిగ్గు తేల్చాడు. 1814లో విలియం కేరీ వ్యాకరణం, 1816లో కాంబెల్ వ్యాకరణం, 1817లో విలియం బ్రౌన్ వ్యాకరణం వచ్చినా అన్నింటికన్నా మిన్నగా ఉత్తమంగా కాంబెల్ వ్యాకరణం నిలిచింది. అనంతర వ్యాకర్తలకు కూడా ఆదర్శ ప్రాయమయింది. తెలుగు భాషకు, తెలుగు సంస్కృతి పరిరక్షణకు కృషిచేసి ఆదర్శవంతంగా నిలిచిన కాంబెల్ నిత్యస్మరణీయుడు.

డాక్టర్ జాన్ లీడెన్ (1775-1811): చదువుకు పేదరికం అడ్డుకాదని, యిష్టపడి పనిచేస్తే ఏదయినా సాధించవచ్చని అనుభవ పూర్వకంగా నిరూపించినవాడు డాక్టర్ జాన్ లీడెన్. గొర్రెల కాపరుల కుటుంబం నుంచి వచ్చిన లీడెన్ ప్రాథమిక విద్యాభ్యాసంలోనే మంచి పేరు తెచ్చుకున్నాడు. స్కాట్లాండ్ దేశానికి చెందిన లీడెన్ సమయం దొరికినప్పుడల్లా వివిధ భాషల అధ్యయనం చేసేవాడు. ఉన్నత విద్య చదివే క్రమంలోనే స్కాండినేవియన్ భాషలతోపాటు హిబ్రూ, అరబిక్, పర్షియా భాషల్లో ప్రావీణ్యం పొందాడు. భాషల అధ్యయనంతోపాటు, శాస్త్ర విషయాలు చదివి నేర్చుకున్నాడు. ఆ ఉత్సాహంతోనే వైద్యశాస్త్రం చదివి పట్టభద్రుడయ్యాడు. ఎడింబరో విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించాడు. వైద్యశాస్త్రంతోపాటు తత్వశాస్త్రంలో కూడా కృషిచేశాడు. ఏది చదివినా అందులోని ఆనుపానులు చూసి, నిగ్గదీసి నికషోపలంపై నిలబడి వజ్రంలా మెరిసేవాడు. ప్రపంచంలోని ముప్ఫై భాషలను బాగా చదివాడు. మంచివక్త-రచయిత. ఏ విషయాన్నైనా సాధికారికంగా మాట్లాడేవాడు. భారతదేశానికి 1803 ఆగష్టు 19వ తేదిన చెన్నపట్టణం కుంఫిణీ ఉద్యోగిగా వచ్చాడు. వచ్చిన వెంటనే తెలుగు - తమిళ - కన్నడ భాషల్లో ఎన్నో గ్రంధాలను సేకరించాడు. అంతకుముందే మెకంజీ పదహారు భాషల్లో ఉన్న 1568 గ్రంథాలను 264 సంపుటాల్లోకి ఎక్కించి 2070 స్థానిక చరిత్రలను, 8076 శాసనాలను సేకరించాడు. మెకంజీ లాగే బ్రౌనుదొర 2440 సంపుటాల్లో 1273 తెలుగు లిపిలో ఉన్న గ్రంథాలు అన్ని సేకరించడం జాన్‌లీ డెన్ కి ప్రేరణ అని తానే చెప్పాడు. ఆ ప్రేరణతోనే దక్షిణాది భాషల్లో ఉన్న విలువైన లిఖిత సంపదను సేకరించాడు. తొలిగా మద్రాసు జనరల్ ఆస్పత్రిని నడిపే బాధ్యతను స్వీకరించాడు. వైద్యం చేయడంతోపాటు వైద్యశాస్త్ర పరిశోధనలు కూడా సమాంతరంగా కొనసాగించాడు. ఆ నేపథ్యంలో లీడెన్ ప్రకృతిలో లభించే ఖనిజాలు, లోహాలు, వృక్షజాతి మొక్కలు వాటి ఉపయోగం అవి రోగ నివారణకు ఎలా పనిచేస్తాయనేది పరిశోధించి, ప్రయోగించి సఫలీకృతుడయ్యాడు. అదే క్రమంలో దేశీయుల ఆచార వ్యవహారాలు, శరీర స్వభావాలు, స్థానిక పంటలు, అవి పండే కాలాలు, కార్తెలు ఏ పంట తర్వాత ఏ పంటలు వేస్తే మంచి దిగుబడి వస్తుందో తెలుసుకున్నాడు. వాటి ద్వారా కాలానుగుణంగా వచ్చే వ్యాధులు వాటి నివారణ మార్గాలు అన్వేషించి వైద్యం చేశాడు. కాలునుగుణంగా దొరికే ఆహార పదార్థాల ద్వారా రోగ నిరోధక శక్తి పెంచే మార్గాలు వివరించాడు. ఈ అనుభవాలన్నీ నోట్సు తయారు చేశాడు. ఈ క్రమంలోనే లీడెన్ పలుమార్లు జబ్బుపడ్డా ఆ సమయంలో కూడా సంస్కృత అధ్యయనం చేసేవాడు. అనారోగ్యంగా ఉన్న సమయంలో పారశీకం, హిందూస్థానీ భాషల్లోని కథలను అనువాదం చేశాడు. ఆరోగ్యం కోసం స్థలమార్పిడి జరిగే సమయంలో కూడా లీడెన్ భారతీయుల చరిత్ర, ఆచారాలు, మతపద్ధతులు, క్షుణ్ణంగా తెలుసుకొని మంచిగా నోట్సు తయారు చేశాడు.

ఆయన ఇండోచైనా దేశంలోని జాతులు-భాషలు వారి సాహిత్యం పై వ్యాసాలు రాశారు. అన్నీ ఏషియాటిక్ రిసర్చస్ వాల్యూముల్లో ప్రచురితమయ్యాయి. వాల్యూం నం. 10లో ప్రచురితమైన వ్యాసం విద్యాధికులనాకర్షించింది. కుంఫిణీ వారి మన్ననలను పొందింది. అందువల్ల ఆయన్ని ఏషియాటిక్ సొసైటీ సభ్యుడిగా చేర్చుకోవడంతోపాటు కలకత్తాలోని పోర్ట్ విలియం కళాశాలలో హిందుస్థానీ భాషకు ఆచార్యుడుగా నియమితుడయే అవకాశం లభించింది. దీనికి అదనంగా కలకత్తాలో జడ్జిగా కూడా విధులు నిర్వహించే అవకాశం కలిగింది.

ఈ నేపథ్యంలో జావా ద్వీపంపై దండయాత్ర జరిగింది. కుంఫిణీ సేనలు లార్డ్ మింటో నాయకత్వంలో వెళ్లాయి. మింటోకి ద్విభాషీగా

లీడెన్ నియమితుడయ్యాడు.

జావా జయించిన అనంతరం ఉద్యోగ నిర్వహణతోపాటు సాహిత్య పరిశోధనలు, గ్రంథ సేకరణ, స్థానిక ఔషధాలకు పనికివచ్చే మొక్కలు సేకరించాడు. ఒకరోజు బటేవియా నగరంలో ప్రాచ్యదేశపు గ్రంథాలున్నాయని, అవి చాల ప్రాచీనమైనవనీ లీడెన్ విన్నాడు. అంతే వాటిని పరిశీలించడానికి ఎకాయకిని వెళ్ళాడు. ప్రాచీనమైన ఒక భవనంలో ఈ గ్రంథసంపద ఉందని గుర్తించాడు. ఆ గదినిండా డచ్ వారి సామాగ్రి, ఆ ద్వీపంలోని అపురూప వస్తు సంపద ఉందని గుర్తించాడు. కొన్నేళ్ళుగా మూతపడిన ఆ గది మూసి ఉన్నందువల్ల, గాలి, వెలుతురు చొరపడే అవకాశం లేనందువల్ల మగ్గిపోయింది. గది తలుపు ఒక్కటే ఉంది. కిటికీలు లేవు. తెరచీతెరవంగానే ఉత్సాహంగా లోనికి ప్రవేశించిన లీడెన్, లోపల ఏర్పడిన విషవాయువులు పీల్చాడు. అంతే అస్వస్థతకు గురయ్యాడు. ఒక్కసారిగా చలిజ్వరం కమ్ముకుంది. మూడు రోజులలో చనిపోయాడు. 1811 ఆగష్టు 11వ తేదిన బటేవియాలో చనిపోయిన లీడెన్ మరణం సాహిత్యకారులను, చారిత్రక విశ్లేషకులను, భాషాభిమానులను శోక సంద్రంలో ముంచేసింది.

లీడెన్ భారతదేశంలో అడుగుపెట్టిన నాటినుండి మరణించే వరకూ తొమ్మిదేళ్ళ ఉద్యోగ నిర్వహణలో 2106 సంపుటాల్లో విషయ సేకరణ చేశాడు. తాను నేర్చిన భాషల పరస్పర సంబంధాలను విశ్లేషించాడు. ఆయన మరణానంతరం లాక్ హెర్ట్ రచించిన 'లైఫ్ ఆఫ్ స్కాట్' అనే గ్రంథంలో లీడెన్ వ్యక్తిత్వం, వైదుష్యం, కథలు, కథాగేయాలు, ఆయన రచనలు ప్రచురించారు. లీడెన్ సేకరించిన వాటిలో తెలుగు లిపిలో ఉన్నవి 272 అని లెక్క తేల్చారు. ఇన్ని వివరాలు సేకరించిన ఆరుద్రగారికి శతవందనాలు. ఈ వ్యాసానికి ఆకరువులయిన 'తెలుగుభాషకు విదేశీయుల సేవ' రచయిత ఆచార్య జి.లలిత, 'తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు' రచయిత డా. జోలిపాళెం మంగమ్మ గార్లకు కృతజ్ఞతలు.



"విజ్ఞానశాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలని ఉపాధ్యాయులను కోరుతున్నా. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తీ సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషా మాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదువువల్లే సాధ్యం." – ఏ.పి.జె.అబ్దుల్ కలామ్

పుస్తక సమీక్ష

# కథలు, స్వప్నకావ్యము, వ్యాసములు
# పానుగంటి లక్ష్మీనరసింహారావు




పుటలు:240
వెల:రు. 200/-
రచన: పానుగంటి లక్ష్మీనరసింహారావు
ప్రచురణ :వి.వి.ఐ.టి.విద్యాసంస్థ,
పంపిణీ: క్రియేటివ్‌లింక్స్ పబ్లికేషన్స్
హైదరాబాద్-501 505
సెల్: 98480 65658

నవీనాంధ్ర సాహిత్య నిర్మాతలలో చిలకమర్తి, పానుగంటి, మొక్కపాటి గణుతికెక్కినవారు. వీరిలో పానుగంటి వ్యంగ్యాత్మక విమర్శకులు, నాటకరచయిత. సంఘోద్ధరణ వారి ధ్యేయం. వావిళ్ల వారు ప్రచురించిన సాక్షి సంపుటాలు అందుకు నిదర్శనం. ఇప్పుడు ప్రత్యేకంగా "కథలు, స్వప్నకావ్యము, వ్యాసములు పానుగంటి లక్ష్మీనరసింహారావు"-పేరుతో మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వి.వి.ఐ.టి విద్యాసంస్థ ఈ గ్రంథాన్ని ప్రచురించడం ముదావహం. ఇందులో 11కథలు, 14వ్యాసాలు, ఒక కావ్యం చోటు చేసుకున్నాయి. పానుగంటివారి కాలంలో వర్ధిల్లిన వ్యావహారిక భాషోద్యమం, భావకవిత్వం, నవ్య కవిత్వాలను హేళన చేస్తూ వ్రాసినది-స్వప్నకావ్యం. ఇందలి 14 వ్యాసాలు వావిళ్ళవారు ముద్రించిన సాక్షి సంపుటాలలో లేనివి. 11 కథలలో సామాజికాంశాలు ప్రతిబింబిస్తున్నాయి. భార్యగుణమే సౌందర్యంకాని, భార్య సౌందర్యం గుణం కాదనే సందేశంతో కూడినది చిన్నకథ. 'హిందూ గృహిణి'-దాంపత్యజీవితానికి అద్దం పట్టింది. నలుపు తెలుపు తగులాటాల తమాషా-'మేరీ నారాయణీయం'. అతిథి పూజామర్యాదలతో నిండిన-'కానుగుచెట్టు', వేశ్యాలంపటత్వంతో ఛిద్రమైన కుటుంబగాథ-'శ్రీరామా!' బైరాగి దీక్షకు నిదర్శనం-'జయసీతారామ్'. జోస్యం ఫలితానికి అద్దంపట్టింది-'రామరాజు'. ఇష్టంలేనిదాన్ని వదిలించుకోవడం కనబడుతోంది-'రామరామ'లో. ప్లీడరు మోసాలు దర్శనమిస్తాయి- 'ప్లీడరు పట్టు'లో. దొంగకు కూడ దైవభక్తి ఉందని తెలుపుతుంది-'శివరామా'. పందెంకోసం నటించడం 'హాస్యకథ'లో వెల్లడవుతుంది. వ్యాసరచయిత, నాటక రచయితగానే కాక, కథారచయితగా కూడా పానుగంటి వారిని పరిచయం చేస్తుంది ఈ గ్రంథం, సాహిత్యాభిమానులందరు చదవదగినది.

డా॥వెన్నిసెట్టి సింగారావు
సెల్ : 9393015584.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# అమ్మనుడి కోసం తపించిన 'జంగల్ నామా' సత్నాం

**పం**జాబి రచయిత సత్నాం- గెరిల్లా దళాలతో కలిసి, బస్తర్ తిరిగి రాసిన అనుభవాలను 'జంగల్ నామా'గా




అంగ్లంలో, అదేపేరుతో తెలుగులో వచ్చింది. ఆఫ్రికన్ రచయిత గుగిలాగే అతడు గోండుజాతి జ్ఞాపకాలను వినాలని తపించాడు. 'గోండుతెగవారిలో కథలు చెప్పుకునే సంప్రదాయం ఒకటి ఉంది ఉంటుంది. కానీ గెరిల్లాదళ నాయకుడు రాజు నడిగితే తను ఇప్పటివరకు విన్న కథలేవీ లేవన్నాడు.నేను చాలామందిని అడిగాను కానీ వారికీ కూడా మనవళ్ళకు మనవరాళ్ళకు కథలు చెప్పే తాతయ్యలు, నాయనమ్మలు కనబడలేదట. దక్షిణ బస్తర్‌లో గిరిజనులకు పాటలు పాడుకునే సంప్రదాయం ఉన్నది. కానీ రాజు అతని మిత్రులకు తెలియని కథలు ఏవో ఉండి ఉంటాయి. కథ అంటే ఒక ఆలోచనల సమాహారపు సృష్టి. లేదా మనిషి సాధించిన విజయాల జ్ఞాపకాలను సజీవంగా ఉంచే ప్రయత్నం. ఒకతరం నుండి మరోతరానికి అందివచ్చే క్రమంలో ఇవే పురాణాలుగా మారతాయి.

'వారు పాడే పాటలు వినండి, మనుషులను ఎలా సంఘటిత పరుస్తాయో ! నారిని నిర్దేశించే వారెవరూ లేకున్నా మొత్తం గ్రామస్తులంతా కలిసి ఆడి పాడతారు. వారి పాదాలను చూడు, ఎంత లయబద్ధంగా నాట్యం చేస్తున్నాయో! లయబద్ధత వారికి సహజంగా వస్తుంది. దాన్ని ఏ పాఠశాలలో నేర్పరు. వారికి నిజానికి జీవితమే ఒక పాఠశాల. ప్రతిఒక్కరూ బస్తర్ చలామణిలో అటువంటి పురాగాథలు గురించి తెలుసుకోవాలనే నేను ప్రయత్నించాను ఇంకొంచెం సమయం ఉండుంటే ఈ విషయాన్ని లోతుగా పరిశిలించేవాడిని. అయినప్పటికీ ఇటువంటి సాహసగాథ ఒకటి నాకు పరిచయం అయ్యింది. 1910లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీసిన గుండధుర్ అనే సాహసవీరుడి గురించి తెలిసింది. ఎందుకోగాని గుండధుర్ కథ అటు పాటలరూపంలో కానీ కథారూపంలో ఇక్కడి ప్రజలలోకి వెళ్ళలేదు. దండకారణ్యంలో గెరిల్లాలు నిర్వహించిన సదస్సులో తెలుగుపాత్రికేయ మిత్రుడొకడు నాకు గుండధుర్ గురించి ..గోండులు ఇతర గిరిజనులపై ఎన్నో పుస్తకాలు రాసిన వేరియర్ ఎల్విన్ గురించి కూడా చెప్పాడు' ఇలా గుగీ లాగా, సత్నామ్ వాళ్ళ జ్ఞాపకాలు తెలుసుకోడానికి తాపత్రయ పడుతుంటే, వాళ్ళ ఆకలి బాధకు అవి ఎగిరిపోయాయి. గెరిల్లాలు పాడే విప్లవ గీతాలే మిగిలాయి అంటారు తెలుగు అనువాదం సంపాదకులు. దక్షిణ బస్తర్‌లో ఉన్న సంప్రదాయం విప్లవ రాజ్యంలో అంతరించడం విచారకరం.

**'బంగారపు కంచానికైనా గోడ చేర్పు 'అమ్మనుడి' కావాలి'.**

వరంగల్ జిల్లాలో బంజారా పిల్లలు ఎక్కువగా చదివే ప్రాంతంలో కారేపల్లి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయుడు సీతారాం ఎంతో విమర్శనాత్మకంగా రాసిన అనుభవాలు 'కారేపల్లి కబుర్లు' .ఆ కళాశాల ప్రిన్సిపాల్ 'ప్రతివిద్యార్థి ఇంగ్లీష్ ఖచ్చితంగా పాస్ అయ్యేందుకు కృషి చేశారు. స్వయంగా ఆంగ్లం బోధించారు. స్లిప్ టెస్ట్‌లు పకడ్బందిగా పెట్టారు. చదువు తప్ప మరోపని లేకుండా చేశారు .ఆయన కృషి ఒక విపరీత సంస్కృతి ఏర్పరిచింది' అంటున్నరచయిత సీతారాం పరిశీలన, చిరకాలం గిరిజన విద్యారంగంలో పనిచేసిన చినవీరభద్రుడి 'కొన్ని కలలు, మెలకువలు' ఆయన సంతోష చంద్రశాలలో చదువుకొత్తల అనుభవాలతో రాసిన 'బడికతలు' గుర్తుకు వస్తాయి. ఆ విపరీత సంస్కృతి గిరిజనపిల్లలను మరబొమ్మలుగా మార్చిన క్రమాన్ని సీతారాం ఇలా వివరిస్తాడు.

'గిరిజన పిల్లల్లో ఉండే పట్టుదలను ప్రిన్సిపాల్ channelse చేయగలిగారు. అయితే ఆ పిల్లల సృజన సామర్థ్యాలను పెంచటంలో జరిగిన కృషి పెద్దగా ఏమీలేదు. పిల్లలు ఎంత మెటీరియల్ ఇచ్చినా చదివి పారేస్తారు తప్ప, స్వయంగా ఆలోచించరు. ఫలితాల సాధన అనే మహత్తర లక్ష్యం ఉపాధ్యాయుల ముందు ఉండటం చేత విద్యార్థుల సృజనసామర్థ్యాన్ని గురించి ఆలోచించే వ్యవధిని వారు తీసుకుపోలేకపోయారు. కాంట్రాక్టు పద్ధతిలోని టీచర్ల భయం, జిల్లా సగటుకన్నా తగ్గితే ఉద్యోగం పోతుందనే భయం వల్ల, ఆ భయం పిల్లలకు బదిలీ అయింది. వాళ్ళు కూడా తమకు ఆలోచనాశక్తి ఉందనే విషయాన్ని విస్మరించారు. పోనీ ఇదైనా జరిగితే మేలే అని సరిపెట్టుకోడానికి వీలుచిక్కటం లేదు. పిల్లలు ప్రశ్నించటం మరిచిపోయారు. జ్ఞాపకం ఉండటమే జ్ఞానం అనేస్థాయికి చేరుకున్నారు.

తరగతిలో పాఠం వింటున్న పిల్లలకు ప్రశ్నలు పుట్టటం లేదంటే ఆలోచించే శక్తి ఆగిపోయింది అని. ఒక వేళ ప్రశ్నించమని ప్రోత్సహించినా ఏం అడగాలో తెలియని పరిస్థితికి పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి. రాష్ట్రంలో రెండవ స్థానంలో ఫలితాలు సాధించిన కళాశాల సాధించిందేమిటి?

గిరిజన విద్యార్థులను, వారి అభ్యసనపద్ధతులను గమనిస్తే మనకొక సంగతి విశదమౌతుంది .ఈ పిల్లల

భాషాసామర్థ్యాలు కనిష్ట స్థాయిలో ఉన్నాయి. తమది కాని భాషలో వీళ్ళు విద్య నేర్చుకుంటున్నారు. మాతృభాషా ప్రభావం ఈ పిల్లల మాధ్యమభాషమీద బలంగా పడుతున్నది. మాతృభాషలో ఉండే.. కల్పనలు, విద్యాభాషమీద ఉండటంతో, ఈ భాష పిల్లలకు క్లిష్టంగా మారింది. ఈ క్లిష్టత వారిలో ఒక న్యూనతకు కారణమౌతున్నది. భాషను ధారాళంగా మాట్లాడటం చేత ప్రసంగాలు చేయించి, వారికి ఈ భాషపట్ల ఉన్న క్లిష్టత తొలిగిపోయేలా చేయాలి. వేగంగా విషయాన్ని చెప్పటం నేర్చుకుంటే వేగంగా వినటం వస్తుంది. గ్రహింపులో వేగం చదవటంపై ఆసక్తి కలిగిస్తుంది. ఈ ఆసక్తి భాషానైపుణ్యాన్ని పెంచుతుంది.

నైపుణ్యం, అమలు సామర్థ్యం మధ్య విడదీయరాని సంబంధాన్ని కేవలం 35 మార్కుల అత్తెసరు పాస్ మార్కులుగా మార్చి ఫలితాలు, ఆధిక్యత సాధించామని చాటుకున్నందువల్ల ఫలమేమిటి?. 60కి 60 మార్కులు సాధించిన పిల్లలు కూడా కోకొల్లలుగా ఉన్నారు. **వారు సాధించిన మార్కులకు, పొందిన జ్ఞానానికి ఏమైనా సంబధం ఉంటుందా? ర్యాంకులు పొందిన పిల్లలంతా సైన్స్ పట్ల మక్కువను పెంచుకుని శాస్త్రవేత్తలుగా మారుతున్నారా! లేక అధిక జీతాలు, పదవులు పొందాలనుకునే ఉద్యోగార్థులుగానే మిగులుతున్నారా',** ఈ ఆవేదనలో 'మాతృభాషలో కల్పనలు' అవి అమ్మనుడి అంటే జానపద సాహిత్యంలోనే దొరుకుతాయి. వాటిని గుర్తుచేస్తూ బోధిస్తే పిల్లవాడు అల్లుకు పోతాడు. జనపాల శంకరయ్య బంజారా 'లంబాడీ జానపద సాహిత్యం' జీవితకాలపుకృషి. ఈ కారేపల్లి కబుర్ల రచయిత ఆ సాహిత్యంలో కొన్ని పలుకుబడులైనా వాడుతుంటే పిల్లలు దగ్గరయ్యేవారు. 'తెలంగాణ గిరిజన జీవితంలో పాట' వ్యాసాలలో కొన్ని పాటలను అమ్మనుడి ప్రచురించింది. తోటి అధ్యాపకురాలు ముందుమాట 'ఏ టీచర్స్ డైరీ' లో 'విద్యార్థుల భాషాసాంస్కృతిక నేపథ్యాల పట్ల అధ్యాపకులకు అవగాహన ఉండాలి. వారి పూర్వ జ్ఞాన పరిశీలన చేసి అంచనా వేయాలి. ' అని పుస్తకపారం వల్లించారు.

**ఎద్దీనింది అంటే దూడను కట్టేయమన్నట్లు**

ఈ మధ్య విశాఖమన్యంలో కోంధు పిల్లలకు బడి నడుపుతున్న అజయ్‌కుమార్ ఉపాధ్యాయులను కలిశాను, వాళ్ళు చీపురుపల్లి శోధన వారి పుస్తకాలు, పద్ధతులు యధాతథంగా వాడుతున్నారు. కొంత కోంధుభాషలో అనువదించుకున్నారు. నేను కోంధుభాషలో పనిముట్లు,నెలలు, జంతువులు, ఆటలు కలుపుంటూ చెప్పమని ఆ పదాల జాబితా కొసరి కొసరి రాయించాను. రెండోసారి నేను వెళ్లేసరికి అజయ్, గిరిజన సంక్షేమ శాఖ వేసిన ఒకటి రెండు తరగతుల వాచకం 'కొంధు భారతి' పట్టుకొచ్చాడు. వాటిలో ఈ ఆట పాటలు కొద్దిగా ఇచ్చారు. ఆ పుస్తకం చూసి ఆ గిరిజన ఉపాధ్యాయులకు ప్రాణం లేచొచ్చినట్లైంది. గబగబా అవన్నీ రాసుకున్నారు. గుసగుసలు మొదలు పెట్టారు. వాళ్ళకు లెక్కలు, ఇంగ్లీష్ ఇంకా చాలా చెప్పాలి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపించాలంటూ అజయ్ వాళ్ళను మళ్లించాల్సి వచ్చింది.

'శోధన' పద్ధతి మనోహర్ ప్రసాద్ కోయలలో, కొండరెడ్లలో, గోండులలో పాటిస్తున్నారు. శోధనబృందమే వారికి శిక్షణనిస్తున్నారు. మనోహర్ ప్రసాద్‌తో వెళ్లి శోధన కామేశ్వరరావు గారిని కలిసినప్పుడు 'మీరు ఆయా ప్రాంతాలలో, ఆయా సామాజిక వర్గాలకు, తెగలకు శిక్షణనిచ్చేటప్పుడు కాస్త 'లోకలైజ్' చేయండి అని చెప్తూ, వీళ్ళంతా 'ఎద్దీనింది అంటే దూడను కట్టేయమన్నట్లు' మీ పద్ధతి నకలు కొడుతున్నారు'. అని అజయ్ ఉదాహరణ, మనోహర్ ప్రసాద్‌తో నా అనుభవం చెప్పాను. అంతేసంగతులు.

ఈ మధ్య గిరిజన సంక్షేమ శాఖ ప్రధానోపాధ్యాయులకు కరదీపికలలో గిరిజన సంస్కృతి-కొండరెడ్ల, విశాఖ గిరిజన సంస్కృతి వాచకాలు తయారు చేయించింది. కానీ వాటిని అచ్చువేయలేదు. తెలుగు విశ్వవిద్యాలయం కొండరెడ్ల ఆశ్రమ పాఠశాలలో పిల్లలు పాడుకునే పాటలతో రెండుపుస్తకాలు అచ్చువేసారు. యాదయ్య దశాబ్దం పాటు కోయలలో కొండరెడ్లలో పనిచేసి వాచకాలు. ఈ మధ్యన వాళ్ళకోసం బాలసాహిత్యం తయారు చేశారు.

**భజన చేసే విధము తెలియండి !.**

అజయ్ బృందం, ఈ మధ్యన చింతూరు గిరిజనాభివృద్ధి సంస్థ వారు ప్రారంభించిన కొండరెడ్లబడులకు శిక్షణ నిచ్చారట.వాళ్ళ పాట ఒకటైనా తెలుసుకున్నారా అని ముఖపుస్తకంలో ఆరా తీసాను. ఇలా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇందరు చుట్టూ కమ్మేసేసరికి గిరిజనుడు తనెవరో తాను మరిచి పోతున్నాడు. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నాడు. ఈ మధ్య పర్యాటక సౌకర్యాలు పెరిగి రచయితలు, కవులు అడవుల వెంట పడుతున్నారు. గిరిజనుడు ఈ అధికారుల, విద్యావేత్తల, రచయితల భజన చేస్తున్నాడు. మల్లిపురం జగదీశ్ అన్నట్లు ఐ.టి.డి.ఏ ముందు క్యా



కదుతున్నాడు. అదేకదా కావలసింది!.

మానవశాస్త్రవేత్త హైమెండర్ఫ్ దంపతులు 1945లో రెండేళ్ళు తిరిగి కొండరెడ్ల మీద ప్రపంచ ప్రసిద్ధమైన రచన 'ది రెడ్డీస్ అఫ్ బైసన్ హిల్స్' రాసిన ప్రాంతమిది. ఆయన చెంచులమీద కూడా మరో ఉద్గ్రంథం రాసాడు. ఆయన శిష్యుడు గొండు, కొలాముల మీద చిత్రం తీసిన మైఖేల్ యార్క్‌ను పిలిచి తెలంగాణా ప్రభుత్వం పండుగ చేసింది. ఆదిలాబాద్ ఆకాశవాణిలో సుమనస్పతి వాళ్ళ పాటలు రికార్డు చేస్తున్నాడు. రంపచోడవరం గిరిజనాభివృద్ధి సంస్థ గిరిజనుల జ్ఞానాన్ని కాలెండర్ల రూపంలో ప్రచురించింది. ఇంత సమాచారం దొరుకుతున్నా, మనం మాత్రం వాళ్ళగురించి తెలుసుకోకుండా, మనచదువులు వాళ్ళనెత్తిన రుద్దటానికి కొత్త కొత్త ప్రయోగాలతో నేలవిడిచిసాము చేస్తున్నాము.

'భజన చేసే విధము తెలియండి! జనులార మీరు .......'

# మేధోశిఖరం, గాంధేయవాది
# అంతర్జాతీయ ప్రముఖుడు ఇ.ఎస్.రెడ్డి




**తెలుగువాడైన ఒక అంతర్జాతీయ ప్రముఖుడు 2020 నవంబరు 1వ తేదీన అమెరికాలో కీర్తిశేషులయ్యారు. ఆయనే శ్రీ ఏనుగు శ్రీనివాసులురెడ్డి. తెలుగేతరులకు ఆయన ఇ.ఎస్.రెడ్డిగా పరిచితుడు.**

1952లో నెల్లూరులో పుట్టిన ఇ.ఎస్.రెడ్డి మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడైన తర్వాత న్యూయార్క్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితిలో చేరి మూడున్నర దశాబ్దాలపాటు పనిచేశారు. ఆ అంతర్జాతీయ సంస్థ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్‌గా పదవీ విరమణ చేశారు. ఐక్యరాజ్యసమితిలో ఆయన పలు బాధ్యతల్ని నిర్వహించారు. జాతివివక్ష (అపార్థీడ్)కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సారథిగా ఇఎస్ రెడ్డి సుప్రసిద్ధుడయ్యారు. 1960ల నుంచి 1980ల వరకు దక్షిణాఫ్రికాలో జాతివివక్షకు వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని సమీకరించేందుకు ఆయన విశేష కృషి చేశారు.

పదవీ విరమణ అనంతరం కూడా ఆయన తన వ్యక్తిగత స్థాయిలో ఆ బాధ్యతలను నిర్వహించారు. జాతివివక్ష వ్యవస్థ ఆ బాధ్యతలను నిర్వహించారు. జాతివివక్ష వ్యవస్థ అంతిమంగా కూలిపోయినప్పుడు ఇఎస్‌రెడ్డి దక్షిణాఫ్రికాను సందర్శించారు. ప్రజలు, ప్రభుత్వం ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయనను అత్యున్నత పౌర పురస్కారంతో దక్షిణాఫ్రికా ప్రభుత్వం సత్కరించింది. దక్షిణాఫ్రికాలో సామాన్య ప్రజలు ఎందరో ఇ ఎస్ రెడ్డి పట్ల ఇటువంటి గౌరవాన్నే కలిగివున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇఎస్‌రెడ్డికి ఆర్డర్ ఆఫ్ ది కంపేనియన్స్ ఆఫ్ ఆలివర్ టాంబో పురస్కారాన్ని కూడా ప్రదానం చేశారు. అయితే సామాన్య ఆఫ్రికన్లు తనపట్ల ఇప్పటికీ చూపుతున్న గౌరవాదరాలే ఇఎస్ రెడ్డికి ఎనలేనివి అనడంలో సందేహం లేదు.

దక్షిణాఫ్రికా జాతి వివక్ష వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తూ మహాత్మాగాంధీ జీవితం, కృషి పై ఇఎస్ రెడ్డి ప్రగాఢ ఆసక్తిని పెంపొందిచుకున్నారు. గాంధీపై ప్రపంచవ్యాప్తంగా వెలువడిన వ్యాసాలు, పుస్తకాలు దాదాపుగా అన్నీ ఇఎస్ రెడ్డి వద్ద ఉన్నాయి. సబర్మతి ఆశ్రమం వెలుపల గాంధీనీ గురించిన ఇంత విస్తృత సమాచారం బహుశా మరెవ్వరి వద్ద, మరెక్కడా ఉండదనడం సత్యదూరం కాదు. ఈ సమాచార మంతటినీ ఆయన అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. వివిధ దేశాల స్కాలర్లు ఆ సమాచారాన్ని వినియోగించుకొంటున్నారు. గాంధీపై వెలువడిన అనేక గ్రంథాలు, రెడ్డి అందించిన సహకారంతోనే రూపు దిద్దుకున్నాయి.

ఇఎస్ రెడ్డి సతీమణి టర్కిష్ జాతీయురాలు. టర్కీష్ మహాకవి నజీమ్ హిక్మత్ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించిన విదుషీమణి. ఈ దంపతులు మన్‌హట్టన్‌లో యాభై సంవత్సరాలకు పైగా నివసించారు. అయితే నాలుగు సంవత్సరాల క్రితం కుమార్తె

ప్రోద్బలంతో వారు కేంబ్రిడ్జ్‌కు వచ్చి స్థిరపడ్డారు.

ప్రముఖ జర్నలిస్టు, చరిత్రకారుడు, గాంధీపై సాధికార గ్రంథాల రచయిత రామచంద్ర గుహ, ఇ.ఎస్.రెడ్డి గురించి వ్రాస్తూ ఆయన తనకు తండ్రి వంటివారని, గాంధీ గురించి తాను చేసిన పరిశోధనపై, రచనలపై ఆయన ప్రభావం అపారంగా ఉందని అంటాడు. తాను అమితంగా అభిమానించే, గౌరవించే ఇద్దరు విద్వద్ వరుల్లో ఇ.ఎస్.రెడ్డి ఒకరు అని రామచంద్రగుహ వ్రాశారు. (మరొకరు చైనా చరిత్రకారుడు రోడెరిక్ మెక్‌పార్కర్ రాడ్). రామచంద్రగుహ– ఎంతో పరిశోధన చేసి, రచించిన 'గాంధీ బిఫోర్ ఇండియా' ఎంతో ప్రఖ్యాతిగాంచిన పెద్ద గ్రంథం. ఈ రచనను ఆయన ఇ.ఎస్.రెడ్డికి అంకితం చేశారు!



అధ్యయనశీలి, పరిశోధక రచయిత టి. రవిచంద్ ఇలా వ్రాశారు:

" 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకాన్ని రామచంద్రగుహ వ్రాస్తున్న సందర్భంలో 1992 ప్రాంతాల్లో న్యూయార్క్‌లో ఉంటున్న ఇ.ఎస్. రెడ్డిని కలుసుకోమని తనను గోపాలకృష్ణ గాంధీ పంపాడని చెబుతూ, ఇఎస్ రెడ్డిని కలుసుకోవటమే 'గ్రేటెస్ట్ గిఫ్ట్' (గొప్ప బహుమతి)గా భావిస్తున్నానంటాడు. ఆయన్ని యుఎన్ఓ కేంద్ర కార్యాలయం సమీపంలో ఉన్న మిడ్ టౌన్ మాన్‌హట్టన్‌లోని చిన్న గదిలో కలుసుకున్నట్టు రాశాడు. ఈ జీవిత చరిత్ర పరిశోధనలో గాంధీని చేరుకోవటానికి నా మార్గాన్ని ప్రకాశింపచేశాడు ఇ.ఎస్. రెడ్డి అంటాడు రామచంద్ర గుహ. ఈ పుస్తక పరిశోధన సమయంలో, రాతప్రతిని సిద్ధం చేసేటప్పుడు ఆయన్ని నిత్యం కలుస్తూ గాంధీజీ గురించి దక్షిణాఫ్రికా చరిత్రలో ఆయనకు ఉన్న అసాధారణ జ్ఞానాన్ని ఉపయోగించుకున్నానంటాడు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆర్కైవ్స్ లో గాంధీజీ కి సంబంధించిన విషయాల్ని గురించి చెప్పడమే కాకుండా, ఆయన తన స్వంత సేకరణలో ఉన్న ఆకరాలను అందించి తన పరిశోధనకు చాలా దోహదపడ్డాడు అంటాడు. ఇ.ఎస్. రెడ్డి కుటుంబపరమైన బాధ్యతల్లో తలమునకలయి ఉండి కూడా తన రాతప్రతుల్ని చదివి, సరిదిద్దేవాడని, అందువల్ల ఈ పుస్తకాన్ని ఆయనకు అంకితమివ్వడమనేది, ఈ పరిశోధనలో ఆయనకు రుణపడిన దానికి తగిన వ్యక్తీకరణ కూడా కాదంటాడు.

ఇ.ఎస్. రెడ్డికి తన పుస్తకాన్ని అంకితం చేస్తూ రామచంద్ర గుహ రాసిన మాటల్ని చదివితే ఆయన గొప్పతనం ఏమిటో తెలుస్తుంది 'ఇ.ఎస్.రెడ్డి, భారతదేశ భక్తుడు, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యవాది, అన్ని జాతుల గాంధీ పరిశోధకులకు మిత్రుడు, సలహాదారుడు'.అని ఆయన రాశారు

బిడియస్థుడు, ఉదాత్తుడు, గొప్ప అధ్యయనపరుడు, నిజమైన వీరోచిత వ్యక్తి అని 'గాంధీ బిఫోర్ ఇండియా' గ్రంథ రచయిత రామచంద్ర గుహ చేత ప్రశంసలందుకున్న ఇ.ఎస్. రెడ్డి తెలుగువాడయినందుకు మనమంతా గర్వపడాలి. అరుదైన ఈ ఆంధ్ర ప్రముఖుడు 1997 ప్రాంతాల్లో నేను డా॥ కె.బి. కృష్ణ కొన్ని రచనల్ని వెలుగులోకి తెస్తున్న సమయంలో సోషలిస్టు మిత్రులు రావెల సోమయ్య గారి ద్వారా నాకు పరిచయమయ్యాడు. ఆయనకు డా॥ కె.బి. కృష్ణ అంటే చాలా అభిమానం. నాటి త్రివేణి (1940) ఆంగ్ల పత్రికలో వచ్చిన డా॥ కె.బి. కృష్ణ వ్యాసం – మెటీరియలిజం అండ్ భగవద్గీత (భౌతికవాదం – భగవద్గీత) చదివి చాలా ప్రభావితుడయ్యాడు ఈ వ్యాసాన్ని తెలుగులోకి అనువాదం కూడా చేశాడు. కాని దాన్ని ప్రచురించలేదు. ఆనాటికి నాకు ఇ.ఎస్. రెడ్డి తో ప్రత్యక్ష పరిచయం ఏర్పడకపోయినా, లేఖాపరిచయం ఏర్పడింది. ఎప్పుడో విద్యార్థి దశలో డా॥ కె.బి. కృష్ణతో ఏర్పడిన పరిచయాన్ని దశాబ్దాలు గడిచినా ఆయన విస్మరించలేదు. చరిత్ర గుర్తించినవాళ్ళను గుర్తుపెట్టుకోవటంలో విశేషం ఏమీ లేదు. తమ సమకాలీన చరిత్రలోనే కాకుండా తర్వాత కాలంలో కూడా చరిత్రవల్ల దుర్మార్గంగా విస్మరించబడినవాళ్ళను స్మృతిపథంలోకి తెచ్చుకోవటమే గొప్పవాళ్ళ గొప్పతనం. డా॥ కె.బి. కృష్ణ చరిత్ర కానీ తమిళ తంబినాయుడుల చరిత్రకానీ ఎవరికి కావాలి? వాళ్ళ గురించి రాస్తే మనకొచ్చేదేమిటి అని ఆలోచించే పరిశోధకులు, మేధావులే మనకు ఎక్కువ. కానీ, ఇ.ఎస్. రెడ్డి లాంటి ఉదాత్త వ్యక్తిత్వంకలవాళ్ళు నిష్కాముకంగా తమ పనేదో తాము చేసుకొంటూ ముందుకు వెళ్తుంటారు. మన పక్కనే ఉన్న ఇటువంటి గొప్పవాళ్ళను తెలియనట్టు విస్మరించటమో, అదీ కుదరకపోతే అపహాస్యం చేయడమో చేసే సగటు తెలుగువాడి తెగులు గురించి ఎంత రాసినా తరగదు'.

సంపాదన కోసమే విదేశాలకు వెళ్లినవాడు కాదు ఇఎస్. రెడ్డి గారు. ఐక్యరాజ్యసమితిలో ఆయన సేవలకూ ఒక నిజమైన మేధావిగా అయన మానవాళికి చేసిన సేవలకూ– ముఖ్యంగా జాతివివక్షను వ్యతిరేకిస్తూ చేసిన పోరాటానికి గుర్తింపుగా మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు ఎటువంటి గౌరవ మర్యాదలను, మన్ననలను అందించాయో తెలియదు! చరిత్రలో నిలిచేవిధంగా జీవించిన ఉదాత్త మేధోజీవి ఇఎస్ రెడ్డి. మన యువతకు గొప్ప ఆదర్శం.

**తెలుగువాడుగా పుట్టి, ప్రపంచస్థాయి కీర్తిప్రతిష్ఠలను ఆర్జించి, తన జీవితాన్ని సార్థకం చేసుకొన్న గొప్ప వ్యక్తి ఇ.ఎస్.రెడ్డి గారికి శ్రద్ధాంజలి ఘటిద్దాం.**

**–అమ్మనుడి**

–వాచస్పతి

# పదనిష్పాదనకళ 5

(గత సంచిక తరువాయి...)

*The joy of coining new words!*

**ఆంగ్ల మేధావులు తమ మాతృభాషలో నూతన పదనిష్పాదన ఎలా చేశారు ?**

కొందఱు తలపోస్తున్నట్లుగా ఇంగ్లీషులో ఈనాడు మనకి కనిపించే పదాలు ఇతర భాషల నుండి మక్కికి మక్కి దిగుమతి చేసుకున్నవి కావు. ఆకాశం నుంచి హఠాత్తుగా ఊడిపడ్డవీ కావు. అవి మొదట్లో యావత్తు జనసామాన్యానికీ తెలిసినవీ కావు. వాటి వెనుక ఇంగ్లీషు మేధావుల కృషి చాలా ఉంది. అలాంటి కృషినే ఇప్పుడు చర్చిస్తున్నాం.

**1. పోలిక** (Analogy) :- అంతకుముందున్న పదాలకి సంబంధించిన కొత్త పదాలు అవసరమైనప్పుడు ఆయా పదాల స్వరూపానికి కొద్దిగా మార్పులు చేర్పులూ చేసి వేఱే అర్థంలో వాడారు. అంతకుముందు కేవలం uncanny అనే పదం ఒక్కటే ఉండగా canny అనే పదాన్ని కల్పించారు. అంతకుముందు gnostic (ఒక ప్రాచీన క్రైస్తవ శాఖ సభ్యుడు) ఒక్కటే ఉండగా agonstic (అజేయవాది, నాస్తికుడు) అనే పదాన్ని కల్పించారు. Outrage అనేది అచ్చమైన ఆంగ్లో-శాగ్జన్ పదం కాగా దానికి విశేషణంగా outrageous అని లాటిన్ శైలిలో కల్పించారు. అంటే ఉన్న పదాల నుండే కొత్త పదాల్ని కల్పించారు. అలా కల్పించడం ఇంగ్లీషు /లాటిన్ వ్యాకరణ సూత్రాలకు విరుద్ధమైనా లెక్క చెయ్యలేదు. సూత్రాలు వర్తింప శక్యమైతే పాటించారు. పాటించడానికి అవకాశం లేనిచోట త్రోసిపుచ్చారు.

**2. ధ్వన్యనుకరణ** (Imitation) :- మనుషులు భావోద్వేగపు క్షణాల్లో చేసే అవ్యక్త కాకుస్వరాలకీ, ధ్వనులకీ శబ్దప్రతిపత్తిని కల్పించారు. ఆ ధ్వనులకి – తెలిసిన ప్రత్యయాల్ని జోడించి కొత్త పదాల్ని నిష్పాదించారు. ఆ క్రమంలో lispism, yahoo, pooh-poohing, booing మొదలైన పదాలు పుట్టాయి. మనవాళ్ళు కూడా "చకచక, నిగనిగ" నుంచి చాక చక్యం, నైగనిగ్యం, నిగారింపు మొదలైన పదాల్ని నిష్పాదించారు. అయితే ఈ ప్రక్రియ ఇటీవలి కాలంలో వెనకబట్టింది.

**3. అర్థాంతర ప్రకల్పన** (Semantic alteration):- సాధారణ పరిస్థితుల్లో భాష చనిపోదు. ఇసుమంత మారుతుందంతే ! ఇంగ్లీషువారు అంతకుముందున్న పదాలకే కొత్త అర్థాల్ని అనువర్తించారు. Fan, straw, (cheque) leaf, web, portal మొదలైనవి ఈ కోవకి చెందినవి.

కాని ఇలా చెయ్యాలంటే భాషాపటిమ కన్నా మనిషిలో కొంత కవితాత్మకత తోడవ్వాలి.

**4. పునరుద్ధరణ** (Revival) :- భాషలో కొన్ని పదాలు బహు పాతవై ఉంటాయి. అవి నిఘంటువులకి మాత్రమే పరిమితమై ఉంటాయి. వాటిని ఇప్పుడెవఱూ ఏ మాండలికంలోను వాడకపోవచ్చు. వాటికి సమానార్థకాలైన వేఱే పర్యాయ పదాలు ఇప్పుడు లభ్యమవుతూ ఉండొచ్చు. అంతమాత్రాన ఆ పాతపదాలు పనికిమాలినవి కావు. ఈ సత్యాన్ని ఇంగ్లీషు వారు లెస్సగా కనిపెట్టారు. ఆ పదాల పాత అర్థాలకి సరిపోలిన కొత్త అర్థాల్లో వాటిని వాడడం మొదలుపెట్టారు. ఆధునికంగా లభ్యమౌతున్న పదాలకి తోడు ఈ పాతపదాలు కొత్త అర్థాల సోయగాలతో జతచేతి ఇంగ్లీషు భాషని నవయౌవనంతో పరిపుష్టం చేశాయి. Olympics, carnival, domain మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

**5. మాండలికాల విస్తృత వినియోగం** (Universalization of dialects): ఇంగ్లీషులో ఎన్ని మాండలికాలు ఉన్నాయో ఎవతికీ అంతుచిక్కదు. అయితే ఇంగ్లీషువారు ఆ మాండలికాలన్నింటినీ సందర్భానుసారంగా ఉపయోగించుకుని భాషని శక్తిమంతం చేసుకున్నారు. మాండలిక పదాలకి ఇప్పటికే ఉన్న అర్థాలకి తోడు కొత్త అర్థాల్ని జతకలిపారు. కొన్ని సందర్భాల్లో Slang నుండి సైతం ప్రామాణిక భాషని సిద్ధం చేశారు. ఉదాహరణకి jazz అనే పదం New Orleans రాష్ట్రంలో ఒక అశ్లీల క్రియాధాతువుగా మాత్రమే వాడుకలో ఉండేది. అదిప్పుడు ఒక గౌరవనీయమైన సంగీత కళారూపానికి నామధేయమైంది.

**6. మిశ్రపద నిష్పాదన** (Hybrid coinage) :- ఇంగ్లీషులో ఇప్పుడు "చెయ్యదగిన" అనే అర్థంలో క్రియాధాతువుల చివఱ చేర్చబడుతున్న able అనేది నిజానికి ఫ్రెంచి ప్రత్యయం. మొదట్లో ఇది adorable మొదలైన ఫ్రెంచి ఆదాన పదాలకి మాత్రమే చేఱేది. క్రమంగా దాన్ని దేశి ఇంగ్లీషు పదాలక్కూడా యథేచ్ఛగా చేర్చడం మొదలైంది. ఈ రోజు think, drink, eat, walk లాంటి అచ్చ ఇంగ్లీషు పదాలక్కూడా ఇలాంటి పరిణామాన్ని చూస్తున్నాం .

**7. వైరిసమాస ఘటనం** (Mixed compounds) మన సంప్రదాయంలో సంస్కృత పదాలతో జతకలిపి తెలుగుతో సహా ఏ ఇతర భాషాపదాలకైనా సరే సంధులు, సమాసాలూ చెయ్యడం అనాదిగా నిషిద్ధం. కలిసే సమాస అవయవాలు రెండూ సంస్కృత పదాలైతేనే వాటి మధ్య సంధి-సమాసకార్యాలు అనుమతిపాత్రం. ఆ రకంగా అవసరంలేని సంస్కృతపదాలు కూడా తెలుగులోకి సమాసాల రూపంలో యథేచ్ఛగా చొఱబడిపోయాయి. ఒకప్పుడు ఇంగ్లీషులో కూడా ఇలాంటి సంప్రదాయమే ఉండేది. లాటిన్ గ్రీకు పదాలతో శుద్ధాంగ్ల పదాల్ని కలపకూడదు. అంతేకాక లాటిన్ సమాసాలు లాటిన్తో జఱగాలి. గ్రీకుసమాసాలు గ్రీకుతోనే జఱగాలి. లాటిన్ పదాలతో గ్రీకు పదాల్ని కలపకూడదు.

కాని ఆధునిక ఆంగ్ల మేధావులు ఈ సంప్రదాయాన్ని కావాలనే విశృంఖలంగా ఉల్లంఘించారు. తప్పలేదు, తప్పు లేదు. ఎందుకంటే సమాసంలో రెండో పదం కూడా ఆ భాషాపదమే అయివుండాలంటే, ఎంతమందికి లాటిన్ గ్రీకుల మీద పట్టుంటుంది ? అలా నూతన పదసృష్టి స్తంభించిపోతుంది.

**8. సమాస ఘటనం** (word compounds) : ఆంగ్ల మేధావులు గత శతాబ్దాల్లో ఉనికిలో లేని కొన్ని వ్యాకరణ సంప్రదాయాల్ని తమ భాషలో ప్రవేశ పెట్టారు. వాడుకలో బహుళ ప్రాచుర్యాన్ని పొందినప్పటికీ ఆంగ్లవ్యాకరణాల్లో మాత్రం ఆ నిర్మాణాలకు ఇప్పటికీ సముచితస్థానం లేదు. వాటిల్లో సమాసాలొకటి. సమాసం రెండు వేఱువేఱు అర్థాలు గల పదాలతో ఏర్పడే మిశ్రమం. ఆ మిశ్రమం నుంచి ఉత్పత్తిల్లే కొత్త పదం ఒక కొత్త అర్థాన్ని కూడా

స్ఫురింపజేస్తుంది.

**ఉదా :-** రాజభవనం. ఇది రాజు కంటేనూ, భవనం కంటేనూ వేఱైన ఒక ప్రత్యేకమైన శ్రేణికి చెందిన కట్టడాన్ని సూచిస్తుంది. సమాసాల సౌలభ్యాన్ని ఆంగ్ల మేధావులు త్వరగానే గ్రహించారు. ఇప్పుడు సమాసాల్లేకుండా ఇంగ్లీషు మాట్లాడడమే అసాధ్యం. ఒకవేళ అలా మాట్లాడితే ఇంగ్లీషు రాదేమోనని జాలిపడడం కూడా జఱగొచ్చు.

| సమాసం | విగ్రహవాక్యం | సమాసనామం (మన అవగాహనలో) |
|---|---|---|
| 1. Customer-care | Care for customers | చతుర్థీతత్పురుషసమాసం |
| 2. User-friendly | Friendly to the user | చతుర్థీతత్పురుషసమాసం |
| 3. User-serviceable parts | Parts serviceable by the user | తృతీయా తత్పురుషసమాసం |
| 4. Gas dealer | Dealer in gas | సప్తమీతత్పురుషసమాసం |
| 5. Expiry date | Date of expiry | షష్ఠీతత్పురుషసమాసం |
| 6. God-forsaken | Forsaken by God | తృతీయా తత్పురుషసమాసం |
| 7. Bible-thumping | Thumping the Bible | ద్వితీయాతత్పురుషసమాసం |
| 8. A London-bound airliner | An airliner bound for London | చతుర్థీతత్పురుషసమాసం |
| 9. Earth-fill | Filling with earth | తృతీయా తత్పురుషసమాసం |
| 10. Sky-diving | Diving in the sky | సప్తమీతత్పురుషసమాసం |
| 11. Trustworthy | Worthy of trust | చతుర్థీతత్పురుష సమాసం |
| 12. Action-packed | Packed with action | తృతీయా తత్పురుషసమాసం |
| 13. Painstaking/ breath-taking etc. | | |

అయితే ఇక్కడ ఒక ఆసక్తికరమైన వైచిత్రి ఉంది. దీన్నొక ప్రత్యేకమైన పదనిర్మాణ భేదంగా గుర్తించినప్పటికీ, తాము వాడుతున్నవి సమాసాలు (word compounds) అని ఆంగ్లేయులకి ఇప్పటికీ తెలియదు. అలాంటి మిశ్రమాల్లో మొదటి పదం functional గా adjective అవుతోందని వారు భ్రమిస్తున్నారు. ఆ మాటే తమ వ్యాకరణాల్లో వ్రాసుకుంటున్నారు కూడా! రెండుపదాలు కలుస్తున్నప్పుడు మాయమౌతున్న విభక్తి ప్రత్యయాల (prepositions) ని వివరించే వైయాకరణ బాధ్యత (grammarian's burden) గుఱించి మర్చిపోతున్నారు.

సమాసాలే మన భాషక్కూడా బలం. ఇంగ్లీషు వ్యాకరణాల్లా కాకుండా మన వ్యాకరణం సమాసాల్ని క్రోడీకరించి వర్గీకరించింది కూడా. అవి మన భాషలో ఇప్పటికే వందలాదిగా ఉన్నాయి. కాని ఆధునిక అవసరాలకి అవి సరిపోవు. మన భాషకున్న సమాసశక్తిని సక్రమంగా వినియోగించుకుని చాలా కొత్త పదాల్ని సృష్టించుకునే సౌలభ్యం ఉంది.

**9. సందర్భాంతర (ప్రకరణాంతర) ప్రయోగాలు** : నామవాచకాల్ని క్రియాధాతువులు (programming, airing, parenting, shopping, modelling, typing, cashing, triggering, highlighting, Focussing మొదలైనవి) గా మార్చి ప్రయోగించడం ఇంగ్లీషుకు ఎంత ఊపునిచ్చిందో ఇది కూడా అంతే ఊపునిచ్చింది. సందర్భాంతర ప్రయోగాలంటే– సాంప్రదాయికంగా ఒక సందర్భంలో మాత్రమే వాడాల్సిన పదాల్ని ఇంకొన్ని ఇతర సందర్భాలక్కూడా అనువర్తించి వాడడం. అలాగే ఒక రంగంలో వాడాల్సిన సాంకేతిక పదాల్ని ఇంకో రంగానికి ఆరోపించి వాడడం కూడా! ఉదా:- screen(తెఱ) నాటకాలకూ, సినిమాలకూ అన్వయించే మాట. దాన్ని సమా. సాంకే. (IT) రంగంలో కొన్నిరకాల పుటల్ని సూచించడానిక్కూడా వాడుతున్నారు. అలాగే, campaignకి ప్రాథమికంగా దండయాత్ర అని అర్థం. కాని ఇప్పుడు దాన్ని ప్రచార యుద్ధం అనే అర్థంలో కూడా వాడుతున్నారు. గుఱ్ఱాల శారీరాన్ని (horse anatomy) అందులో భాగాల్నీ కార్లకీ, ఇతర యంత్రాలకీ అన్వయించి ప్రయోగించడం కూడా జఱిగింది.

## మూడో అధ్యాయం

## నవీన పదనిష్పాదనకై కొన్ని మార్గదర్శకాలు

విస్తరిస్తున్న ఆధునిక విజ్ఞానానికీ వ్యవహారానికీ, అవసరాలకీ అనుగుణంగా కొత్త తెలుగు పదాల్ని కల్పించుకునేటప్పుడు కొన్ని ఆదర్శసూత్రాల్ని గమనంలో ఉంచుకోవడం అభిలషణీయం.

1. కొత్త వాడుకలు అలతి అలతి పదాలతో ఏర్పఱచిన చిఱుసమాసాలై ఉంటే మంచిది. పర్యాప్తమైన చిఱుతనాన్ని (optimum smallness) నిర్వచించడం కష్టం. కాని స్థూలంగా

(అ) తెలుగులిపిలో అయిదు అక్షరాలకి మించని పదాలూ,

(ఇ) ఒకవేళ అయిదు అక్షరాలకి మించినా, ఆఱేడు అక్షరాలు కలిగి ఉన్నా, రెంటి కంటే ఎక్కువ అవయవాలు లేని సమాసాలూ చిఱువాడుకలు అని భావించవచ్చు.

2. సాఫీగా అర్థమయ్యే ఇంగ్లీషు పదాల (plain English terms)కి విశేషణాల (adjectives)తో కూడిన వర్ణనాత్మక పదజాలాన్ని సృష్టించడానికి పూనుకోకూడదు. అలాంటి ప్రయత్నం సాధారణంగా కొండవీటి చాంతాడంత సమాసాలకి దారితీస్తుంది. ఉదాహరణకు ధూమశకటం.

3. ఒకవేళ మూల ఆంగ్లపదమే స్వయంగా ఒక సమాసమైనప్పుడు, దాన్ని రచయితలు ఒక ప్రత్యాహార (abbrevia-

tion) రూపంలో సూచిస్తున్నప్పుడు తెలుగులో కూడా దాన్ని ఒక సమాసంగా అనువదించి ఆపైన దానికి ఒక తెలుగు ప్రత్యాహార రూపాన్ని ఇవ్వడం తప్పు కాదు.

ఉదా :- Portable Document Format(PDF) = వహణీయ పత్ర సంప్రకారం (వ.ప.సం.)

4. ఆదాన అనువాదాలు (Loan translations - అంటే మూలభాషలోని అర్థాన్ని మన భాషలోకి అనువదించి పదాలు కల్పించడం) కొన్ని సార్లు తప్పవు. కాని అన్నివేళలా అదే మంత్రం గిట్టుబాటు కాదు. బ్లాగ్ లాంటి పదాల్ని "దాదాపుగా" అలాగే ఉంచి తత్సమాల్లా వాడుకోవడం మంచిది.

5. తెలుక్కి స్వాభావికమైన జాతీయాన్ని నుడికారాన్ని (idiom) భ్రష్టుపట్టించకూడదు. తెలుగులో ఇమడని నిర్మాణాలు(structures) శీఘ్రంగా పరమపదిస్తాయని మఱువరాదు.

6. భాషాపరిశుద్ధతని నిలబెట్టడమే మన అంతిమలక్ష్యం కాదు. భాషని సుసంపన్నం చెయ్యడమూ, ప్రయోగాత్మకతని ప్రోత్సహించడం కూడా మన లక్ష్యాలే. కాబట్టి వైరి సమాసాల్నీ, మిశ్రసమాసాల్ని విఱివిగా అనుమతించాలి. అయితే అవి శ్రవణసుభగంగా (వినసొంపుగా) ఉంటేనే పదికాలాల పాటు నిలుస్తాయి. వికారమైన పదసంయోజనలది అల్పాయుర్దాయం. తప్పనిసరై దిగుమతి చేసుకున్న ఇంగీషు పదాలకి సంస్కృతప్రత్యయాల (suffixes)నీ, ఉపసర్గల (prefixes)నీ చేర్చి వాడుకోవడం ఆమోదయోగ్యమే. ఉదా : కర్బనీకరణ మొదలైనవి.

7. ఇంగీషులో లాగే తెలుగులో కూడా ప్రత్యాహారాల (abbreviations) ద్వారా ఏర్పడే acronymsని (వెకిలిగా పరిగణించకుండా) వాటికి ఒక గౌరవనీయ స్థానాన్ని కల్పించడం చాలా అవసరం. తెలుగులో ఇప్పటికే అలాంటివి కొన్ని ఉన్నాయి.

**ఉదా** :- అ.ర.సం (అభ్యుదయ రచయితల సంఘం)

వి.ర.సం (విప్లవ రచయితల సంఘం)

సి.కా.స (సింగరేణి కార్మిక సమాఖ్య)

వీటి సంఖ్య ఇంకా ఇంకా పెఱగాలి. ముఖ్యంగా తెలుగు శాస్త్ర సాంకేతిక రంగాల్లో !

8. మిశ్రపద నిష్పాదన (Hybrid coinage) ని ప్రోత్సహించాలి. అంటే, ఒక భాషకి చెందిన ఉపసర్గల్నీ ప్రత్యయాల్నీ ఇంకో భాషకి చెందిన దేశిపదాలకి చేర్చి కొత్త పదాలు పుట్టించడం. ఉదాహరణకి :- దురలవాటు. ఇందులో "దుర్" అనే ఉపసర్గ సంస్కృతం. "అలవాటు" తేట తెలుగుపదం. ఇలాంటివే నిస్సిగ్గు, ప్రతివాదు, అతితిండి మొదలైనవి. ఇలాంటివి చాలా ఉన్నాయి కాని సరిపోవు. ఇవి వందలూ, వేలుగా పెఱగాలి.

9. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఒకటుంది. పాతపదాలు, కావ్యభాష, గ్రాంధికం అంటూ కుహనా అభ్యుదయ వాద శైలిలో అస్పృశ్యతానామాంకాలు (Labels) వేసి మన ముందటితరంవారు తెలుగుపదాల అనర్ఘ విలువను గుర్తెఱగక నిర్దాక్షిణ్యంగా సంఘబహిష్కరణ చేసిన అచ్చతెలుగు పదజాలం అపారంగా ఉంది. అలాగే అలాంటి సంస్కృత పద జాలంకూడా విపరీతంగా ఉంది.

అభ్యుదయపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
పదాలన్నీ కావాలిప్పుడు
దాస్తే దాగని భాష ! (మహాకవి శ్రీశ్రీకి క్షమాపణలతో)

ఆ పదజాలాన్నంతా ఇప్పుడు వెలికి తీయక తప్పదు. ఈ సందర్భంగా వ్యావహారికవాదం పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిన కొన్ని దురభిప్రాయాల్ని కూడా సవరించాలి.

10. సంపూర్ణ సమానార్థకాలు అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. అటువంటప్పుడు సమీపార్థకాలతో సరిపెట్టుకుందాం. భాష నిరంతర పరిణామశీలి కనుక మనం ఎంపిక చేసినవాటి కన్నా మంచి పదాలు భవిష్యత్తులో ప్రతిపాదనకొస్తాయని ఆశిద్దాం. ఒకే పరిభావనకి ఇద్దఱు-ముగ్గుఱు వేఱువేఱు నిష్పాదకులు రెండుమూడు వేఱువేఱు పదాల్ని కల్పించగా, ఆ అన్ని నిష్పాదనలూ సర్వోత్తమంగా ఉన్నట్లు అనిపిస్తే వాటన్నింటినీ పర్యాయపదాలుగా భావించి స్వీకరిద్దాం.

11. పాతపదాలకి కొత్త అర్థాలు కల్పించడం ద్వారా కొత్త పదాల్ని శూన్యంలోంచి కల్పించే అగత్యం నుంచి బయట పడతాం. కొన్నిసార్లు ఉన్న పదాల్ని "తగువిధంగా" రూపాంతరించడం (modifying) ద్వారా కొత్త పదాల్ని కల్పించి భాషని సంపన్నించవచ్చు. మన తెలుగుభాషలో ఇందుకు చాలా ఉదాహరణలున్నాయి.

ఉదా :

పథం = దారి

పథకం = scheme

పన్నకం = ఉచ్చుల అమరిక

పన్నాగం = కుట్ర

మొలక = మొలిచిన గింజ

మొల్క = మొక్క = చిన్న చెట్టు

సలుపు = ఇబ్బందిపెట్టు

జలుబు = శీతబాధ

జీవితం = బ్రతుకు

జీతం = బ్రతకడానికి సరిపోయే పైకపు చెల్లింపు

కట్టు = చుట్టికట్టేది

గట్టు = సరిహద్దుగా కట్టేది

వంక = ఏఱు

వాక = అదే (ఏఱు)

పోడు - కొంతకాలం వ్యవసాయం చేసి ఆ భూమిని తగలబెట్టడం

బోడు/బోడి - మొక్కలూ గడ్డీ అన్నీ పెఱికి పారేసిన నేల

దిగుబడి = పొలం నుంచి ఇంటికి తెచ్చుకుని దించుకునే పంట

దిగుమతి = ఓడ/పడవ మీదినుంచి దించుకున్న సరుకు

కంప = పొడవైన తీగెలూ ముళ్ళూ గల గుబురు (మూలం = కమ్ము = కమ్మీ)

గంప = పొడవైన వెదురుకమ్ముల్ని వంచి చేసిన పాత్ర (ఇనుము - ఇనప, ఔమ్ము - ఔంప అయినట్లు)

చేకూరు = పోగగు

చేకూరించుకొను = పోగు చేసుకొను → చేకుఱించుకొను → సేకరించుకొను (దీన్ని సేకరణ అని సంస్కృతీకరించడం కేవలం అసందర్భం. ఇలాంటి పదమేదీ సంస్కృతంలో లేదు)

పెంట = మానవ శరీర పరిత్యక్తం

పెండ (తెలంగాణాలో వాడుకలో ఉంది) = జంతుశరీర పరిత్యక్తం

పచ్చిది = ఉడికించనిది

పచ్చడి = ఉడికించకుండా నూఱి ఉప్పు, కారమూ, పోపూ

వేసిన కూరముక్కలు.

కొన్ని పదాల్ని ఇలా రూపాంతరించే ప్రక్రియలో భాగంగా వాటికి చివఱ 'క' చేర్చవచ్చు.(సంస్కృత పదాల విషయంలో కూడా ఆ భాష వ్యాకరణం ఇందుకు అనుమతిస్తోంది). ఉదా:

ఒకర్తి – ఒకర్తుక

పడతి – పడతుక

పెంట – పెంటిక

ఎమ్ము – ఎముక మొ॥

12. ఒక పదానికి ఎన్ని అర్థాలైనా ఉంటాయి గనుక ఆ అన్ని అర్థాలకీ ఇంకో భాషలోని దాని సమార్థకం కూడా ప్రాతినిధ్యం వహించాలంటే కుదరదు. సమార్థకాలన్ని సందర్భానుసారమైనవే గాని విదేశీ పదాలకి పూర్తిగా సోదర సమానాలు కావు. ఒక పదాన్ని ఇంగ్లీషులో ఎన్ని సందర్భాల్లో ఎన్ని అర్థాల్లో వాడతారో మన తెలుగుపదం కూడా అన్ని అర్థాల్లో ఉండాల్సిన అవసరం లేదు. ఆ సందర్భానికి తగిన అనువాదం చెయ్యగలిగితే చాలు. అసలు అలా ఏ భాషలోను ఉండదు. మనం 'ధర్మం' అనే పదాన్ని అనేక అర్థాల్లో వాడతాం. సందర్భాన్ని బట్టి ఇంగ్లీషులో దానికి 'law, natural justice, natural law, morality, duty' అని రకరకాలుగా అనువదిస్తారు. వీటిలో ఏ ఒక్క పదాన్నీ ధర్మానికి ప్రతినిధిగా ఎల్లవేళలా వాడడానికి అవకాశం లేదు.

13. లింగ నిరపేక్షాలు (Gender-neutral words) దొఱికితే మంచిదే. దొఱక్కపోతే ఏం చెయ్యగలం ? అన్ని భాషలూ ఇంగ్లీషులా ఉండాల్సిన పని లేదు. అయినా ఇంగ్లీషులో కూడా వస్తుతః లింగనిరపేక్షాలు లేవు. ప్రాచీన భాషల్లో అన్ని పదాలూ లింగసాపేక్షాలే (Gender-intensive words). (ఆ మాటకొస్తే ఏ భాషలోనూ లేవు). వారు ఒకప్పటి పుల్లింగాల్నే రెండు లింగాలకీ అనువర్తించడం మొదలు పెట్టి "అవే లింగనిరపేక్షాలు, పొ"మ్మన్నారు. కనుక తప్పనిసరి సందర్భాల్లో లింగసహితంగానే నిష్పాదించాల్సి ఉంటుంది.

14. ఇప్పటికే ఒక అర్థంలో వాడుకలో స్థిరపడ్డ పదాల్ని ముట్టుకోకూడదు. అర్థమౌతుంది కదా అని ఒక పదాన్ని అనేక అర్థాల్లో వాడడం మొదలు పెడితే అది చివఱికి అర్థం కాకుండానే పోతుంది. ఎందుకంటే కొత్త పరిభావనల (concepts) కి ఎప్పుడూ కొత్తపదాలే కావాలి. వాటిని ప్రజలకు నెమ్మదిగా అలవాటు చేయాలి. అంతేతప్ప వ్యావహారికవాద కండూతితో దొఱికిన/ తోచిన పాతపదాలతోనే తాత్కాలికంగా సరిపుచ్చుకుందామని ప్రయత్నించరాదు. అలా చేస్తే భాష ఎదగదు సరికదా, వాడుక పదాలన్నీ అవాంఛితమైన నానార్థాల్ని సంతరించేసుకుంటాయి. వ్యవహారహాని ఘటిల్లుతుంది. ఆఖరికి భాష మొత్తం ఒక పేద్ద విప్పజాలని పొడుపుకథగా, అర్థం చెప్పలేని అభంగశ్లేషగా, పరిష్కరణ దుస్సాధ్యమైన చిక్కుముడిగా మారుతుంది.

ఉదాహరణకు – ఒక దినపత్రికలో booking అనే మాటకు ఖరారు చేసుకోవడం అని వ్రాశారు. book చెయ్యడం, ఖరారు చెయ్యడం (finalization/confirmation) రెండూ ఒకటి కావు. కొంత మంది యాభైవేలు బయానా ఇచ్చి ఒక స్థలాన్ని book చేసుకుంటారు. కానీ వాళ్ళు మొత్తం ధరలో సగమైనా చెల్లిస్తేనే తప్ప ఆ స్థలం వారికి ఖరారు కాదు. bookingకి పుస్తకించడం అని అనువదిస్తే బానే ఉంటుంది, అంతకుముందు ఆ పదం మన భాషలో ఏ ఇతర అర్థంలోనూ లేదు గనుక, దాన్ని ఒక కొత్త రూపంతో, ఒక కొత్త అర్థంలో వాడితే ఫర్వాలేదు.

15. పాతపదాల్ని కొత్త సాంకేతికతలకి అన్వయించి వాడుకోవడం అవసరం. ఇందునిమిత్తం కొన్నిసార్లు నిఘంటువుల దుమ్ము దులిపి పాతపదాల్ని కొత్త అర్థాలలో పునరుద్ధరించడానికి వెనుదీయకూడదు. ఉదాహరణకు, Fan అంటే ఒకప్పుడు విసనకఱ్ఱ. ఇప్పుడది ఒక విద్యుత్ యంత్రంగానే గుర్తించబడుతున్నది. కొత్త సంస్కృతపదాల్ని సృష్టించడం కంటే ఉన్న తెలుగుపదాలకి నూతన అర్థావగతిని కల్పించడం, ఆధునికీకరించడం అవసరం. మనం ఈరోజు దాకా చేస్తూ వచ్చినది– అలా ఇబ్బడిముబ్బడిగా సంస్కృత పదాల్ని సృష్టించడం, అవి ఎవడైనా సరిగా పలక్కపోతే పలకలేదని బాధ పడ్డం, వాటిని ఇంగ్లీషు పదాల క్లుప్తతతో పోల్చి పరిహసిస్తే ఉడుక్కోవడం. తెలుక్కి నూతనపద నిష్పాదనశక్తి లేదనడం సరైన అవగాహన కాదు. పదనిష్పాదన అనగానే మనం అసంకల్పితంగా సంస్కృతం వైపే పరిగెత్తడానికి అలవాటు పడిపోయాం . ఆ క్రమంలో మన దృష్టంతా – "సంస్కృత సమాసాల/ పదాల పరిశుద్ధతని ఎలా కాపాడాలి? తెలుగుని ఎలా దూరంగా పెట్టాలి ? హిందీని చూచివ్రాయడానికి అవకాశం ఏమైనా ఉందా ?" ఇలాంటివాటి మీద కేంద్రీకృతమవుతున్నది.

16. ఏదైనా ఒక కొత్త పదాన్ని నిష్పాదించేటప్పుడు దాని క్రియారూపం (verb form), నామవాచక రూపం (noun form), విశేషణ రూపం (adjectival form). కర్తృరూపం (agency). కర్మరూపం (past participle form), ఉపకరణరూపం, కరణీయరూపం, శతృ–శానజ్ రూపం మొదలైన అనేక సంబంధిత రూపాల్ని దృష్టిలో ఉంచుకొని మఱీ నిష్పాదించవలసి ఉంటుంది. ఒకే పదానికి సంబంధించిన ఈ వివిధ నిర్మాణాలను పదకుటుంబం అని వ్యవహరించవచ్చు. విద్యావంతుడైన ప్రతి తెలుగువాడూ ఈ పదకుటుంబాన్ని స్వయంగా కల్పించేంత ప్రతిభావంతుడు కావాలి. అప్పుడే మనం ఇంగ్లీషుతో పోటీపడగలం. ఉదా :

| | |
|---|---|
| క్రియారూపం | బోధించు |
| నామవాచకరూపం | బోధన |
| విశేషణరూపం | బౌధనికం బోధన్యం (బోధనకు సంబంధించిన) |
| కర్తృ రూపం | బోధకుడు, బోధకి (బోధించేవారు) |
| కర్తృ విశేషణరూపం | బోధకీయం/ బోధకీనం/ బోధకేరం/ బౌధకికం = బోధకుడికి సంబంధించినది |
| కర్తృ సమూహం | బౌధక్యం = బోధకుల సమూహం |
| కర్మరూపం | బోధితం (బోధించబడిన సబ్జెక్టు) |
| ఉపకరణరూపం | బోధకం, బోధిత్రం, బోధని (బోధించే సాధనం) |
| కరణీయ రూపం | బోధనీయం, బోధితవ్యం, బోధ్యం, బోధనాస్పదం, బోధనారం, బోధనయోగ్యం (బోధించ దగినది) |
| శతృశానజ్ రూపం | బోధయత్, బోధయంతుడు (అలాగే జీవత్, జీవంతుడు మొ॥) |

17. తెలిసిన పదాల నుంచి కొత్త పదాల్ని నిష్పాదించడం సాధ్యం కానప్పుడూ, అలా నిష్పాదించినవి బాలేనప్పుడూ మన భాషాధ్వనికి అనుగుణంగా వినూత్న నామధాతువుల (brand new nominal roots) ని శూన్యంలోంచి సృష్టించాలి. అంటే అలాంటి పదాల విషయంలో మనం మానసికంగా ఆదిమకాలానికి మళ్ళాల్సి వస్తుంది.

**నూతన పదాల నిష్పాదనకి మాండలాల వితరణ**

వచ్చేసంచికలో....

(తరువాయి వచ్చే సంచికలో...)

భాషాశాస్త్రజ్ఞుల సంఘం

## భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడుగా

# ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

భారతీయభాషాశాస్త్రజ్ఞులసంఘ(లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఎల్.ఎస్.ఐ.) అధ్యక్షులుగా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆయన 2021 నుండి మూడేండ్లపాటు ఈ బాధ్యతలో ఉంటారు.



స్వాతంత్ర్యానికి పూర్వమే దేశభాషల వికాసమే లక్ష్యంగా 92 ఏళ్ల క్రితం అంటే 1928లో భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం (లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఎల్.ఎస్.ఐ.) లాహోర్‌లో జరిగిన ఐదవ ఒరియంటల్ కాన్ఫరెన్స్‌లో ఏర్పడింది. భారతీయ భాషాశాస్త్రాన్నీ భారతీయ భాషలనూ శాస్త్రీయంగా అధ్యయనం చేయడమే ఈ సంఘం యొక్క ముఖ్య లక్ష్యం. 1937లో ఈ సంఘాన్ని లాహోర్ నుండి కలకత్తాకు మార్చారు. ఆ తరువాత, 1945నుండి నడుస్తున్న ప్రఖ్యాత ఇండియన్ ఫిలలాజికల్ అసోసియేషన్‌ని 1955లో భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘంలో విలీనం చేశారు. ఆ తరువాత ఈ సంఘ కార్యాలయాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, డెక్కన్ కాలేజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ రిసెర్చ్ఇన్‌స్టిట్యూట్, పూణెకి తరలించారు. భారతదేశంలోనే కాక ఇతర దేశాలలో కూడా ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నటువంటి సంస్థ ఇది. ఈ సంఘం 'ఇండియన్ లింగ్విస్టిక్స్' అనే పేరుతో అంతర్జాతీయ పత్రికను ఒకదానిని ప్రతీ సంవత్సరం ప్రచురిస్తోంది. ఈ పత్రిక భారతీయ భాషలపై భాషాశాస్త్ర దృష్టితో జరిగే పరిశోధనలను ప్రచురిస్తుంది. ఇప్పటికి ఎనభై సంచికలు ప్రచురితమయ్యాయి. ప్రతీ సంవత్సరం ఈ సంస్థ ద్వారా భారతీయ భాషల వికాసం కోసం పరిశోధన, భాషాబోధన, సమాచార వినిమయం, భాషానువర్తనాలపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహిస్తోంది. ఈ సదస్సులలో భారతదేశం నుండే కాకుండా జపాన్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్సు, రష్యా మొదలగు దేశాలనుంచి సుప్రసిద్ధ భాషాశాస్త్రజ్ఞులు ఎందరో ఈ సదస్సులలో పాల్గొని భారతీయ భాషలపై పరిశోధనా పత్రాలను ప్రకటిస్తూ ఉంటారు.

ఈ సంఘం 42వ భారతీయ భాషాశాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సదస్సును 2020 డిసెంబర్ 10-12 తేదీల్లో జి.ఎల్.ఎ. విశ్వవిద్యాలయం, మథురలో నిర్వహించింది. ఈ సదస్సులో ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావును 2021-2023 కాలానికి సంఘ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

**భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షులు**

భారతీయభాషాశాస్త్రజ్ఞులసంఘ(ఎల్.ఎస్.ఐ.) అధ్యక్షుడుగా తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నిక కావటం 90 ఏండ్లలో ఇదే మొదటిసారి. వీరికి గడిచిన 35 సంవత్సరాలపాటు హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని అనువర్తిత భాషాశాస్త్రం-అనువాద అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, డీన్ (విద్యార్థి సంక్షేమ విభాగం)గా వివిధ పదవుల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. వీరు గతంలో ద్రావిడ భాషా శాస్త్రజ్ఞుల సంఘ అధ్యక్షులుగానూ, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగానూ ఉన్నారు. ఈయన భారత భాషాశాస్త్రజ్ఞుల సంఘం (ఎల్.ఎస్.ఐ.) అధ్యక్షులుగా ఎంపిక కావటం భారత దేశ భాషాశాస్త్రజ్ఞుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సుమారు వంద సంవత్సరాల క్రితం నెలకొల్పబడ్డ ఈ సంస్థ (ఎల్.ఎస్.ఐ) నేడు 130 కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి భాషల అభివృద్ధికి తోడ్పడుతున్న సంస్థ.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో రాబోయే సంవత్సరాలలో, మాతృభాషా మాధ్యమం, మాతృభాషా బోధన విధానాలు, భారతీయ భాషల అధ్యయనం, జాతీయ నూతన విద్యా విధానాన్ని అనుసరించి భారతీయ భాషల, ఆపన్న భాషల, అత్యాపన్న భాషల పరిరక్షణకు సంబంధించిన అంశాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించే దిశలో ఎల్.ఎస్.ఐ. పనిచేస్తుందని ఆచార్య గారపాటి పేర్కొన్నారు. అంతేకాకుండా సాహిత్య బోధకులకు, భాషా బోధకులకు భాషాశాస్త్రం పట్ల అవగాహన కల్పించడం, భాషాశాస్త్రజ్ఞులకు భాషాశాస్త్ర రంగంలో వస్తున్నటువంటి నవీన రంగాల గురించి, నవీన ఆవిష్కరణల గురించి తెలియ చేయడం కోసం వివిధ కేంద్రీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలలో భాషాశాస్త్ర శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేయనున్నట్టుగా ఆచార్య గారపాటి గారు తెలియచేశారు. ఆధునిక సమాచార వినిమయంలో విప్లవాత్మక మార్పులకు వీలుకలిగించేందుకు భారతీయ భాషలలో యంత్రానువాద వ్యవస్థల నిర్మాణానికి దిశా నిర్దేశం చేయటం ద్వారా భాషాశాస్త్ర రంగానికీ భాషల అభివృద్ధికీ అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని అభిప్రాయపడ్డారు.

భారతీయ భాషలు బతకాలన్నా, అత్యధిక జనాభా కలిగిన మన దేశ ప్రజలందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పన జరగాలన్నా మాతృభాషా మాధ్యమ బోధనతోనే సాధ్యమవుతుందంటున్నారు. అమ్మనుడిలో చదువుకోకపోతే సృజనాత్మకత కుంటుపడుతుందని పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో ప్రాథమిక దశలో మాతృభాషలోనే బోధనను మళ్లీ మొదలుపెట్టేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఉన్నత పాఠశాల వరకు అమ్మనుడిలో బోధన ఉండాలన్నదే భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయమని పేర్కొన్నారు. దేశంలో సుమారు 120 భాషలున్నాయనీ, ప్రతి భాషకూ వ్యాకరణ రచన చేసి పాఠ్యగ్రంథాలు రచించి భాషలన్నింటినీ బడి భాషలుగా చేయడమే

తమ ప్రధానకర్తవ్యమనీ తెలిపారు.

ఆంగ్లం కారణంగా భారతీయ భాషలకు ముప్పుందని గ్రహించి స్వాతంత్ర్యానికి పూర్వం 1928 లోనే ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేస్తూ, 'దేశంలో అల్పసంఖ్యాక, ఆపన్న, అంతరించే దశలో కొన్ని భాషలున్నాయి, వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం.' ఈ సంఘం ఆధునిక యుగంలో వచ్చిన, వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని భారతీయ భాషలకు యంత్రానువాద వ్యవస్థలను అభివృద్ధి చేస్తామని దానిద్వారా భాషాశాస్త్రాన్ని, భారతీయ భాషలను అభివృద్ధి చేయడానికి ఎక్కువ ప్రాధ్యానత ఇస్తామని ఆచార్య గారపాటి తెలియజేశారు. ప్రధాన భాషలకు సంగణక ఉపకరణాలు తయారు చేసి అంతర్జాలంలో విరివిగా వాడేలా చూస్తాం. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి భాషనూ జాతీయ భాషగా గుర్తించేలా కృషి చేస్తాం. అని ఆయన ఈ సందర్భంగా 'అమ్మనుడి'కి తెలియజేశారు.

**అడక:** భాషల యంత్రానువాద పద్ధతుల్లో ఇంకా చాలా సమస్యలు ఎదురువుతున్నాయి కదా?

**బదులు:** సమాచార మార్పిడిలో యంత్రానువాద పద్ధతులు మరింతగా రావాలి. ప్రస్తుతం కృత్రిమమేధను ఉపయోగించి చేస్తుండటంతో పని సులువవుతోంది. ఈ దశాబ్దం చివరికల్లా ప్రధాన భారతీయ భాషలకు యంత్రానువాద పద్ధతులు అందుబాటులోకి వస్తాయి.అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

**అడక:** పిల్లలు మాతృభాషకు దూరం అవుతున్నారు. దీన్ని ఎలా నివారిస్తారు?

**బదులు :** ఈ తరం పిల్లలకు మాతృ భాష వచ్చు కానీ చదవడం, రాయడంలో మెలకువలు రావడం లేదు. ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల కంటే నగరాల్లోని పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మన సాహిత్యం చదివితేనే మంచీ చెడూ తెలుస్తాయి. సామాజిక స్పృహ, దేశం పట్ల నిబద్ధత, సమాజం పట్లా బాధ్యత చిన్నప్పటినుంచే అలవడాలి.అందుకే ఉన్నత పాఠశాల వరకైనా మాతృభాషలోనే బోధన జరగాలి.

**అడక :** కొన్ని రాష్ట్రాలు ప్రాథమిక స్థాయిలోనే ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడుతున్నాయి కదా!

**బదులు :** అది కచ్చితంగా తప్పుడు నిర్ణయం. అలాంటివారికి భాషల గురించిఅవగాహన లేదనే చెప్పాలి. ఈ తరహా నిర్ణయాలు అమలుచేసే ముందు భాషాశాస్త్రవేత్తలూ, సామాజిక శాస్త్రజ్ఞులూ సాహితీవేత్తలూ మొదలైనవారితో చర్చించి వారి అభిప్రాయం తీసుకొనివుండాల్సింది. అలాంటివేమీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఎజెండాని అమలు చేయాలనే లక్ష్యంతో భాష గురించి ఆలోచించడం లేదు.

**భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘ అధ్యక్షులుగా ఆచార్య గారపాటి గారు మాతృభాషలని అభివృద్ధి పరిచి మరింత ముందుకు తీసుకెళతారని కోరుకుందాం. ఈ సందర్భంగా పలువురు భాషావేత్తల మెచ్చుకోళ్లను, ఆశలను, ఆకాంక్షలను ఇక్కడ ఇస్తున్నాం:**

**నేను** లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవికి శ్రీ ఉమామహేశ్వరరావు పేర తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఆపైన మద్దతు తెలిపాను. రావు అధికసంఖ్యాకులమద్దతుతో గెలిచారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఆయన ఒక మంచి పండితుడిగా, పరిశోధకుడిగా, నాయకుడిగా ఎదగడం నేను చూశాను. ఆయనకు పనిపట్ల ఉన్న నిబద్ధతను చూసి నేను ముగ్ధుడనయ్యాను. భిన్నత్వం లేక వైవిధ్యం తగ్గుముఖం పడుతున్న సమయంలో మరియు భాషా అధ్యయనాలు స్వప్రయోజనాలకు పరిమితమవుతున్న సమయంలో, నేను ప్రాంతీయమైన మరియు ప్రాదేశికమైన భావాలను అధిగమించి ఎదగగల నాయకుడూ అతని బృందం అవసరమని అనుకున్నాను. భారతీయభాషాశాస్త్రజ్ఞుల సంఘాన్ని భాషాశాస్త్ర రంగంలో అత్యున్నత ప్రభుత్వేతర సంస్థగా నిర్మించాల్సిన సమయం ఇది అని నా అభిప్రాయం. డాక్టర్ జి. ఉమమహేశ్వరరావు దేశంలో భాషాశాస్త్రం యొక్క పునరుద్ధరణకు మంచి నాయకుడిగా ఉంటారనీ దాని వైవిధ్యం కోసం, ఐక్యత కోసం కృషి చేస్తారనీ నేను ఆశిస్తున్నాను

– పద్మశ్రీ ఆచార్య దేవీ ప్రసన్న పట్టనాయక్, పి.హెచ్.డి.డి.లిట్.(కార్నెల్)
ఫౌండర్ డైరెక్టర్, భారతీయ భాషాకేంద్రం, మైసూరు,
ఛాన్సెలర్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం

**త**లపెట్టిన పనిని సాధిస్తాడు, విద్యారంగంలో అనేక ప్రణాళికలను పట్టుకొని చేపట్టి, వాటి అన్నింటికీ ఫలితాలు తీసుకువచ్చారు. ముఖ్యంగా సహజ భాషా సంగణక ప్రక్రియలూ (నాచురల్ల్యాంగ్వేజ్ ప్రోసెసింగ్, ఎన్.ఎల్.పి.), తెలుగు, హిందీ, తమిళ భాషల మధ్య యంత్రానువాద వ్యవస్థలను అభివృద్ధి చేయడం, భారతీయ భాషలకు పదాంశాత్మక ఉపకరణాలను తయారు చేయడం మొదలైనవి. ఇంత విస్తృత స్థాయిలో పరిశోధనలు చేసినవారు భారతదేశంలో ఎవరూ లేరు. చారిత్రక భాషాశాస్త్రంలో శిక్షణపొందినా, ఇలా ఆధునిక రంగమైన కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ రంగంలో విశేష కృషి చేయడం చాలా గొప్ప విషయం. అభినందనీయం. ఆయన ఏ రంగంలోఅడుగుపెట్టినా అక్కడఅభివృద్ధికి కృషిచేస్తారు.

–ఆచార్య కె.వి.సుబ్బారావు, విశ్రాంత ఆచార్యులు,
భాషాశాస్త్ర విభాగం, ఢిల్లీ విశ్వవిద్యాలయం

**ఏ** పనైనా సరే సాధించాలనుకుంటే దానికి మూడు విషయాలు అవసరం. ఒకటి అవగాహన, రెండు తోడ్పాటు, మూడు పట్టుదల. ఈ మూడు ఉమామహేశ్వరరావుకి ఉన్నాయి. ఆయనకు అండ ఉంది. పునాది భాషకు ప్రజల యొక్క బుద్ధి పెంపుదలకు ఉన్న సంబంధం చాలా చక్కగా తెలుసు. అందుకే పునాదిభాషే బడిభాషై ఉండాలి, అదే సంస్కారం నేర్పించే భాషై ఉండాలన్నది ఆయన అభిప్రాయం. ఇది చాలా సరైనది కనుక ఆయన తన పదవి సమయంలో అవసరమైన మద్దతు తీసుకొని మంచి ఫలితాలని సాధిస్తాడని ఆశిద్దాం.

– ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం, విశ్రాంత ఆచార్యులు
ఇంగ్లీషు,విదేశీభాషల విశ్వవిద్యాలయం, హైదరాబాదు

**నేను** 1969 నుండి ఎల్.ఎస్.ఐ.లో మెంబర్‌గా ఉన్నాను. నాకు ఈ సంఘంతో దాదాపు 50 యేళ్ళ అనుభవం ఉంది. ఈ యాభై సంవత్సరాల్లో అధ్యక్ష హోదాలో కూర్చున్నవాళ్లు భాషకోసం చేసినది,పెద్దగా చెప్పుకోదగ్గదేమీ లేదు. వాళ్లు ఏదో వచ్చారు, అధ్యక్షులుగా ఎన్నికయ్యారు, ఉన్న మూడు సంవత్సరాల్లో భాష గురించి, భాష ఔన్నత్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చారు, సర్దుకొని వెళ్లిపోయారు. అంతే తప్ప అంతకంటే ఎక్కువ చేసిందేమీ లేదని

**తరువాయి 36 వ పుటలో.......**

ధారావాహిక

## అడుగుజాడలూ ఆనవాళ్లు-5

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

# నా దుర్గి - ఒప్పిచర్ల యాత్ర

**మ**ర్నాడు యాత్రలో భాగంగా, ఒకనాటి రాత్రి గుంటూరు జిల్లాలో మండలకేంద్రమైన దుర్గికి చేరుకున్నాను. అక్కడ, నాగార్జున శిల్పశాల స్థాపకులు చెన్నుపాటి సీతారామయ్యగారింట్లో ఉందామనుకొన్నాను. అంతలోనే, కొల్లిపర మండలం మున్నంగికి చెందిన జగన్నాధంగారు కనిపించి వాళ్లింటికి తీసుకెళ్లారు. దాదాపు 70ఏళ్లనాటి ఇల్లు. లోపల నాపరాతి గచ్చు.కొయ్యస్థంభాలు, దూలాలు, దంతెలు, పైన నాపరాతి పరుపు, దానిపైన చవుడు మట్టికప్పు. పక్కనే వసారా, బావి, వంటగది, స్నానాలగది. తాను ఎప్పట్నించో సేకరించి భద్రంగా దాచుకున్న సానరాళ్లు, నూరుడురాళ్లు, రకరకాల పూసలు, మట్టిబొమ్మలు. పురాతన వస్తువులపట్ల ఆయనకు మక్కువ ఎక్కువ అనిపించింది. ఉట్టిమీదనుంచి చట్టిలోఉన్న గేదెపాల పెరుగు చిలికి, దంచిన జీలకర్ర, అల్లం కలిపి కొంత కొత్తిమీర, ఉప్పువేసిన మజ్జిగ ఇచ్చాడు. ప్రయాణంలో అలసిన నాకు ఉల్లాసాన్నిచ్చాడు. మాటామంతీ తరువాత, రేపు ఉదయం నేను దుర్గి, ఒప్పిచర్ల చూడాలనుకొన్న సంగతి చెప్పాను. నేనొచ్చానన్న ఆరాటంతో, జగన్నాధంగారు, నాటుకందిపప్పును శుభ్రంచేసి, బచ్చలకూర, పొన్నగంటికూర, తోటకూర కాడలు కలిపి, కొంచెం చింతపండు, జతచేసి కలగూరపప్పు, దోసకాయ-వంకాయ, పచ్చిమిరప కాయల పచ్చడి, మిరియాలు, మెంతులు, శొంఠి, ధనియాలు, జీలకర్ర బాగా దంచి, మరిగినదాకా కాచిన రసం, సొరకాయ దప్పళం(పులుసు), పచ్చిమిర్చి, అల్లంముక్కలు, కొత్తిమీర, కరివేపాకు, ఇంచుక పసుపు కలిపిన మజ్జిగచారు, ముంత తిరగేసినా ఏమాత్రం కిందకు జారని గట్టిపెరుగు, పెరుగులోకి కరకరలాడే మినప, గుమ్మడి వడియాలు, వంకాయ, దోసకాయ వరుగు సిద్ధంచేస్తుంటే, నేను తినబోయే ముద్ద, ముద్దా, సిద్ధమకరధ్వజమేననిపించింది. ఇవేవీ చాలవన్నట్లు, మునగాకు, పెసరబద్దలకూర, గోరుచిక్కుడు వేపుడు, చిలగడదుంప-వంకాయ పులుసు, గోంగూర-శనగపప్పుకూర, టమోటాగొజ్జు, మినపనూక, కందినూక పచ్చడి, ముందుగా ఆరగించటానికి సగ్గుబియ్యం సన్నసేమ్యాలు, బాగా సన్నబియ్యంతో యాలకులు, జీడిపప్పు కలగలుపు పాయసం, ఒకటేమిటి ఎన్నిరకాలో, పల్నాడులో సరైన భోజనం దొరక్క జొన్నపిసరు తిన్న శ్రీనాథుడు, ఈఇంట ప్రత్యక్షమైతే ఎంతబాగుండో అనిపించింది. అన్నీ ఆరగించటానికి అరగంట పట్టింది. ఔషధ సమన్విత ఆహారం అబ్బురపరచింది. మతిమరుపు మళ్లీ తిరిగొచ్చినట్లనిపించింది. జగన్నాధంగారికి ధన్యవాదాలు చెప్పి, రేపటి మా వారసత్వ స్థలాల యాత్ర గురించి ముచ్చటిస్తుంటే, అందించిన కప్పురవిడియం, మెల్లగా జోకొట్టి నిద్రబుచ్చింది. అదీ జగన్నాధంగారి ఆతిధ్య చిక్కదనం.

మరుసటి రోజు ఉదయాన్నే బయలుదేరి దుర్గి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పాటిమట్టి పొలంలో నేనూ, జగన్నాధంగారు, చెన్నుపాటి సీతారామయ్యగారి అబ్బాయి, శిల్పి చెన్నుపాటి శ్రీనివాసాచారి(శ్రీను) కలసి తిరుగుతున్నాం. ఎందుకంటే అది పురాతన స్థావరమని అక్కడ రకరకాల పూసలు, ఇటుకరాతి ముక్కలు, ఎర్రగా మెరిసే కుండపెంకులు, చూచానని జగన్నాధంగారు చెప్పారు. అది ఖచ్చితంగా శాతవాహన స్థావరమై ఉంటుందన్న నా నమ్మకం నిజమైంది. ఆ పొలంలోనేకాదు, చుట్టుపక్కల దాదాపు వంద ఎకరాల్లో చారిత్రక ఆనవాళ్లున్నాయి. జగన్నాధంగారికి ఉన్నట్టుండి బాగా ఎర్రగా, నగిషీగా ఉన్న చిన్న కుండ దొరికి, నన్ను రమ్మని పిలిచారు. అటు వెళుతూవెళుతూ నేలంతా కళ్లు చేసుకొని చూస్తున్న నాకు ఒక బలపపురాయి శిల్పం దొరికింది. పాటిమట్టిలో ఉన్న ఆ బొమ్మను తీసిచూశాను. ఆశ్చర్యం! అది శివుని మహేశమూర్తిబొమ్మ. వక్ష స్థలంవరకే ఉంది. జటాజూటం, వృత్తకుండలం, ముఖకవళికలు పరిశీలించిన తరువాత ఇక్ష్వాకుల అనంతరకాలాని(క్రీ.శ.4వ శతాబ్ది)కి చెందిందని జగన్నాధంగారికి చెబితే, ఆయన కళ్లు పత్తికాయల్లా



వెలిగిపోయాయి. ఆ బొమ్మకు అనేకసార్లు నమస్కరించుకున్నాడు. ఈబొమ్మ దొరకటంద్వారా దుర్గి చరిత్ర ఒక్కసారిగా, శాతవాహన, ఇక్ష్వాకు, ఆనందగొత్రినుల కాలానికి పోయింది. రెండువేల ఏళ్లు!

దుర్గిలో ఉన్న దుర్గమ్మ, శివ వీరభద్ర, గోపీనాధాలయాలను చూడటానికి కాలినడకన వెళ్లాం. ఎప్పుడో13వ శతాబ్దిలో కాకతీయ గణపతిదేవుడు అధికారి, ఆవూళ్లో కోట కట్టేముందు 'దుర్గ'కు గుడి కట్టటాన ఆ వూరికి దుర్గి అనేపేరొచ్చిందని, క్రమంగా అదే పేరు స్థిరపడిందని స్థానికులంటారు. ముందుగా దుర్గ దేవాలయానికి వెళ్లాం. ఎత్తైన దిబ్బ. చుట్టూ చెల్లాచెదురుగా పడిఉన్న మండప స్థంభాలు, ఆలయ విడి భాగాలు, శాసనాల శకలాలు. మెట్లెక్కి పైన చూస్తే, గుడినుంచి విడివడిన ద్వారశాఖలు, దూలాలు, కప్పురాళ్లు,

కాకతీయ శిల్పకళ ఉట్టి పడుతున్న వీరభద్ర, నరసింహ, సూర్య, చెన్నకేశవ, గణేశ, రతీమన్మథ,నాగరాజు శిల్పాలు ఒకనాటి దుర్గి వైభవ ప్రాభవాలకు సాక్షీభూతాలు. ఉత్సవాలకు పులిమిన రసాయన రంగులు శిల్పాల ప్రాచీనతను తుడిపేశాయి. పూజారిని బతిమిలాడి, అనవసర అలంకారాలు, వస్త్రాలను అమ్మవారి ఒంటిమీదనుంచి తీయించి, అసలు స్వరూపం చూశాం. దుర్గ–మహిషమర్ధిని ఎంత అందంగా ఉంది. క్రీ.శ. 10వ శతాబ్ది ప్రతిమా లక్షణంతో అలరారుతుంది. అప్పుడు తెలిసింది, ఈ విగ్రహాన్ని గణపతిదేవుని అధికారి ప్రతిష్ఠించలేదని, అంతకుముందు మూడు శతాబ్దాల క్రితమే అక్కడ ఉందని. ఒకప్పుడు, ప్రసిద్ధిగాంచి, ఆవూరికి ఒక పేరునిచ్చిన దుర్గమ్మ ఆలయం, ఆలనా పాలనా లేక చిక్కి శల్యమైనా శిథిల సౌందర్యం మాత్రం తొణికిసలాడుతూనే ఉంది.

దుర్గి వంకేశ్వరస్వామి దేవాలయంలోఉన్న క్రీ.శ.1251 నాటి కాకతీయగణపతిదేవుని కొలువులో ఉన్న గండపెందేర గంగయ్యసాహిణి శాసనాన్ని చేత్తో తాకి చరిత్రను వంటబట్టించుకొన్నాను. 116 పంక్తుల ఈ





శాసనంలో మొదటి 52 పంక్తులు, చివరి 10 పంక్తులు సంస్కృతంలోనూ, మిగతాది తెలుగులోనూ ఉంది. 'ఇందులో ఏముందో చెబుతారా నాయనా' అని జగన్నాథంగారు అడిగారు. శాసనాన్ని చదువుతుంటే, నాదగ్గర ఏదో బ్రహ్మజ్ఞానమున్నట్లు ఆయన ఫీలై నావంక, ఆ శాసనం వంక చూస్తూనే ఉన్నారు. ఇంతకీ ఆ శాసనంలో ఏముందంటే..........కాకతీయ గణపతిదేవుని పాదపద్మోపజీవి గండపెండార గంగయ్య సాహిణి, పానుగల్లు(నల్లగొండజిల్లా)నుంచి, (కడపజిల్లా) మార్జవాడిదాకా రాజ్యంచేస్తూండగా, ఆయన మాండలిక సచివుడైన శ్రీకరణఅధిపతి, కాయస్థకులానికి చెందిన నామయ దుగ్య(దుర్గి) పట్టణంలో, తమతండ్రి వాయి పండితుల పేర వంకేశ్వరదేవరను ప్రతిష్ఠచేసి, కృష్ణాతీరంలోని నాగార్జునికోట(ఈ శాసనమే నాగార్జునికోటను తొలిసారిగా ప్రస్తావించటం గమనార్హం) తూర్పునున్న నెయ్యూరును, ఇదే దేవాలయంలో నాగేశ్వర, పాగేశ్వరదేవాలయాలకు, ఆలయం కట్టిన శిల్పి కాడొజుకు భూమిని దానం చేసిన వివరాలున్నాయి. ఇదే ఆలయంలోనున్న క్రీ.శ.1297లో ప్రతాపరుద్రుని అధికారి, స్థానిక పాలకుడైన గొంగుల పోచినాయుడు వంకేశ్వరదేవునికి భూమిని దానం చేసిన శాసనముంది. ఇక్కడే ఉన్న క్రీ.శ.1518, నవంబరు,22 నాటి శ్రీకృష్ణదేవరాయని శాసనంలో ఆయన అధికారి పెదసింగమనాయకుడు, వంకేశ్వర, వీరేశ్వర(వీరభద్ర) ఆలయ అంగరంగభోగాలకు, గుండాలలోని మెట్ట, మాగాణి భూముల్ని దానం చేసిన వివరాలున్నాయి. ఈ శాసనాన్ని ఆలయ ధ్వజస్థంభపీఠంలో బిగించటాన సగం శాసనం పూడుకుపోయింది. సరిగ్గా ఇదే శాసనాన్ని పరిశీలిస్తున్నపుడు, ఆం.ప్ర.మాజీ ఉపసభాపతి, మండలి బుద్ధప్రసాద్‌గారు ఆలయంలోకొచ్చారు. నాగాయలంకలో ప్రతిష్ఠించటం కోసం కృష్ణవేణీ మాత విగ్రహాన్ని చేయిద్దామని, ఆయన దుర్గి వచ్చి, కృష్ణదేవరాయ శాసనాన్ని సందర్శించటం, అనుకోని సంఘటన!

తరువాత వేణుగోపాల (గోపీనాథ్) ఆలయాన్ని, అక్కడున్న క్రీ.శ.1269 నాటి శాసనాన్ని చూశాం. గమ్మత్తేమిటంటే, ఈ శాసనంలో కాకతీయగణపతిదేవ మహారాజుల(పట్టో)ద్ధతియైన శ్రీరుద్రమహాదేవి అని పేర్కొనబడటం శాసన పరిశోధకుల దృష్టినాకర్షించింది. రుద్రమదేవి గణపతిదేవుని కుమార్తె. ఇందులో పట్టపురాణిగా పేర్కొనటం బహుశ శాసన రచయిత, లేక చెక్కిన శిల్పి తప్పుగా భావించాలేతప్ప, మరోటి కాదని బుద్ధప్రసాద్‌గారికి, జగన్నాథంగారికి, చెన్నుపాటి శీనుకు విడమరచి చెప్పాను. ఈ శాసనంలో ఆనాడు, ఆలయాల్లో ఉన్న అనేకరకాల ఉద్యోగుల వివరాలున్నాయి. ఇదే ఆలయంలోనున్న క్రీ.శ.1297 నాటి శాసనంలో గొంగుల పోలినాఇండు, గోపీనాథుని అంగరంగ భోగాలకు అడిగప్పల (ఇప్పుడు ఈవూరిని అడిగొప్పుల అని పిలుస్తున్నారు) వైపుగల పొలాన్ని దానంచేసిన వివరాలున్నాయి. ఆనాడు ఆలయాలకు అత్యంత భక్తి శ్రద్ధలతో అర్చన, ఉత్సవాల నిర్వహణకు భూముల్ని దానం చేయగా, దేవుని భూముల్ని చౌకగా అతి తక్కువ కౌలుకు



ఒప్పిచర్ల ఒకటి. ఎప్పుడో, ఎక్కడివాడో, బ్రిటీషు అధికారి రాబర్ట్ సివెల్ 1872 లో పల్నాడులో కలియదిరిగి ఊరూరాఉన్న చారిత్రక స్థలాలు, కట్టడాలు, శిల్పాలు, శాసనాలను సందర్శించి "లిస్ట్ ఆఫ్ ది యాంటిక్వేరియన్ రిమైన్స్ ఇన్ ది ప్రెసిడెన్సీ ఆఫ్ మద్రాస్, వా.1అనుబంధం18వ పేజీలో ఒప్పిచర్ల గురించి ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేసుకొంటూ, మన వారసత్వ సంపదపట్ల ఆయనకున్న శ్రద్ధకు చేతులెత్తి మొక్కుకున్నా. నేనే కాదు ఆంధ్రులంతా కూడా ఆయనకు మొక్కాలి.

ఒప్పిచర్ల(వొప్పిచెర్ల) అనగానే దొనకొండ మల్లయ్య గుర్తుకొస్తాడు. గ్రామానికి 4 కి.మీ.దూరంలో నల్లమల సానువుల్లో భాగమైన కొండపైన శివుడు మల్లయ్యగా అవతరించాడని (స్వయంభువు), కొండమీద నీటిదొనలుండటాన, దొనకొండ మల్లయ్యగా పిలువబడి, ఆ తరువాత ధనకొండ మల్లయ్య, ధన మల్లయ్యగా స్థిరపడిపోయాడు. స్వామివారు స్వయంగా అవతరించారని పూజారితోపాటు గ్రామస్తులుకూడ నమ్ముతున్నారు. నిజానికి, శివలింగమైనా, శిలా శిల్పమైనా శిల్పిచెక్కి ప్రతిష్ఠించిందేగానీ, దానంతట అది పుట్టిందనుకోవటం మూఢనమ్మకమే.

ఈ ధనమల్లయ్యను దర్శించుకొన్న నాయకురాలు నాగమ్మ క్రీ.శ.1180 ప్రాంతంలో ఆరుబయలు ఉన్న స్వామికి దేవాలయం కట్టించిందని కూడ ఒక కథ ప్రచారంలో ఉంది. ఒకప్పుడు ధనకొండ కింద ఉన్న ఊరు, పల్నాటియుద్ధం తరువాత, కాకతీయుల కాలంలో, ప్రస్తుత గ్రామమున్న చోటుకు మారింది. బావి దగ్గరకెళ్లి చూశాను. ఆ బావి నిండా చెత్తాచెదారం నిండి, చారిత్రక ఆనవాళ్లు కనిపించటంలేదు. ఆ బావి పక్కనే పశువుల దొడ్డిలో క్రీ.శ.1299 నాటి కాకతీయ ప్రతాపరుద్రుని అధికారి, మహారాయ గజసాహిణి గుండయనాయకుని శాసనముంది. పల్నాటి నాపరాతిపై చెక్కిన శాసనాక్షరాలు బాగా అరిగిపోయాయి. పరిశీలించిచూస్తే గుండయనాయకుడు, పల్నాడులోని గురిందాల (గురిజాల) - పింగలి స్థలాలను పాలిస్తున్నప్పుడు, వప్పిచెఱ్ల (ఒప్పిచర్ల) ప్రజలకు, గోవులకు తాగునీటికోసం, గాడినూతిని తవ్వించి, గాడిని చేసిన కప్పెరసూయ భక్తుని కొడుకు అన్నయభక్తుడు 3తూముల భూమిని కొలిచి యివ్వగా, ఈ బావి తవ్వటానికి కోమటి తాతయసెట్టి, గొవెరిసెట్టి, మేదినిసెట్టి, రుద్రసెట్టి చెవ్వయలు సహకరించిన వివరాలున్నాయి. ఈ శాసనం బాగా పాతుకుపోయింది. ఇప్పటికి 721 సం॥ల చరిత్రను కన్నతల్లి కడుపులో బిడ్డలా ఈ శాసనం కాపాడుతుంది. మరి అలాంటి శాసనం నిర్లక్ష్యానికి గురై పశువుల సాహచర్యం చేస్తున్న ఈ శాసన ప్రాముఖ్యతను, ఆస్థలం యజమానికి వివరించి దాన్ని భద్రంగా చూచుకోమని చెప్పడం కంటే నేనేమీ చేయలేకపోయాను.



రాబర్ట్ సెవెల్ తన నివేదికలో ప్రస్తావించిన ఆర్కియోలజీ సర్వే ఆఫ్ సదరన్ ఇండియా (మద్రాసు) వారు 1909 లో నకలు తీసిన మరో శాసనంకూడా ఈ దేవతల బావి దగ్గరే ఉందని చెప్పాడు. చుట్టుపక్కల ఎంత గాలించినా కనిపించకపోవటం, నాకు బాధ అనిపించింది. నిర్లక్ష్యం వల్ల ఇలాంటి చారిత్రక ఆనవాళ్లను ఎన్నింటిని పోగొట్టుకొంటున్నామోననిపించింది. చేసేదిలేక దక్షిణ భారత శాసన సంపుటి- 10, పే. 269లో ఉన్న ఈ శాసన పాఠాన్ని పరిశీలిస్తే, ఈ శాసనంలో కాకతీయ ప్రతాపరుద్రుని గజసాహిణింగారు, గురిందాల-పింగలి

తీసుకోవటం, ఈ నాటి నీతికి అద్దంపడుతుంది. దుర్గిలో అన్ని ఆలయాలను, శాసనాలు, శిల్పాలను చూచినతరువాత, బుద్ధప్రసాద్‌గారితో కలసి నాగార్జున శిల్పశాలను సందర్శించాం. కృష్ణవేణిమాత విగ్రహంగురించి మాట్లాడుకొన్న తరువాత బుద్ధప్రసాద్‌గారు దివిసీమకు తిరుగుప్రయాణమైనారు.

నేను మాత్రం ఒప్పిచర్లలోని దేవతలబావిని చూడాలని శ్రీనుతో కలసివెళ్లా. మళ్లీ పల్నాటివీరచరిత్ర గుర్తుకొచ్చింది. కార్యమపూడి యుద్ధరంగంలో పాల్గొనటానికి వచ్చిన నలగాముని సైన్యం విడిదిచేసిన గ్రామాల్లో

స్థలాలను పాలిస్తుండగా క్రీ.శ.1311 లో గుండయసాహిణి, మారయ సాహిణిగార్లకు పుణ్యంగా (బహుశ స్థానిక దేవాలయానికి) రేగడు భూమిని దానం చేసిన వివరాలున్నాయి. కాకతీయ గజసాహిణులు, ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నట్లు గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుల దుర్గి ఒప్పిచర్ల శాసనాల వల్ల ఈ ప్రాంతం గజసాహిణ్యుల పుట్టిల్లుగా తెలుస్తుంది.

ఇంకా ఈ ఊళ్లో ఏమైనా చారిత్రక ఆనవాళ్లున్నాయా అని విచారిస్తే, అక్కడున్న చిన్నపిల్లలు, కంపల్లో ఆంజనేయుని విగ్రహం, చిన్నగుళ్లో వీరుని విగ్రహం, దుర్గమ్మ విగ్రహాలున్నాయని, వాళ్లే, ముళ్లుగుచ్చుకొంటున్నా లెక్క చేయకుండా రెండు ఫర్లాంగుల దూరంలో రాతి గుట్టలో ఇరుక్కుపోయిన నిలువెత్తు ఆంజనేయుని విగ్రహం దగ్గరకు తీసుకెళ్లారు. ప్రతిమా లక్షణం, శైలినిబట్టి, విజయనగర కాలానికి (క్రీ.శ. 16వశతాబ్ది) చెందిందని తెలుస్తుంది. విగ్రహంచుట్టూ నాగజెముడు, సర్కారు కంప అల్లుకొనిఉంది. బతిమిలాడితే పిల్లలు ఒక గొడ్డలి తెచ్చారు. అరగంటలో కంపను తొలగించి, అపురూప ఆంజనేయుని విగ్రహాన్ని ముళ్లకంప చెరనుండి విముక్తి కలిగించినందుకు ఆనందమేసింది. పెద్దవాళ్లకంటే అమాయకులైన మీరే మేలని, పిల్లల్ని భుజం తట్టి, మళ్లీ, రోడ్డుమీదకొచ్చి, దుర్గి చేరుకొన్నాం. జగన్నాధంగారి పంచన, మంచంపై కొంచెంసేపు నడుము వాల్చి, ఆయన చేసిపెట్టిన ఔషధ భరిత ఆకుకూరల ఉప్మా తిని, సువాసనలు వెదజల్లుతున్న వేడివేడి కషాయం తాగి, శెలవుతీసుకొని, తిరుగు ప్రయాణమైనాను. ఒకప్పుడు సమత, మమతలు పల్లవించిన, పల్లవులను మనకందించిన, పౌరుషానికి పురుడుపోసిన, అణువణువూ నాగరికతను నింపుకున్న పల్నాడు చారిత్రక ఆనవాళ్లు నిలువెత్తు నిర్లక్ష్యానికి గురవటం నన్ను ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. ఎప్పుడో ఎవరో ఒకరు, వీటిని ఉద్ధరిస్తారన్న కొన ఊపిరి ఆశ, నన్ను ఊరడించటానికి ప్రయత్నిస్తుంది.

**32 వ పుట తరువాయి.......**

## భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడుగా......

చెప్పడానికి నేను బాధపడుతున్నాను. ఉస్మానియా పూర్వ విద్యార్థిగా ఉమామహేశ్వరరావు ఒక నిర్దిష్ట లక్ష్యంతో ఈ పదవిలోకి ప్రవేశిస్తున్నారు. ఆయన చేయాల్సిందేమిటంటే, మాతృభాషల్లో విద్యాభ్యాసన జరగాలి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ప్రతి ఒకరు ఇది చెబుతున్నమాటే. కానీ ఎవరూ ఆచరణలో పెట్టలేదు. ఈయన చేయాల్సిందేమిటంటే విద్య అనేది రాష్ట్రాలకు సంబంధించినదిగా పరిగణిస్తున్నారు. రాజ్యాంగంలో మార్పు ఎక్కడ చేయాలంటే ప్రాథమికవిద్య రాష్ట్రాల పరిధిల్లో నుంచి తప్పించి కేంద్రం పరిధిలోకి తీసుకెళ్లాలి. కేంద్రమే ఒక ఆర్డినెన్స్ ద్వారా ప్రాథమిక విద్యాభ్యాసన అనేది కేవలం మాతృభాషలోనే జరగాలి అని ఒక చట్టాన్ని తీసుకురావాలి. ఆ పని చేయడానికి ఉమామహేశ్వరరావే సమర్థుడు. అతను ఆ లక్ష్యం పెట్టుకొని ఉన్నాడు కాబట్టి... ప్రాథమిక విద్యాభ్యాసన పూర్తైన తరువాత ఇంకే భాషలోనైనా విద్యాభ్యాసం కొనసాగించవచ్చు.కానీ మొట్టమొదటి బీజం మాత్రం మాతృభాషలో పడాలి. దీనికి జనం ఏమంటారంటే మీరందరూ ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకొని మంచి ఉద్యోగాలు చేస్తున్నారు కానీ మా మీద ఇది బలవంతంగా రుద్దుతారా? అనే ప్రమాదం ఉంది. దానికి నా సమాధానం నేను తప్పు చేశానని నీవు తప్పు చేయాలని చెప్పట్లేదు కదా. ఒక తప్పును ఒప్పు చేయడానికి ఎవరో ఒకరు నడుంకట్టాలి. మనం మొదలుపెడదాం. ఒక వ్యక్తి జీవితంలో యాభై సంవత్సరాలంటే అది చాలా కాలం. స్వాతంత్ర్యం వచ్చి డేబ్బై ఏళ్ళు అయింది. కానీ పరిస్థితుల్లో మాత్రం ఏమీ మార్పు రాలేదు.కావాలంటే ఇప్పుడే మార్చుదాం. రాబోయే 700ఏండ్లుఅది నిలబడిపోతుంది. దానికి ఆయన నడుంకట్టుకొని పని చేయాలి. ఆయనకి అందరం సహాయం చేద్దాం.

– ఆచార్య జె.వెంకటేశ్వరశాస్త్రి, విశ్రాంత ఆచార్యులు
భాషశాస్త్రశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

**భాషా** శాస్త్రజ్ఞుల సంఘం (LSI) అధ్యక్షులుగా ఆచార్య ఉమామహేశ్వరావు ఎంపిక కావటం ఎంతో ముదావహం. దక్షిణ భారత భాషావేత్తలు ఎవరికీ ఇంతవరకూ దక్కని ఈ గౌరవం మొదటిసారి ఆయనకే కాక అందరికీ దక్కిన గౌరవంగా భావించాలి. ఆయన స్థిరచిత్తుడు కాబట్టి కొంతకాలంగా సంకల్పించి కొనసాగిస్తున్న దేశభాషలలో విద్య అందరికీ అందేలా కృషి చేసి విజయం సాధించగలరు అని భావిస్తూ, ఈ దేశంలోని ఆదివాసీ గిరిజన భాషల అభివృద్ధి కోసం కూడా ఆయన కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ఈ సందర్భంగా వారికి నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూన్నా.

– ఆచార్య ఎ. ఉషాదేవి, విశ్రాంత ఆచార్యులు
భాషాభివృద్ధి పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం

జి. ప్రవీణ్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం,
వారణాసి, 8179407778.



"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు.
మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే
ఆ తర్వాతనే హిందీ భాష.
నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం"
"మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను
నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం
ఏ దేశానికీ లేదు"

– మహాత్మాగాంధీ

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# ఒక కథ - యెన్నో ప్రశ్నలు

అనగనగా వొక ద్వీపకల్పముండేది. దానికి మూడువైపులా సముద్రమూ, వోవైపు మాత్రమే నేలా యెల్లలూ వుండేవి. ఆ నేలవున్న వైపున పెద్ద పర్వతాల వరస సరిహద్దులా వుండడంతో అది మిగిలిన భూఖండంతో పెద్ద సంబంధమేమీ లేకుండా దాదాపుగా ద్వీపంలాగే వుండేది. దానికి కొన్నివేల సంవత్సరాల సంస్కృతీ, నాగరికతా, చరిత్రా వుండేవి. రెండు మూడు శతాబ్దాలక్రితం ఆ ద్వీపకల్పంలో అరవైకిపైగా చిన్న చిన్న రాజ్యాలుండేవి. అవి యెప్పుడూ వొకటితోనొకటి కొట్టుకుంటూ వుండేవి. చాలా దూరం నుంచీ వ్యాపారం కోసమని ఆ ద్వీపకల్పానికొచ్చిన విదేశీరాజ్యం వాళ్లు ఆ రాజ్యాల మధ్యవుండే వైరాలను ఆసరాచేసుకొని, ఆరాజ్యాధిపతులనంతా వోడించి, క్రమంగా ఆ ద్వీపకల్పానికంతా వాళ్లే రాజులైపోయారు. వొక విదేశీ ప్రభువు వచ్చి తమను పీడించడం మొదలు పెట్టాకగానీ ఆ ద్వీపకల్పంలోని ప్రజలంతా వొకటిగా కలవలేకపోయారు. కలిశాక ఆ దేశ ప్రభువుపైన తిరుగుబాటుచేసి, హింసామార్గంలో కొందరూ, అహింసామార్గంలో యింకొందరూ పోరాటం చేశారు. విదేశీగడ్డపైన అధికారాన్ని చెలాయించడం చాలా కష్టమని తెలుసుకున్న ఆ విదేశీ ప్రభువులు, యీ యాతననుంచీ తప్పించుకోవడం కోసమని, ఆ ద్వీపపల్పానికి స్వాతంత్ర్యాన్ని వుదారంగా యిస్తున్నట్లుగా వేషం వేసుకొని పారిపోయారు. పోతూపోతూ మతమనే గొడవల్ని సాకుగా చూపెట్టి ఆ ద్వీపకల్పాన్ని రెండు రాజ్యాలుగా తునాతునకలు చేసిపోయారు.

విదేశీ ప్రభువులు వెళ్లిపోయాక ఆ ద్వీపకల్పంలోని పెద్దరాజ్యమూ, చిన్నరాజ్యమూ తమతమ ప్రభుత్వాల్ని తయారు చేసుకున్నాయి. రెండు రాజ్యాలుగా మారినా తమకున్న సాంస్కృతిక వారసత్వమొకటేనని గుర్తించాక అవిరెండూ యిచ్చిపుచ్చుకునే మంచి సంప్రదాయాన్ని పాటిస్తూ యెవరికివాళ్లు పక్కవాళ్లను యిబ్బంది పెట్టకుండా, తమతమ బాగోగుల్ని మాత్రం పట్టించుకుంటూ బతకడం మొదలుపెట్టాయి. ఆ పెద్ద రాజ్యానికి పర్వతాలకవతలున్న మరో పెద్దరాజ్యం గూడా స్నేహంగావుంటూ, యివతలి వాళ్ల పనుల్లోకి అనవసరమైన చొరబాలును రానివ్వకుండా తమవైన పనుల్లోనే నిమగ్నమై పోయింది.

ద్వీపకల్పంలోని పెద్ద రాజ్యం స్వాతంత్ర్యం తర్వాత పరిపాలనా సౌకర్యం కోసం దేశాన్ని మొత్తం యిరవై రాష్ట్రాలుగా విభజించుకుంది. అయినా యే రాష్ట్రంలోని ప్రజలైనా తమదైన భాషలనూ, తమదైన సంస్కృతినీ, తమదైన మతాన్నీ అవలంబించుకునే స్వేచ్ఛనిచ్చింది. జనసంఖ్య మేరకు యెవరికి కావల్సిన నిధుల్ని వారికి చేరేలా నిర్ణయాన్ని తీసుకుంది. ప్రతి రాష్ట్రానికీ తమదైన కార్యనిర్వాహక యంత్రాంగాన్ని తయారు చేసింది. మొత్తం దేశానికంతా వొక కేంద్ర ప్రభుత్వాన్ని తయారుచేసింది.

ప్రతీ రాష్ట్రమూ పరిపాలనకనుగుణంగా చిన్న జిల్లాలుగా, ప్రతిజిల్లా తాలూకాలుగా విభజించబడింది. ప్రతీ వూరికీ వొక కార్యనిర్వాహక వర్గం యేర్పడింది. మొత్తం దేశంలో రెండు రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ఆ రెండు పార్టీలకూ దేశాభివృద్ధి తప్ప, మరే యితరమైన స్వార్థపూరితమైన కోరికలు లేవు. నైపుణ్యం, వివేకం, ఆచరణశీలత అనే విషయాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ అయిదేళ్లకొకసారి యెన్నికలు జరిగేవి. యెన్నికలు పారదర్శకంగా వుంటూ, ప్రశాంతంగా జరిగేవి. ప్రచారాలూ, వుపన్యాసాలు, మంత్రాంగాలూ వుండేవిగావు. యెప్పుడూ అప్రమత్తంగా వుండే ఆ దేశప్రజలు గడచిన అయిదు సంవత్సరాల్లో ఆయా పార్టీల నాయకులు చేసిన పనితీరు ఆధారంగా యెన్నికల్లో వోట్లు వేసేవాళ్లు. గెలిచిన పార్టీ మరింత నీతీ నిజాయితీలతో పనిచేసి దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసేది. వోడిపోయిన పార్టీ తమ తప్పుల్ని దిద్దుకుంటూ అధికారంలోవున్న పార్టీ చేస్తున్న పనులకు చేదోడువాదోడుగా వుండేది. గ్రామ సభలనుంచీ, దేశపు పార్లమెంటు దాకా, అన్నిచోట్లా దేశాభివృద్ధికి దోహదపడే చర్చలు మాత్రమే జరిగేవి. అన్ని పార్టీల రాజకీయ నాయకులూ, తాము ఖర్చుచేస్తున్న ప్రతిపైసా దేశానిదని గుర్తించి, అనవసరపు ఖర్చు కించిత్తయినా లేకుండా జాగ్రత్తపడేవాళ్లు. మిగిలిన సామాన్య ప్రజల జీవన ప్రమాణంకంటే తమ జీవితప్రమాణాలు తక్కువగా వుండి తీరాలని పట్టుబట్టేవాళ్లు. అవినీతి, బంధుప్రీతి లాంటి లక్షణాలసలు లేకుండా వుండాలని అప్రమత్తంగా వుండేవాళ్లు. స్వార్థ రహితంగా పనిచేసేవాళ్లూ, చేయవలసిన పనుల్లో నైపుణ్యంవున్న వాళ్లూ, దేశంకోసం తమజీవితాల్ని త్యాగం చేయడానికి కించిత్తయినా సందేహించనివాళ్లూ మాత్రమే రాజకీయాల్లోకి వెళ్లేవాళ్లు. రాజకీయమన్నది వృత్తిగా మారే ప్రమాదం లేకుండా, వారసత్వాలూ, కులాలూ మోతాదునుమించనివ్వకుండా కావల్సిన జాగ్రత్తలు తీసుకునేవాళ్ళు.

యే భౌగోళిక ప్రాంతానికి కావల్సిన నిర్ణయాన్ని ఆయా ప్రాంతాల ప్రాంతీయ ప్రభుత్వాలు తీసుకునేవి. నీళ్లు, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్తు, మొదలైన అనేకానేక వుమ్మడి అంశాలు కేంద్ర ప్రభుత్వ అధీనంలో వుండేవి. క్షేత్రంలోవున్న ప్రభుత్వాధినేత మొత్తం దేశపు బాగోగులనంతా వొకే దృష్టితో పట్టించుకునేవారు. వొక వొంటరి వెంట్రుకకు వేలాడుతున్న సింహాసనంపై కూర్చుని, న్యాయం తప్పితే వెంట్రుక తెగిపోతుందని భయపడుతూ నిర్ణయాలు తీసుకునే యమధర్మరాజుకూ ఆదేశాధినేతకూ వున్న తేడా వొక్కటే! ఆ సింహాసనంపైన ఆ దేశాధినేతకంత మక్కువేమీలేదు. న్యాయబద్ధంగా తప్ప మరోలా నిర్ణయం తీసుకోవడం ఆయనకు చేతగాదు. ఆ దేశంలోని మిగిలిన అందరు రాజకీయనాయకులూ ఆదర్శాల్లో ఆయనకు తక్కువేమీకారు.

రాజకీయాధికారమన్నది కేవలం బాధ్యతాయుతంగా చేయవలసిన పనిగావడంతో రాజకీయాల్లోకి అవసరమైనంతమంది మాత్రమే వెళ్లేవాళ్ళు. మిగిలిన వాళ్ళంతా తమతమ స్వధర్మాల్ని చిత్తశుద్ధితో ఆచరించేవాళ్ళు.

ప్రజల జీవన గమనానికి ముఖ్యంగా కావల్సిన వ్యవసాయమంటే అందరికీ గౌరవముండేది. ఆహారాన్ని పండించే రైతులంటే అందరికీ భక్తి శ్రద్ధలుండేవి. పనిచేసే రైతులకు  తెలియకుండావుండాలని,

వాళ్లకు కావల్సిన సేవలు చేయడానికి మిగినవాళ్లంతా పోటీపడేవాళ్లు.

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకూ, వైద్య సదుపాయాలందించే వైద్యులకూ, విద్యాలయాల్లో పనిచేసే వుపాధ్యాయులకూ, వివిధ శాఖల్లో పనిచేసే వుద్యోగులకూ, తృప్తినిచ్చేటంత జీతభత్యాలుండితీరాలని ప్రభుత్వాలు పట్టుబట్టేవి.

అప్పుడాదేశంలో ప్రముఖంగావున్న మూడు నాలుగు మతాలవాళ్లూ, మతమంటే జీవన విధానం మాత్రమేననీ, అన్ని మతాల సారమూ మానవత్వమేననీ గుర్తించి, పరస్పరం గౌరవించుకునే వాళ్లు. అందరి మధ్యా స్నేహాలు పెరగడంతో, వివిధ కులాలవాళ్లూ, దగ్గరై, వివాహాలు చేసుకొని, క్రమంగా అన్ని మతాల సారమైన మానవత్వపు మతాన్నొకదాన్ని రూపొందించుకున్నారు.

మనిషి జీవితాన్ని రసవంతంగా మార్చే లలితకళలంటే అందరికీ గొప్ప ప్రేమా, గౌరవమూ వుండేవి. కళాకారులందరూ సౌకర్యవంతంగా జీవించేలా ప్రణాళికలు తయారుచేసుకునేవాళ్లు. యేదోవొక ప్రాచుర్యమున్న కళను ఆసరా చేసుకుని అర్హతకుమించిన సంపదలను కొల్లగొట్టాలనుకునే కళాకారులు లేకపోవడంతో అన్ని కళలకూ సమాన గౌరవముండేది. విద్యలోనూ, కళల్లోనూ వుండే స్పర్ధ ఆరోగ్యవంతంగానే వుండేది. ఆటల్లో గూడా ప్రాచుర్యమున్న ఆటల్ని ఆడే ఆటగాళ్లు, యితర ఆటలు ఆడే ఆటగాళ్లతో సమానంగా మాత్రమే కీర్తి, ఆర్జనలుండాలని కోరుకునేవాళ్లు. ప్రజలూ ప్రభుత్వమూ దానికనుగుణంగానే ప్రవర్తించేవి.

మెట్ట ప్రాంతాలూ, నదీనదాలూ, యెడారులూ, కొండలూ, మైదానాలూ, అడవులూ, యిలా అనేక రకాలుగావుండే ఆదేశపు నైసర్గిక ప్రదేశాల్లోనివాళ్లు ఆయా ప్రాంతాల్లోవుండే పరిమితుల్లోనే జీవిస్తూ, తమకు కావల్సిన అదనపు సౌకర్యాల్ని మిగిలిన ప్రాంతాలనుంచీ అవసరమైనంతగా పొందగలిగేవాళ్లు. ఆయా భౌగోళిక పరిస్థితులకనుగుణంగా రూపొందిన వాళ్లు చాలా మంది ఆయా ప్రాంతాల్లోనే వుండగలిగేవాళ్లు. భిన్నరుచుల్తో, వేరేచోటికి వెళ్లాలనుకునేవాళ్లకు సులభంగా అది చేకూరుతూవుండేది.

ఆ ద్వీపకల్పానికి సాహిత్య, సాంస్కృతిక, వారసత్వంలాగే, దానికున్న సహజవనరులూ, భౌతిక సంపదా అంతులేనిది. అది అందరిదీ అన్న ప్రగాఢ విశ్వాసముండడంతో, ఆదేశంలో కరువులు లేవు. వరదలు, తుఫానులు, అంటువ్యాధులు, భూకంపాలవంటి ప్రకృతి వైపరీత్యాల్ని ముందుగా తెలుసుకునే విజ్ఞానం అందుబాటులో వుండేది. తామంతా ప్రకృతి సంతానమని గుర్తించిన ఆ దేశపు ప్రజలు, ప్రకృతి నియమాలకనుగుణంగా తమ జీవితాల్ని రూపొందించుకునేవాళ్లు.

యెన్ని జాగ్రత్తలు తీసుకున్నా మానవ పరిమితులవల్ల అనుకోని ప్రమాదాలు అవాంతరాలూ యెదురైనప్పుడు దేశ ప్రజలంతా కలిసికట్టుగా యెదుర్కొనేవాళ్లు. మానవజీవన పరిమితులవల్ల జరిగే యిక్కట్లకు తట్టుకుంటూ, సానుభూతితో ప్రేమతో జీవించడం వాళ్ల సహజ జీవన విధానమైపోయింది.

ఆ దేశాన్నీ, ఆదేశ ప్రజలనూ చూసిన యితర దేశాలూ, ప్రజలూ, క్రమంగా తామూ అలాగే పురోభివృద్ధిని సాధించితీరాలని కష్టపడి పనిచేయసాగారు.

❖ ❖ ❖

యీ కథలో నిజమెంతో కల్పన యెంతో విజ్ఞులైన మీకు చెప్పవలసిన అవసరం లేదు. అయితే ఇంత కథా పుట్టడానికి వెనక కొన్ని ప్రశ్నలుమాత్రం నిలువెత్తు నిజాల్లా నిలబడివున్నాయి.:-

వ్యవసాయదారులకోసమనే చట్టాలు చేస్తున్నామని అంటూ ప్రభుత్వమొకవైపూ, తమను కాపాడండి మహాప్రభో అంటూ రైతులు మరోవైపూ ఆక్రోశిస్తున్నారెందుకు?

కాశ్మీరులో పాక్ ఆక్రమిత కాశ్మీరు, ఆజాద్ కాశ్మీరు చైనా ఆక్రమిత కాశ్మీరు, యిలా యిన్ని విభేదాలెందుకు?

యే రాష్ట్రంలోనయినా అరాచకం పెరిగితే ‘యిది బీహార్ అనుకుంటున్నావా?’ అని అనడం రివాజెందుకయ్యింది?

కొన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలెందుకయ్యాయి? కొన్ని రాష్ట్రాలవాళ్లకు ప్రత్యేక పన్నులు, సదుపాయాలూ యెందుకున్నాయి?

విద్య, వైద్యంవంటి ముఖ్యమైన విషయాల్లో నిర్ణయాధికారమెవరిది? కేంద్రం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రాలు పాటించకపోయినా తప్పులేదా?

కేంద్రం కొన్ని రాష్ట్రాలను స్వంతమైనవిగానూ, కొన్నింటిపైన సవతి తల్లి ప్రేమనూ చూపిస్తున్నవనడంలో నిజమెంత?

మతాతీత, కులాతీత లౌకిక రాజ్యమని పేర్కొనబడిన రాజ్యాంగపు సిద్ధాంతానికి కట్టుబడే వున్నామా? మున్సిపల్ కౌన్సిలర్ నుంచీ దేశాధినేత యెన్నిక వరకూ కులమూ, మతమూ యెందుకు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి?

కొందరు తమనెందుకు మైనారిటీలమని ఘోషిస్తున్నారు?

కొన్ని కులాలవాళ్లు తమను బీసీలుగా, యెస్సీలుగా గుర్తించమని యెందుకు ప్రాధేయపడుతున్నారు?

కులాలకూ మతాలకూ ప్రత్యేక బోర్డులూ, ఛైర్మనులూ యివ్వడం రాజ్యాంగబద్ధమేనా?

మూడు రాజధానులని వొకరూ, వొకే రాజధాని అని మరొకరూ యెందుకిలా పట్టుబడుతున్నారు?

స్వతంత్ర ప్రతిపత్తి వుందనుకునే న్యాయవ్యవస్థలో యిన్ని లుకలుకలెందుకు? యీ బదిలీలెందుకు?

చాలా పెద్దదని పేరుమోస్తున్న భారత రాజ్యాంగానికిన్ని సవరణలెందుకు?

మాతృభాషలో విద్య అనే అంశంపైన కేంద్రమూ, రాష్ట్రమూ వేర్వేరు నిర్ణయాలు తీసుకోవచ్చా?

హోసూరులో, బళ్లారిలో, తెలుగువాళ్లు మాతృభాషకోసమని అంత పోరాటం చేయాల్సిన అవసరమేమిటి?

యిటీవల వొడిస్సా రాష్ట్రం, కొన్ని తీరప్రాంతపు ఆంధ్రప్రదేశ్ గ్రామాల్ని ఆక్రమించుకుంటోందని పత్రికలెందుకు ఫిర్యాదు చేస్తున్నాయి?

మనమంతా భారతీయులమనే మౌలికమైన భావనను యెందుకు మరచిపోతున్నారు?

రాజకీయాలే వృత్తిగా యెందుకు మారిపోయాయి?

కొందరు కాసింత శ్రమకూడా చేయకుండా కోట్లకుకోట్లు గడిస్తోంటే, చాలామంది కనీసావసరాలు కూడా లేకుండా యెందుకున్నారు?

**యీ ప్రశ్నల జాబితా చాలా పెద్దది.**

**సమాధానాలే కరువు.**

హోసూరు తావు నవల

అగరం వసంత్
094883 30209




**2**

**వాన** బాగా పడింది.

ముంగారువాన బాగా పడింది.

పెద్దేరులా, చిన్నేరులా, చెరువుల్లా, వంకల్లా, కుంటల్లా వాననీరు బాగా చేరింది. చేన్లంతా బాగా నాని ముద్దయిండాయి.

ఆవులపల్లి, అలసనత్తం, అగ్గురారం, అత్తిముగం, చిన్న ఎళసగేరి, పెద్ద ఎళసగేరి, చిన్నకూళ్లు, పెద్దకూళ్లు, ఏటిగడ్డ, సౌళబీడు ఇట్లా పూర్లంతా వన్నేరు కట్టేకి సురువు చేస్తా వుండారు.

నేలని నమ్ముకొని వుండే రైతులపండగ, నేలమ్మకి రైతులు మాత్రమే చేసే పండగ ఈ వన్నేరు పండగ.

మావూర్లా మేము పెద్ద రైతులం కాదు కాని, మాకూ చేను, చెట్టు వుంది. నవదాన్యాల ఎడలు(ప్రసాదాలు) ఎత్తుకొని మేము గుడితావుకి పోతిమి. అబిటికే గుడి ముందర మడకలతో వచ్చి రైతులంతా నిలిచిండారు.

ఊరిగౌడు గౌర్రిపోట్లి తలమింద నీళ్లు పోసి పసుపు, కుంకుమ పెట్టి, సామ్రాణి కడ్డ పొగ చూపిచ్చె. గౌర్రి గట్టిగా తల అల్లాడిచ్చె.

"పిల్ల (గౌర్రిపోట్లి) ఒప్పుకొనేసె.. అలెలో బాలో" అందురూ గట్టిగా కిర్లిరి.ఒగే వేటుకి క్రిష్ణన్న గౌర్రిపోట్లి తల నరికె. అబిటికే మడకలకీ, ఎద్దులకీ పసుపు, కుంకుమ పెట్టి తయారుగా వుండారు.

గౌడు వచ్చి పూజ చేసి, "ఈ కిత ఎవరప్పా వన్నేరు" అంటానే "నేనే గౌడు" అంటా రామన్న ముందరికి వచ్చె.

నవదాన్యాల ఎడ, టెంకాయ చిప్ప, పూలు, ఫలములు రామన్న చేతికిచ్చి, "పంటలు బాగా పండాలని నేలమ్మకి మొక్కుకొని మడక కట్టప్పా" అని చెప్పి గుడిలోకి పోయె.

"మా జాంబవంతుడు పుట్టిన ఆర్నెల్లకి బూమమ్మ పుట్టె" తోటి (ఊరి పనులు చేసే వ్యక్తి) అంటా ముందర నడస్తా వుంటే ఆయప్ప వెనక రామన్న పోతా వుండాడు.

ఊరి ముందర మడకను దింపి, కాడిమానుని మడక్కి బిగించి, "అమ్మా నేలమ్మ తల్లీ ఈ కిత వానలు బాగా పడి నీ కడుపు పండాల, మా కడుపులు నిండాల" అని నేలతల్లికి మొక్కి వూరి చుట్టూ వన్నేరు కట్టేకి సురువు చేసిరి (నేలని దున్నడం).

తోటి మోటప్ప వెనక రామన్న నడస్తా, మడక దున్నతా, దున్నతా వూరి చుట్టూ దున్నేసి వచ్చిరి.

"ఊరి చుట్టూ దున్నింది ఆయె వన్నేరు కట్టింది ఆయె" తోటి మోటప్ప మాట విని అందరూ వాళ్ల వాళ్ల చేనులు దున్నేకి పోయిరి.

నేను అబ్బ కూడా మా చేనుతావుకి పోతిని. అబ్బ దున్నతా వుంటే నేను మడక వెనక నడచి పోతా వుండా. దుక్కిలానింకా లేసే పచ్చిమన్ను వాసన నా ముక్కులా దూరి నాకు బాగా అచ్చివచ్చె. దున్నేటపుడు మన్నులానింకా లేసే ఎర్ర పులుగులు, గాలం పులుగులు, గౌణ్ని పులుగుల్ని కాకులు గద్దలు తిని పోతా వుండాయి.

"తుంగ, ఉట్ల కసువు, ఊగ కసువు, గరిగె బజ్జర వుండేతావ బాగా గాతముగా మడక పోయేనట్ల చూడు" తాత చెప్పతా వుంటే, అబ్బ తల గుంకాయిస్తా ఎద్దుల్ని అదలిస్తా పోతా వుండాడు.

మాకుండేది ఒగే చేను. పొద్దప్పుడు నెత్తిపొద్దు ఎక్కి పోతా వున్నట్లే, మా చేను దున్నింది ఆయె.

'గౌనోళ్ల చేను దున్నేకి పోతా" అంటా మా అబ్బ పయనమాయె. నేను అబ్బ పయనములా పాలు పంచుకొంటిని.

అది చేనా చెరువా అనే సందేహము వచ్చే నాకు, అంత పెద్దగా వుంది. అబిటికే ఏడుజతల మడకలు చేను దున్నతా పారాడతా వుండాయి. మా అబ్బ కూడా వాళ్ల జత చేరిపోయె.

''పోయిన ఏడాది రాగులు చల్లింటివి కదా, ఈకిత సెనక్కాయలు (వేరుసెనగ) వేయాల " గౌడు వాళ్ల సేద్దెగాని తావ అంటావుండాడు.

"మూడు విత్తనాల తీగకాయ వేస్తామా? రెండు విత్తనాల గుత్తికాయి వేస్తామా గౌడూ" సేద్యెగాడు అంటానే "గుత్తికాయి వేస్తాంమురా, అట్లే ఓణి (డొంక) చేనుకి నూగులు, కానుగమాను చేనుకి కొర్రలు, కల్లము చేనుకి ఉలవలు, ఆ పక్క చేనుకి సాములు, ఈ పక్క చేనుకి సజ్జలు వేయాల. రాగిచేను విత్తేతబుడు చేనుకి కల్ల(కంచె) గా ఎర్నూగు పూలు, సాళ్లలా జొన్నకడ్లు, అనప, అలసంది విత్తనాలు, చేనంతా ఆడాడ సాసువులు(ఆవాలు) చల్లాల. నువ్వే దగ్గరుండి ఈ పనులంతా చూసుకోవాల" గౌడు చెప్పతా వుంటే సేద్దెగాడు "అట్లే" అంటా తల గుంకాయిస్తా వుండాడు.

గౌడుసానమ్మ సంగటి మక్కిరిన్ని (గంప) ఎత్తుకొని వచ్చి కానుగమాను నీడలా దింపె. మడకలు విప్పి, ఆవుల్ని పచ్చి కసువు మేతలకి విడిచి అందరూ కానుగమాను తావుకి వచ్చిరి. కత్తాళి




అని గట్టిగా అనె. చిన్నోళ్లంతా వచ్చి చుట్టూ చేరేసిరి.

×××

విత్తనాల ఏకాసి పండగనాడు చేను చేనులంతా విత్తనాలు చల్లిరి. వాన ఎనక వాన పడతా వుంది. మొలకలు పెరిగి పెద్దవవుతా వుండాయి. చేనులకంతా గుంటువ వేసి చెత్తా, చెదారా లేకుండా చేసిరి. పయిర్లు గుమ్ములు కట్టి గుంపులు గుంపులుగా చేన్లంతా నిలిచిండాయి. అత్తాన పొంగలి నాపొద్దు (నాడు) కూలోళ్ల కష్టానికి పందినంజర వంటావార్పు.

చేనుపంటలే కాదు కానపంటలకీ మా తావు పెట్టింది పేరు. మావూరి చెరువుకట్ట నాలుగు పర్నాంగుల విస్తీర్ణం వుంటే కట్టకింద కాన 40 పర్నాంగుల దూరం వుంటుంది.

కాన కానంతా కిచిడి వడ్లు, బెద్ద బేరొడ్లు, జయా వడ్లు, నల్ల వడ్లు, బవాని వడ్లు, గిడ్డ బయ్యర్లు, మూన్నెల్ల వడ్లు, ఆర్నెల్ల వడ్లు, గమ్ముల వడ్లు, రకరకాల వడ్లపయిర్లు పచ్చగా పెరిగిండాయి.

కాన చుట్టూరా టెంకాయ, చింత, సీమచింత సేపు(జామ), పరంగి(బొప్పాయి), బంకశలి, కలవరేణి, బిక్కి, సీతాపలము, పనస, నేరడి, జంబు నేరడి, కరప, అత్తి(మేడి) మాన్లు అంతెత్తరము పెరిగి నిలిచిండాయి.

మానుపనికి అయ్యే జాలిమాను, బాగిమాను, పువ్వరిసి మాను, పొగుడుతండి మాను, వెర్రియాప మానులు ఏ కాలానివో అవెన్ని కాలాలని చూసిండాయో.

మరాలు, మక్కిర్లు, బుట్టలు అల్లేకి పనికి వచ్చే వెదురు గుమ్ములు, సంగటికట్టె, మెట్టుకట్టెకి పనికి వచ్చె సిగరమాన్ల సొగసు చూడాల.

విస్తరాకులకి అయ్యే మోతుకు మాను, మేకలకి మేపులకి అయ్యే పందివేప మాను, పందేమేసుకొని పెరిగినట్లుండాయి.

కట్టకి కావలి కాస్తా కట్ట పొడవునా పెరిగిండే పిల్లగోవి చెట్లు, తెల్లనల్ల జిల్లెడి చెట్లు, వార్జీపు మాన్లు, తాటి మాన్లు, ఈత మాన్లు ఆడాడ మాన్లకింద అలుమాకు, ఆనబరుగు కసువు, పాలాకు, బొద్దాకు, కాశాకు, గరిగకసువు, సొంటికసువు, ఏటిజంబు సొగసుగా పెరిగిండాయి.

కాన పక్కలానే కావలి (బీడుభూమి). కావలికి కల్లగా సన్న కల్లి, పెద్దకల్లి పొదలు, కొటము పొదవు పెరిగిండే మంచి కత్తాళి, వెర్రి కత్తాళి, జాలి, ముగళి, మర్రి, గొడ్డలిమిట్ట మాన్లు.

కావలంతా పచ్చి కసువు, ఆ కసువు మద్దెలా అడవి టెంకాయలు (ఏలకుల సైజులో పచ్చగా వుంటాయి. కాయలోపల నల్లని విత్తనాలు వుంటాయి. వాటిని తింటారు). కారి, మింద, కుడితి పండ్ల కత చెప్పే పనిలేదు.

ఎర్రని పండ్లతో నాగదల్లకాయ (నాగజెముడు) చెట్లు. ఈ పండు తినాలంటే పండు కొనని రవంత కోసి పక్కన పెట్టి మిగిలిన పండు తినాల. ఆ కొన పండులా చక్రము మాదిరిగా వుండే ముల్లు వుంటుంది. దాన్ని తీసి తినాలా, లేదంటే ముల్లు గొంతులా

(నారకలబంద) పట్టులా సంగటి పెట్లుకొని, ఉలవల పులుసు పోసుకొని తింటా వుండారు. నేను అన్నానికి మామిడికాయ ఊరగాయ కలుపుకొని తింటా వుండా.

"పాకముపప్పో.. పాకముపప్పు" అంటా అరస్తా సాయిబుల లబాబన్న కావలిలా (బీడుభూమి) దూరి వూరిపక్క పోతావుండాడు.

"పాకముపప్పు తినాలప్పా" అంటా అడిగింది తడువు, మా అబ్బ నోట్లా రెండు వేళ్లు పెట్టుకొని జోరుగా సీలేసె (విజిల్). అది విని నేరుగా మాతావుకి వచ్చె లబాబన్న. గౌడు పదిరూపాయల నోటు తీసి లబాబన్నకి ఇచ్చె.

"మీవూర్లా మీరు తప్పితే నా పాకముపప్పుకి కాసులు ఇచ్చే నాతుడే లేడు గౌడు" అంటా మా అందరికి పాకము పప్పు ఇచ్చె.

పాకముపప్పు తింటా మాతావు పంటల గురించి రవంత సేపు మాట్లాడి ఎవరి పనులకు వాళ్లు పోయిరి.

"నువ్వు లబాబన్న కూడా వూరికి పోరా" మా అబ్బ అనె.

నేను లబాబన్న సైకిలు వెనక వూరిదోవన నడస్తా వుండా.

"అనా... నా... పాకము పప్పు చేసేది ఎట్లనా" అంటా అడిగితిని. "అదేమి పెద్ద యిద్ది కాదబ్బయ్య, సెనగిత్తనాలని వేపి, పొట్టును వుజ్జి ఒగ తట్టలా పెట్టుకొనాల. బెల్లము నజగొట్టి సట్టిలా వేసి నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాల. ఆ పాకము బాగా మరిలినంక సన్నమంట మీద తట్టలా పెట్టిండే సెనగ యిత్తల్ని వేసి కలుపుకొనాల. రవంత సేపు ఉడకనిచ్చి ఆమీట పెద్ద తట్టలా ఆ పాకాన్ని పోసుకొని ఆరబెట్టి చిన్నచిన్న బిళ్లలుగా కోసుకోవాల... అంతే" అని చెప్పె.

"అవునునా నువ్వు పాత సామాన్లు, చిలుము పట్టిండే ఇనుము సామాన్లు తీసుకొంటావు కదా వాటిని ఏమి చేస్తావునా" తిరగా అడిగితిని.

"పేటలా పెద్ద పెద్ద యాపారగాళ్లు వుండారప్పా, నేను వాళ్లకి అమ్మతాను. వాళ్లు అవిటిల్ని కరిగిచ్చి తిరగా కొత్తగా తయారు చేస్తారు" అనె.

"అంటే పాతది పోయి కొత్తది వస్తుంది కదనా" అంటిని.

"అవును, కొత్తనీరు వచ్చి పాతనీరు పోయినట్ల, కొత్త మనుషులు వచ్చి పాతవాళ్లు పోయినట్ల కాలచక్రంలా మనిషైనా మానైనా విరగాల్సిందే కరగాల్సిందే మన్నులా కలవాల్సిందే" అని వూరి ముందర రచ్చతావ సైకిలు నిలిపి "పాకము పప్పో.. పాకము పప్పు"

తగులుకొంటే తీసేకి చానా కష్టము.

ఈ పండు ఒంటికి పుష్టికే కాదు, పెండ్లయి బిడ్డలు కాకుండా వుండే జంటలు దీన్ని తింటే బిడ్డలు పుడతారంట, అంత శక్తి ఈ పండుకి వుందంట. మా తాత ఎబుడూ చెప్పతా వుంటాడు.

కాన వబ్బలా కెంబారుకాకి పాట పాడతా వుంటే కళ్లి వబ్బలా గుడ్లగూబ ఊ కొడతా వుంది. "అక్కా అక్కా" అని కూస్తా వానకోయిల చేన్ల పక్కపోతే "కుపేంద్ర... కుపేంద్ర" అని కూస్తా కుపేంద్రుని గువ్వ వచ్చి గుట్ట మీద కూకొనె.

"ఉత్తుత్తి... ఉత్తుత్తి" దణి చేస్తా ఉత్తుత్తి గువ్వ, గూ... గూ... గువ్వల మాటలు మా కాన పక్క బాగా వినబడతాయి.



"బుస్... బుస్..." అనే నాగపాములే కాదు తోకలా మనుషుల్ని కొట్టే జేరుపోతులు, (ఇది జోరగా కొడితే కాడిమాను కూడా యిరిగి పోతుందంట. ఇంగ మనిషి కాలు నిలుస్తుందా) కట్టె కంపల్లా వుండే కట్ల పాములు, దుక్కి నేలలా వుండే దుమ్ము మండ్లాయి, పూడ మండ్లాయి, మనుషుల్ని కొరకని (కరవని) పసురు పాములు, కొరికినా విషం లేని నీళ్లేరి పాములకి, పుట్టలకి, పులుగలకి, చీమలకి పుట్టినిల్లు.

ఇంగ చెరువునీళ్లలా జెల్లులు, ఉణుసులు, మారువులు, దూబాని చేపలు, కుచ్చులు, కొరదలు, కోలసనులు, కేట్లాగులు, గెండ్లు, పక్కిలు, పాము చేపలు, నెత్తిమీద కండ్ల చేపలు మెదలాడతా వుంటే, నీళ్ల కోళ్లు, చేపగువ్వలు, శెనిగువ్వలు, తెల్ల కొక్కర్లు, కొంగలు, గద్దలు ఆ చేపల్ని ఎత్తుకొచ్చి మాన్ల పైన తింటా వుండాయి.

ఇంగ నల్ల ఎంద్రికాయలు, రాజ ఎంద్రికాయలు, రాతెంద్రి కాయలు, పాల ఎంద్రికాయలు, గుల్లెంద్రికాయలు బండ్ల సందుల్లా ఇండ్లు కట్టిండాయి.

పూరిడు గువ్వా, పిచ్చిగ్గువ్వా, గీజన గువ్వా, గోరటి గువ్వా, చిలకా-గోరింకా, పండు కాయి తింటా, చెరువులా నీళ్లు తాగతా పైపైన పారాడతా వుండాయి.

ఉడుము, నలికిరి, జెర్రి, మండ్రకప్పా, గండ్ర కోతి, చిట్టెలుకా, పందికొక్కు, కోతుల మంద, మిడతల దండు, తేనీగలు, కర్నీగలకు కొదవ లేదు.

ఇట్లా చానా రకాల చెట్లు, నానా రకాల ఆకులు, అలుములు, గువ్వలు, జీవాలని తన గుండెల్ల పెట్టుకొని సాకే మా చెరువంటే నాకు చానా ఇష్టము.

"నీ ఇష్టము మా ఇష్టము కాదా, రారా కొక్కరిబండ తావుకి పోదాము" అనిరి నా సావాసగాళ్లు.

చెరువు కొనలా వుండేదే కొక్కరి బండ. మోకాళ్ళు మునిగేఅంత నీళ్లు ఈ బండ చుట్టూ చేరి వుంటాయి. బండ చుట్టూరా ఆడాడ చిన్న చిన్న గుంతలు. గుంతలా నీళ్లు ఎబుడూ తేటగా తాగేకి బలే తీపుగా వుంటాయి. నేనూ, నా సావాసగాళ్లు బండపైనకి ఎక్కి ఆడనింకా జారతా నీళ్లలా పడతా వుండాము.

గొడ్డూ, గోదా మాన్ల కింద చేరి నెమరేస్తా వుండాయి.

"పోతా పోతా పోలూరు, పోలూరు పక్క మాలూరు, మాలూరు పక్కల మర్రిమాను, మర్రిమానులా కోతి, కోతి చేతిలా గజ్జె - గజ్జె గలుక్కుమనే నీ నోట్ల పురుక్కుమనే" కెంచన్న వాళ్ల మునిగాడు కానుగ మాను కవలకొమ్మలా కూకోని పాడతా వుండాడు.

"గాజులూ తొడుగారమ్మ, గౌరి తొడిగే నల్లా గాజులు, కైవార మఠము గాజులు, తాతగారు తొడిగిన గాజులు" కూనిరాగము తీస్తా కుటాణిలా వక్కాకు దంచతా వుంది లచ్చుమవ్వ.

"కత్తి పట్టరా, సిపాయి బిడ్డ నేనే వస్తాను" అని అరిగాడు ఆవుల మంద బెదిరిపోయే మాదిరిగా కూతేస్తా వుండాడు.

చింత మానెక్కి నలుగురు చిన్నోళ్లు కోతికొమ్మాట ఆడతా వుంటే, ఇసక దిబ్బలా ఇద్దరు ఆడబిడ్లు చెలిమి కొలిమి ఆట సురువు చేసిండారు.

బండిపైన ఏతం దూతం ఆట, బండ పక్కలా బంగరాల ఆట, కసులు పువ్వుల ఆటలా నీలీ శీలి, కన్ను ఆటలా రామీ బీరి. ఏటుపండు ఆట ఆడతా ఆరుగురు. చేతులు జోడి ఆటలా నలుగురు. ఈడ్పులాటలా పడిరి కొందరు. తువ్వాలు ఆటలా పెట్లు తినిరి ఇంకొందరు. అప్పుదడ ఆటలా అలిసిన మారి. గాజు వొప్పులు ఆటలా గెలిచిన నంజి. చౌకా... బారా ఆటలా గెలిచి, సరి-బేసిలా సోలిన గౌరి. బొమ్మబొరుసు ఆటలా కాసులు గెలిసి, వానగుంతల ఆటలా మెరసి, గిరిగిరి ఆటల కండ్లు తిరిగి కిందపడిన ముని. మలగంబము ఆట ఆడాలని తైలము మాను (నీలగిరి మాను) ఎక్కి దిగతా వుండే రాజుగాడు. రాజట్ల రాళ్లాటని చిన్నోళ్లకి నేర్పతా ఈరన్న, మూడిండ్ల గట్టా (అష్టా చమ్మ) లా మునిగి తేలతా అనుమక్క, ఆంజమ్మ. ఏడిండ్ల గట్టా ఇట్ల ఆడాలని చెప్పతా వుండే చిన్నముని. పులి గట్ట ఆడతా కాకన్నతాత, గూపల్లి తాత.

కుంటే బిళ్ల జారాట, కిష్టకాలాటా, గుర్రం కాలు ఆట, అరికాలు ఆట, అమిటి ఆటల్లా శైలమ్మని సోలిపించింది ఎవురూ లేరు. కుంటేబిళ్ల ఎనిమిది ఇండ్లు, తెల్లనల్ల ఆట, తలకాయి ఆట, పువ్వు మొగ్గ ఆట, అమిటి ఆట, కొండాటలా, శిల్పక్కకి సరిలేరు ఎవ్వరూ. గోళీలు, వేటుజాండు, పొడువు గీతాట, చెక్కబొమ్మ ఆట, మూడు

బొద్దిలాట, గుండాట, సోణికి, సయ్యి గుయ్యి ఆటల్లా గోవిందునికి ఎవ్వరూ సరిసమానము కాదు. అచ్చన రాళ్ళు, జల్లడి ఆట, పొయ్యి ఆట, పాదాల ఆట, ఎం(డ్రకాయి, తక్కడి, తొట్టండ్లు, శిలావలుకులు, మూత, గుండాట, పేరు ఆట, ఆశ–దోశ–అప్పలం ఆటల్లా మునిరాజమ్మని, నాగరాజమ్మని, సాకమ్మని, మించినోళ్లు ఎవరూ లేరంటాను.

సల్లని గాలి, పచ్చని చెట్లు, చం(ద్రోదయము కాని సాయం కాలము చెరువు కట్టపై నడస్తా నేనూ నా సావాసగాళ్లు పోతా వుండాము.

పిడికెడు వడ్ల గుత్తిని ఇంటి ముందర వేలాడదీసి కట్టే తాత. పిచ్చిగ్గువ్వలు వచ్చి ఆ వడ్లగుత్తి చుట్టూ చేరి తిని పోతావుండాయి.

ఆవులకి కసువు, కుక్కలకు సంగటి, పిల్లులకి పాలు, గువ్వలకి గింజలు పెట్టే కళాచారం మాది. జీవరాసులు మా బతుకులా బాగం.

రాగెన్నులు తెచ్చి కాల్చుకొని లేదా ఉడకేసి ఉజ్జి, దాంట్లో బెల్లము కలుపుకొని తింటే ఆ రుచే వేరే. నేనూ నా సావాసగాళ్లు ఇబుడు తానే ఆ రుచి చూసి వస్తిమి. మీకు తినాలనిపిస్తే రాండా, మా రాగెన్నుల రాజ్జానికి రాండా.

మడులు కోసి, వడ్లు తొక్కిచ్చి, రాసులు పోసి, మూటలకి నింపి, ఇంటికి కావలసిన్నని మూటలు పెట్టుకొని మిగిలిన మూటలని బండ మీదే వ్యాపారాలు జరిపిరి.

"రేపు కల్లము అలకాలనా, పొద్దుననే వచ్చీడి" అబ్బతావ గౌనోళ్ల సేద్దెగాడు అని పోయె. నేను ఇందాకంట కల్లము అలికేది సూడలే. రేపు చూడాల అనుకొని కండ్లు మూస్తిని. బాగా నిద్దర వచ్చీసె....

అబ్బ పాలు పిండతా వుండాడు. అబుడు గేణం వచ్చె నాకు, లేసి పండ్లు ఉజ్జి, పాలు తాగి, అబ్బ వెనక కల్లము అలికే తావుకి పోతిని.

గౌనోళ్ల రాగికుప్ప చానా పెద్దగా పొడవుగా వుంది. వూరి వాళ్లవి, మావి చిన్న చిన్న కుప్పలు చేనుకి చుట్టూరా వుండాయి. కుప్పల మద్దిలా వుండే జాగాలానే కల్లము అలికేది.

అబిటికే పదిమంది మగోళ్లు చెనకల్లా (పారలతో) నేలనంతా చదును చేస్తావుండారు.

మా అబ్బ బండినిండా నీళ్ల బిందిగలు నింపుకుని వచ్చె. అందరూ ఆ నీళ్ల బిందిగల్ని తలా ఒగొగటి ఎత్తుకొని చదును చేసిన నేల పైన చల్లిరి.

గువ్వలు గూటికి చేరే పొద్దులా మోటప్ప ఆ నేలనంతా పొలికి తోలె.

రెండోనాడు ఐదుజతల ఆవుల్ని జతకట్టి ఆ నేలనంతా బాగా తొక్కిపిచ్చిరి. కడగా గుండు కట్టి తోలిరి. అబిటికే నేల బాగా గట్టిపడె.

ఆమీట ఆ నేలపైన పేడనీళ్లు చల్లి బాగా అలికిరి. ఇట్ల రెండు దినాల కష్టము పడినంక కల్లము తయారాయె.

మొదలు దినము గౌనోళ్ల కుప్పలోని కట్టలు తీసి కల్లములా సాళ్లు పరిసి గుండుతోలేకి సురువు చేసిరి. మోటప్ప, మా అబ్బ, మార్చి మార్చి గుండు తోలతా వుండారు. అబిటికే మద్దేనము సంగటి తినే పొద్దు ఆయె. అబుడు నిలిపి తాళునంతా తిప్పేసి సంగటి తినిరి.

ఆమీట ముద్దలగంగడు గుండు తోలతా పడుగు తొక్కిస్తా వుండాడు.

"రేయ్! వాక్కు వైనము (విద్యాబుద్ధి) లేనోడా, అట్లైనా గుండు తోలేది, ఎవురురా నీకు వజాయము (నడవడిక) నేర్పింది" అంటా మయేరమ్మ గద్దిచ్చి మాట్లాడె.

తనపాటికి తాను పడుగు తొక్కిస్తా వుండిన ముద్దల గంగనికి రేగినట్లుంది. కోపముగా ఆయమ్మని చూస్తా "నీ మొగుడేనమ్మా" అనె.

"నువ్వు ఎపుడు నా మొగునికి దిగితివిరా, నీకు వజాయము నేర్పేకి" అట్లే తగులుకొనె.

ఆ మాట వింటానే గంగనికి ఉన్నింది రేగిపోయి వూగిపోయె. అట్లే గుండు నిలిపి "ఏయ్! గుగ్గు (మూర్ఖ) ముండా నీకు ఒళ్లు ఎట్లుంది. అయినా నువ్వు ఎవతివే నన్ను తిట్టేకి, నువ్వు నా మాదిరి గానే కూలికి వచ్చిండే కుటాణి. నోరు మూసుకొని నీ పని నువ్వు చూడు" అనె.

"రేయ్! ముట్టాల్ నా బట్ట. అదేల అట్ల రేగుతావు. కూలి కూడు కడుపుకి పట్టాలంటే న్యాయము నీతిగా పనిచేయాలరా!"

"న్యాయము నీతి చెప్పేకి నువ్వు అరిచం(ద్రుని పక్కలా పుట్టి వచ్చిండావు"

"న్యాయము నీతి చెప్పేకి అరిచం(ద్రుని పక్కలా పుట్టి రావాలేంరా, కడుపుకు అంత అన్నము తినే ఎవరైనా చెప్పొచ్చు."

"నువ్వు ఒగతివే కడుపుకి అన్నము తినేది. మిగతావాళ్లంతా సున్నము తింటారు."

అందాతలికే ఆడికి గౌడుసానమ్మ వచ్చె. ,

"చూడు గౌడుసానమ్మా వాని మాటలు... కన్ను మిన్నూ లేకుండా పడుగు తొకిస్తావుండావు, బాగా తోలరా అనిందానికి నన్ను అనరాని మాటులు అంటా వుండాడు" అంటూ దూరు చెప్పె మయేరమ్మ.

"దాని మాటులు కట్టుకొండమ్మ, నాకు ఈ పని కొత్తనా? పడుగు మింద ఎట్ల తోలాలని తెలీదా? నాకే గుండు తోలే దానిగురించి చెప్పుతుంది దానికెంత సొక్కు" అనె గంగడు.

"ఎవరికి రా సొక్కు నాకా, రారా" అంటా పరకను చేతిలాకి ఎత్తుకొనె మయేరమ్మ.

"ఏయ్! మయేరి, ఇంగ చాలు నిలుపే నీ రంగాటము. ఇంతకీ, అంతకీ జగడాలేనా? నీ పని నువ్వు చేయకుండా వాన్ని పనిచేయనీకుండా ఏమి నువ్వు చేస్తా వుండేది, ఎట్లా వజాయము నేర్చిండావే" అని తిట్టె గౌడుసానమ్మ.

"అట్ల ఉమియమ్మా.. దానికే వగలేదు, ఇంగ నాకి వజాయము నేర్పేకి వస్తా వుంది. గబ్బుముండ" అంటా గుండు తోలేకి సురువు చేసె ముద్దల గంగడు.

గుండు తోలేది, గుంగు వింగడిచ్చేది, రాగులు తూరి రాసి పోసేది. ఆ రాసుల్ని ఇండ్లలోని కణజాలకి, గాదులకి నింపే పనుల్లా అందరూ మునిగి తేలిరి.

ఆమీట వారానికి కందులు, ఉలవలు, సాములు, సజ్జలు, అనప, అలసంది, ఉద్దులు, ఎర్నాగులు కల్లము నింకా ఇండ్లల్లాకి చేరె.

(తరువాయి వచ్చే సంచికలో...)

నవల

డి.పి. అనూరాధ
90100 16555




*(జరిగిన కథ)*

***శ్రీలంకలో లచ్చిమిని కలుసుకోవడమే కాదు ఆమెను పెళ్లిచేసుకుని ఇండియా వస్తాడు సూర్యవర్మ. తెలుగు జాతి ఘనకీర్తి చరిత్రకు సంబంధించి థీమ్ పార్క్ నిర్మాణానికి ప్రయత్నాలు చేసి విఫలమవుతాడు. ఆఖరుకి 'జగమునేలిన తెలుగు' నవలకు శ్రీకారం చుడతాడు. ఆ నవల ప్రకంపనలు సృష్టించి భారత రాష్ట్రపతితో సూర్యవర్మకి పరిచయం ఏర్పడేలా చేస్తుంది. థీమ్ పార్క్ నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుంది. ఆ తరవాత ఏం జరిగింది?***

**నా** ఢిల్లీ యాత్ర గొప్ప విజయం సాధించింది. భారత రాష్ట్రపతి తల్లాప్రగడ సత్యనారాయణగారిని కలుసుకోవడంతో నా జీవితమే మారిపోయింది. తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర థీమ్ పార్క్ ప్రాజెక్టు వెంటనే పట్టాలెక్కింది. నాగార్జునకొండకే నా మకాంను మార్చాను. అమ్మానాన్నలతో పాటు లచ్చిమి, బాబు హైదరాబాద్‌లోనే ఉన్నారు. నేను అక్కడికీ ఇక్కడికీ తిరుగుతున్నాను. రెండు రాష్ట్రప్రభుత్వాలు 'తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర' ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా చేబట్టాయి. జపాన్, కొరియా, అమెరికా సంస్థలు ఇందులో భాగస్వాములుగా చేరాయి. చరిత్ర, భాషాశాస్త్రం, పురాతత్వశాస్త్రం, వాస్తు శాస్త్రం, కృత్రిమ మేధ, శాస్త్ర సాంకేతికత శాఖలు సంయుక్తంగా పనిచేశాయి. ప్రాజెక్టు పూర్తవడానికి మొత్తం అయిదేళ్లు పట్టింది. వంద ఎకరాలలో తీర్చిదిద్దిన ప్రాజెక్టు ఇది. రెండు వేల ఏళ్ల కాలాన్ని వందేళ్లకు ఓ భాగంగా ఇరవై విభాగాలుగా విభజించారు. ఆయా శతాబ్దాల్లో జరిగిన ప్రధానఘట్టాలను 5డీ టెక్నాలజీతో ఆవిష్కరించారు. వర్చువల్ టెక్నాలజీ వినియోగించడం వల్ల ఆ సమయంలో మనమూ అక్కడున్నామన్న భావన కలుగుతుంది. విదేశాల్లోని ప్రాచీన తెలుగు రాజ్యాలు ఇందులో మరో భాగం. మయన్మార్, థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా, శ్రీలంకలోని తెలుగు రాజ్యాల చారిత్రక ఆనవాళ్ల ప్రతిరూపాలను ఇక్కడ నిర్మించారు. ఆయా ప్రభుత్వాలు దీనికి కావలసిన సహకారాన్ని అందించాయి. దీనికోసం ఆ దేశాలన్నీ నాలుగైదు సార్లు పర్యటించాను. మయన్మార్ ష్వీడగాన్ పగోడా, థాయిలాండ్ వాట్ చామదేవి, వియత్నాం మిసన్ సిటీ, ఇండోనేషియా బొరబొదూర్, శ్రీలంక క్యాండి కోట ప్రతిరూపాలను ఈ ప్రాజెక్టులో నిర్మించడం విశేషం. యాభై అడుగుల ఎత్తులో 13వ శతాబ్దికి చెందిన మయన్మార్ రాజు 'మగాడు' శిల్పాన్ని థీమ్ పార్క్ ప్రవేశం వద్దనే ప్రతిష్టించారు. ఆ ఒక్క శిల్పం చాలు తెలుగు పౌరుషాన్ని రగల్చడానికి. విదేశాల్లో మన తాత ముత్తాతల, జేజెమ్మల ఘనకార్యాలను అందరికీ తెలిసేలా చేయాలన్న నా ఉద్దేశం నెరవేరింది. 'తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర థీమ్ పార్క్'లోని ఈ అద్భుతాల దగ్గర ఒక్క నిమిషమైనా ఆగితే మన పూర్వీకులకు నివాళులు అర్పించినట్టే.

❖ ❖ ❖

రాష్ట్రపతి చేతుల మీదుగా నేడు ప్రారంభోత్సవం. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్నే ముహూర్తంగా పెట్టాం. ఎంతో గొప్పరోజిది. ఇన్నేళ్లూ ఎన్నో ఆటుపోట్లకు లోనైన గుండె నేడు స్థిమితపడింది. నాగార్జునకొండలో కృష్ణమ్మ పరవళ్లు చూస్తూ మౌనంగా కూర్చున్నాను. లచ్చిమి, బాబు వచ్చారు.

'సూర్యా... పదేళ్ల నీ కల సాకారం అవుతోన్న రోజు. ప్రతి తెలుగువాడు గుండె మీద చేయి వేసుకుని గొప్పగా చెప్పుకునే థీమ్ పార్కుని నిర్మించావు. ఇది నీ రోజు.' అంటున్న లచ్చిమి మాటలకు



నాకళ్లనుండి ఆనందబాష్పాలు జలాజలారాలు పోతున్నాయి.

నన్ను హత్తుకొని నెమ్మదింపచేసింది. మనసు కాస్త కుదుటపడింది.

'అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు డాడీ' అంటున్న శ్రీవిజయ్ ని ఎత్తుకుని గాల్లో గిరగిరా తిప్పాను. వాడు నవ్వుతుంటే నేనూ ఆనందంతో ఊగిపోయాను.

'అక్కడ రాష్ట్రపతి గారు వచ్చేసుంటారు.' గుర్తుచేసింది లచ్చిమి.

ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీపర్వతానికి బయల్దేరాం. ముందుగా రాష్ట్రపతి బస చేసిన అతిథి గృహానికే వెళ్లాం.

ఎదురుగా సోఫాలో రాష్ట్రపతిగారు, ఆయన తమ్ముడు వీరనారాయణగారు కూర్చుని ఉన్నారు. ఎనభై వసంతాలు దాటిన వారి వదనాలు ప్రశాంతంగా కాంతులీనుతున్నాయి. లాల్చీ, పంచకట్టు, కండువా ధరించి తెలుగుదనానికి నిదర్శనంగా ఉన్నారు. సూర్యచంద్రులను పక్కపక్కనే చూసినట్టుగా అన్పిస్తోంది.

రాష్ట్రపతిగారు నన్ను చూడగానే.. 'రా సూర్యా, ఎవరూ చేయని ఘనకార్యాన్ని నువ్వు సాధించావ్. చాలా గట్టివాడివని నీ గురించే మాట్లాడుకుంటున్నాం'...

'మీరు తలుచుకోకపోతే ఇదంతా జరిగేది కాదు, అంతా మీ ఆశీర్వాదమేనండి' ఆయన కాళ్లకి నమస్కరించబోయాను. ఆయన వారిస్తూ నన్ను ఆప్యాయంగా హత్తుకున్నారు.

"సూర్యా నువ్వు నా మనవడిలాంటివాడివి. నీ తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర థీమ్ పార్క్ చూడగలుగుతానా అనుకొన్నాను. తెలుగుతల్లి ఈ ఘనకార్యాన్ని నా చేతుల మీదుగా జరిగాలని తలపెట్టింది"

'సమయం మించిపోతోంది, వెళదాం పదండి' వీరనారాయణగారు తొందరపెట్టారు.

మేం బయల్దేరాం. రాష్ట్రపతి కాన్వాయ్ ముందుగా సాగుతుంటే మా కారు వారిని అనుసరించింది.

సభాస్థలం దగ్గర జన సందోహం. విదేశాల నుంచి వచ్చిన వారు ఆయా దేశాల వారీగా కూర్చున్నారు. ముందు వరుసలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ వారి మంత్రిగణం. అతిథుల వరుసలో మా కుర్చీలు ఏర్పాటుచేశారు. నేనూ, లచ్చిమి, శ్రీవిజయ్ కూర్చున్నాం.

వేదికమీద మాత్రం రెండే ఆసనాలు వేశారు. రెండే ఎందుకో అర్థం కాలేదు.

భారత రాష్ట్రపతిని సభావేదిక మీదకి ఆహ్వానిస్తూ ప్రకటన చేశారు.

ఎంతో ఉత్సాహంగా వేదికకు చేరుకొని ఆశీనులయ్యారు సూర్యవర్మ, జగమునేలిన తెలుగు గ్రంథకర్త, తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర థీమ్ పార్క్ రూపకర్త ను సభావేదికమీదకి ఆహ్వానిస్తున్నాం అని మైకులో పిలుపు వినిపించింది. కరతాళధ్వనుల మధ్య ఎంతో ఆనందంగా వేదికను చేరుకున్నా.

రాష్ట్రపతిగారి దగ్గరకి వెళ్లి నిలుచున్నా. ఆయన ఓ ఆసనం మీద నన్ను కూర్చోబెట్టి పోచంపల్లి ఇక్కత్ శాలువా కప్పారు. బొబ్బిలి వీణను అందించారు.

ఆయన నా మీద కురిపిస్తున్న అభిమానానికి కళ్లు చెమర్చుతున్నాయి.

రాష్ట్రపతి గారు సందేశం ఇవ్వడంమొదలుపెట్టారు.

'అందరికీ అభినందనలు. నా కళ్లెదురుగా ఉన్న జనసంద్రాన్ని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. కాలేజీ రోజుల నాటి ఉత్సాహం ఉరకలేస్తోంది.

మిమ్మల్నందరినీ శ్రీపర్వత లోయలో చూడడం కన్నుల పండుగగా ఉంది. సరిగ్గా రెండు వేల ఏళ్ల నాడు శ్రీలంక, కాశ్మీరం, గాంధారం, చీనా, చిలాట, తోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన తదితర దేశాల నుంచి పరివ్రాజకులు, భిక్కులు, విద్యార్థులు ఇక్కడికి వచ్చి బౌద్ధజైనాలు, వైద్యం, రసాయనం, న్యాయం, లలితకళలు అధ్యయనం చేసేవారు. ఇక్కడ ఏకకాలంలో వెయ్యి మంది విద్యార్థులు బస చేసేలా భోజనం, వసతి ఉండేదట. రెండు వేల ఏళ్ల నాడు ఇక్కడి పరిస్థితి అది. ఇప్పుడు మిమ్మల్నంతా చూస్తుంటే ఆనాడు ఈ నేల మీదున్న వైభవాన్ని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతోంది.

ఎన్ని యుగాలు గడిచినవో, ఎన్ని తరాలు నడిచినవో, ఎన్ని నాగరికతలు వర్ధిల్లినవో, ఎన్ని తరాలు అవతరించినవో, ఎందరు రాజులు అంతరించిరో. ఎన్ని పతనోన్నతాలో, ఎంత జీవితమో..... ఇక్కడే మానవులు మనుగడ కోసం పోరాడింది... జంతువులతో, ప్రకృతితో సహజీవనం, సంఘర్షణ... నార వస్త్రాల నుంచి నాగరక వస్త్రాల దాకా మానవ సంస్కృతి ప్రయాణించిందీ ఈ నేలపైనే. ఇక్కడే మనుషులు ఆహారం కోసం అస్తిత్వం కోసం ఆయుధాలు సృష్టించింది. కొండ కోనల మధ్య మహారణ్యాల మధ్య రాజులు రాజ్యాలు మహానగరాలు, మహోత్పాతాలు జరిగిపోయాయి. సకల విశ్వాసాలు, మతాలు, భావోద్వేగాలు జనించి గతించి తరించింది ఈ గడ్డపైనే. జాతి గుర్రాలు యద్ధభూమిలో కదను తొక్కింది ఇక్కడే. మదపుటేనుగుల ఘీంకార ధ్వనుల్లో సైన్యాలు నలిగిపోయిందీ ఈ సీమలోనే. ఇక్కడే ఎన్నో పరాజయాలు. ఇక్కడే ఎన్నో జైత్రయాత్రలు... ఇక్కడి నుంచే ఎక్కడెక్కడికో దండయాత్రలు.

వింధ్యకు ఈవల ఇదే వైభవోజ్వల జీవన రంగస్థలం. ఇదే సుసంపన్న రాజ్యాలకు ఆలవాలం. ఇదే పసిడి రాసులకు ప్రసిద్ధి చెందిన దక్షిణాపథం. పరాయిమూకలకు ఇదే యుద్ధభూమి. ఎన్ని జాతుల రక్తం ఏరులై పారిందో.... పరాజిత తెలుగు బిడ్డలు నౌకల్లో నదీలోయల్లో దూరదూర తీరాలకు సాగిపోయింది ఇక్కడి నుంచే. తెలుగుజాతి ముద్దు బిడ్డలు నదులు దాటి సముద్రాలు దాటి ఏ ఒడ్డుకు చేరితే అక్కడ ఒక నాగరికత వెలసింది. అక్కడ ఒక రాజ్యం అవతరించింది. అక్కడ మన సంస్కృతి విలసిల్లింది. బర్మా ఒక్కలప్ప, మగాడు, థాయి చామదేవి, వియత్నాం భద్రవర్మ, ఇండోనేషియా సన్న రాజు, శ్రీలంకలో వెంకట రంగమ్మ అలనాటి వైభవానికి గట్టి చిహ్నాలుగా నేటికీ నిలిచిపోయారు.

తెలుగు నేలపై నాగరికత ఎప్పుడు పుట్టిందో ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఈ గర్భంలో ఎన్ని చరిత్ర సమాధులున్నాయో? ఈ నేల ఎంత విధ్వంసాన్ని చూసిందో? ప్రతి రాజూ గత రాజు చరిత్రను తుడిపేసే ప్రయత్నం చేశాడు. శత్రు శేషం శాసనాల్లో కూడా కనిపించకుండా చేశారు. హరోం హరా అంటూ శైవం, వీరశైవం తెలుగు నేల దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించిన కాలమూ ఉంది. జైనం వర్ధిల్లిన నేల కూడా మనదే. బుద్ధం శరణం గచ్ఛామి అని అడుగడుగునా శాంతి బోధ చేసిన కాలమూ ఉంది. ఎన్ని వాదాలు, ఎన్ని తర్కాలు, ఎన్ని భావజాలాలు ఇక్కడ ఫలించి పుష్పించి మహా వృక్షాలుగా విస్తరించాయో....' ఓ క్షణం ఆగి కళ్లద్దాలు సరిచేసుకున్నారు.

'రెండు వేల ఏళ్ల నాడే తెలుగుజాతి ఎంతో కీర్తిని మూటకట్టుకుంది. రోమ్‌తో వ్యాపారం చేసింది. అందుకే ఎక్కడా దొరకనన్ని రోమన్ బంగారు నాణేలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బయటపడ్డాయి. భరతజాతి కీర్తిశౌర్యాలను అశోకుడితో ప్రారంభిస్తారు. కానీ కోటిలింగాల రాజులు అశోకుడే కాదు మరే ఇతర రాజూ చేయని సాహసం చేశారు. నాణేలపై తమ పేరును రాసుకుని నేటికీ చిరంజీవులుగా మిగిలారు. చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి సమయంలో శాతవాహన సామ్రాజ్యానికి ఉత్తరాన రాజస్థాన్ నుంచి దక్షిణాన మైసూరు వరకు, తూర్పున బంగాళాఖాతం నుంచి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు సరిహద్దులుగా ఉండేవి. మా గుర్రాలు మూడు సముద్రాల నీళ్లు తాగాయని గర్వంగా చాటుకున్న చక్రవర్తులు శాతవాహనులు. గుంటుపల్లి గుహాలయాలు దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి గుహాలయాలు. తెలుగుజాతి విశిష్టసృష్టి అమరావతి శిల్పం. దేశవిదేశాలకు వ్యాప్తిచెందింది. అజంతా తొలినాటి గుహ చిత్రాలూ మనవే. రెండో బుద్ధుడిగా ప్రసిద్ధి చెందినవాడు ఆచార్య నాగార్జునుడు ఈ నేల మీద పుట్టినవాడే. జెన్ బుద్ధిజం సృష్టికర్త బోధిధర్ముడూ తెలుగు వాడే' అంటూ రాష్ట్రపతి కాసేపు ఆగారు. ఏదో ఆలోచిస్తున్నట్టు సుదూరంగా చూసి, మళ్లీ ప్రసంగించడం ప్రారంభించారు.

'తెలుగు లిపి ప్రత్యేకత తలకట్టు. ఇక్కడి వేంగి లిపే ఆగ్నేయాసియా దేశాలన్నిటికీ వ్యాప్తిచెంది ఆయా దేశాలలోని నుడులకు లిపిని అందించింది. కాకతీయుల కాలంలో తెలుగు లిపి, కన్నడ లిపి విడిపోయాయి. దేశభాషలందు తెలుగు లెస్స అంటూ ఎలుగెత్తి చాటాడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు. ఆయన కాలంలో పాలనాభాషగా తెలుగు దక్షిణ భారతదేశం అంతా వ్యాపించింది. కర్నాటక సంగీతానికి తెలుగు వారి గొప్ప కానుక తెలుగు భాషే. తెలుగు వాగ్గేయకారులలో ఉన్నతోన్నతుడు అన్నమయ్య. పరిమాణంలోనే కాదు వైవిధ్యంలోనూ అన్నమయ్య రచనలు సాటిలేనివి. కర్నాటక సంగీతం అనగానే ముందుగా గుర్తుకువచ్చే పేరు త్యాగయ్య. కర్ణాటక సంగీతానికి త్యాగయ్య రచనలు పర్యాయపదాలయ్యాయి. నాట్యానికే నడకలు నేర్పింది ఆంధ్రనాట్యం, కూచిపూడి, భరతనాట్యం. తమిళుల మహాకవి సుబ్రమణ్యభారతి తెలుగును ప్రశంసిస్తూ 'సింధూ నదిలో పడవలో

ప్రయాణం చేస్తూ సుందర తెలుగు పాటపాడుకోవాలం'టూ పద్యాం రాశాడు. తెలుగోడి గొప్పతనానికి 16 వ శతాబ్దిలోనే సంస్కృత పండితుడు అప్పయ్య దీక్షితులు కీర్తిస్తూ వందల ఏళ్లు తపస్సు చేస్తే గానీ తెలుగు వాడిగా పుట్టడం సంభవించదు. అని లోకానికి చాటిచెప్పారు. ప్రఖ్యాత బెంగాలీ రచయిత శరత్ చంద్ర తన నవలలో నాయికను అందమైన ఆంధ్ర చీరకట్టులో ఉందని అభివర్ణించారు. ఇలా ఎంతో మందిని తెలుగు భాష, సంస్కృతి ఆకట్టుకున్నాయి.' కాసేపు ఆగి పక్కనే ఉన్న గాజుగ్లాసులోని నీళ్లు తాగారు.

'కులం, మతం, భాషా, ప్రాంతం, వర్గం, లింగ, వయోభేదాలతో నిమిత్తం లేకుండా నూటా యాభై కోట్ల భారతీయుల నరనరాల్లో ఉద్వేగాన్ని నింపే ఒకే ఒక్క బంధం... త్రివర్ణ పతాకం. భారతీయుడి అండా దండా అయిన ఈ జెండాను రూపొందించింది తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య....'

'ఈ కన్నుల ముందే భారతావని స్వాతంత్ర్యం పొందింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది... తొలి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది... కొన్నేళ్ల తరవాత పాలన అవసరాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలుగా రెండు రాష్ట్రాలుగా విడిపడ్డాయి. ఈ రెండు రాష్ట్రాలలోనే కాదు దేశమంతా ఇతర రాష్ట్రాలలోనూ విదేశాల్లోనూ అసంఖ్యాకంగా విస్తరించి ఉన్నారు తెలుగువారు. వీరంతా తమ ప్రతిభతో ముందుకు వెళుతున్నారు. ప్రపంచ జాతులతో కలిసి భరతజాతి కీర్తిని ఇనుమడింపచేస్తున్నారు.

అమ్మని, అమ్మనుడిని, అమ్మనాడుని, ఎప్పుడూ మీరు ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్నా మరవకండి. జాతి నిండు గౌరవాన్ని నిలపండి. పిల్లలకి తెలుగు నేర్పించండి. భావితరాలకు తెలుగు సిరులు అందించండి. తెలుగువాళ్లు ఎక్కడున్నా సరే ఎప్పుడైనా సరే తమ జీవితంలో ఒకసారైనా ఈ 'తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర' థీమ్ పార్క్ ని దర్శించుకోండి. మీ పిల్లలనీ ఇక్కడికి తీసుకురండి. దేశవిదేశాల్లో మనం సాధించిన ఘనకార్యాలను వాళ్లకు అర్థం అయ్యేలా చేయండి. తెలుగునుడి ఔన్నత్యాన్ని తెలియజేయండి. గతం కాదు నాస్తి... అది అనుభవాల ఆస్తి. ప్రతి జాతీ ఇటువంటి ఓ థీమ్ పార్కు ను రూపొందించుకొని భావితరాలకు తమ చరిత్రను కళ్లారా తెలిపే ప్రయత్నం చేయాలి. ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటివి త్వరలో చేబడతాయని ఆశిస్తున్నాను.

ఏదో కల కదా అని విడిచిపెట్టకుండా సూర్యవర్మ తను చూసిన ప్రదేశాలన్నిటి గురించి పరిశోధన చేసి జాతికి గర్వకారణమైన థీమ్ పార్కును రూపొందించాడు. అతడిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

జాతీయ గీతాలాపనతో గంభీరంగా ఆ చరిత్రాత్మక సభముగిసింది. (పూర్తి అయింది)

ఈ రచన పుస్తకంగా త్వరలో వెలువడనుంది. కావలసిన వారు 'అమ్మనుడి' ప్రచురణకర్తను సంప్రదించగోరుతున్నాము.

పాట

## అక్షరాన్ని నేను

**పల్లవి:**

అమ్మ పాడిన - పాటయ్యాను
ఆయ్య నేర్పిన - మాటయ్యాను
నీ భావానికి - భాషనయ్యాను
నీ భవితకు - బాటయ్యాను

అక్షరాన్ని నేను - తెలుగు అక్షరాన్ని నేను
యాభై ఆరక్షరాల - వెలుగు రేఖను నేను

**చరణం:**

1. పలకరించే - మనసయ్యాను
కలవరించే - ప్రేమయ్యాను

కలుసుకునే - బంధమయ్యాను
తెలుసుకునే - తెలివినయ్యాను

అక్షరయాత్రలో ఆశను నేను
ఆశయసాధనలో ఆకృతి నేను

అందర్నీ కలిపే - స్నేహం నేను
కలకాలం కదిలే - కాంతిని నేను

స్వాతంత్ర్యసమర - నినాదమయ్యాను
సాయుధ పోరాట - బావుటనయ్యాను

ప్రజాకళల గుండె చప్పుడయ్యాను
బహుజన హితంగా భాసిల్లాను ॥"అమ్మ పాడిన"॥

2. తూర్పున ఎగిసే - సూర్యుణ్ని నేను
పడమర చూసే - చంద్రుణ్ని నేను

అవినీతికి - సింహస్వప్నమయ్యాను
అన్యాయ్యాన్నెదిరించే - ఆయుధాన్నయ్యాను

పదాలతో పల్లవించే - భాష్యం నేను
పద్య, గద్య, స్వర - భాగ్యం నేను
భాషాభేదం లేని - ఘన చరితను నేను
అవధుల్లేని - విశ్వ విఖ్యాతిని నేను

ఏ దేశమేగినా - ఎందు కాలిడినా
అందునిలిచే - నవభారతిని నేను

తెలుగువారి - జానపదాన్ని నేను
జగమెరిగిన - జన తథాన్ని నేను
'దేశభాషలందు' - లెస్సనయ్యాను
మా తెలుగుతల్లికి - మెల్లెపూదండనయ్యాను
॥"అమ్మ పాడిన"॥

**-బి. గోవర్ధన రావు**
9441968930

"ఒక బిడ్డ మాతృభాషలో ఒక సంవత్సరంలో నేర్చుకునే విద్యను పరాయి భాషలో నేర్చుకోవడానికి నాలుగేళ్ళు పడుతుంది" **-విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్**

## పుస్తక సమీక్ష రామోజీరావుఎక్స్‌రే!




**రామోజీరావు ఉన్నదిఉన్నట్టు**
వెల : రు. 300/-
రచయిత:
గోవిందరాజు చక్రధర్
ప్రచురణ :
మీడియాహౌస్ పబ్లికేషన్స్
ప్రతులకు:నవోదయబుక్‌హౌస్
హైదరాబాదు. లేదా-
మీడియాహౌస్‌పబ్లికేషన్స్:
98498 70250 కు
గూగుల్‌పే/ ఫోన్‌పే
ద్వారా రూ.300
పంపించి
తెప్పించుకోవచ్చు

**మ**నకు బాగా తెలిసిన వారిదే అయినా ఎక్స్‌రే అనగానే ఎలా ఉందో ఏముందో చూడాలనిపిస్తుంది. సాధారణ చూపుకు అందని లోలోపలి భాగాలను సైతం ఎక్స్‌రే పట్టి చూపుతుంది. అందుకే ఫొటో కన్నా ఎక్స్‌రే ఎక్కువ ఆసక్తి కలిగిస్తుంది.

'రామోజీ రావు ఉన్నది ఉన్నట్టు' అన్న శీర్షికే ఈ రచన రామోజీ రావు జీవితం గురించిన ఎక్స్‌రే అని చెప్పకనే చెపుతోంది, పాఠకుడిలో ఆసక్తిని కలిగిస్తున్నది. ఇవాళ్టి యువతకు రామోజీరావు పేరు మాత్రమే తెలిసి ఉండవచ్చు కానీ 40, 50 ఏళ్ల వయసు పైబడిన తెలుగు వారందరికీ రామోజీ రావు గురించి క్రొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదనిపిస్తుంది. ప్రియా పచ్చళ్లు, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ఈనాడు పత్రిక, ప్రతిఘటన, శ్రీవారికి ప్రేమలేఖ లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలు నిర్మించిన ఉషాకిరణ్ మూవీస్, తెలుగుదేశం పార్టీతో, యన్‌టిఆర్‌తో, చంద్రబాబునాయుడుతో రామోజీ సంబంధం, ఈటివి, రామోజీ ఫిల్మ్ సిటీ ఇలా రామోజీరావు, ఆయన వర్తక వాణిజ్యాలు, రాజకీయాలు గురించి వాటిల్లో ఆయన పోకడలు గురించి అంతో ఇంతో తెలియని తెలుగు వారు లేరు అనడం అతిశయోక్తి కాదు. ఇలా అందరికీ తెలిసిన విషయాన్ని రాసి, అందరితో చదివించాలి. నిజమని ఒప్పించాలి. నిజంగా ఇది కఠిన కార్యమే. తెలుగు రాజకీయాల్లోను, జర్నలిజంలోను రామోజీరావు నిర్వహించిన పాత్రపట్ల ప్రశంసలు, విమర్శలు రెండూ ఉన్నాయి. ప్రశంసలకే ప్రాధాన్యత ఇస్తూ రాస్తే అది పొగడ్తల కవిత్వమై రామోజీ, ఆయన బంధుమిత్రులకే పరిమితమవుతుంది. పూర్తిగా విమర్శలకే ప్రాధాన్యత ఇస్తే అది తిట్టు కవితలా రామోజీ వ్యతిరేకులకు మాత్రమే పరిమితమవుతుంది. కనుక ఏ ఒక్క కోణంలో రామోజీ గురించి రాసినా అది 'ఉన్నది ఉన్నట్టు' కాజాలదు. రాసిన వాటికి తగిన సాక్ష్యాధారాలు లేకుండా రాస్తే అస్సలు విలువే ఉండదు. కనుక ఉన్నది ఉన్నట్టు రాయాలి, రాసిన దాన్ని పాఠకుడితో పూర్తిగా ఇష్టపడి చదివించాలి. ఇది మరింత కష్టం. సాధారణ జర్నలిస్టుగా పత్రికారంగ ప్రస్తానం ప్రారంభించి, జర్నలిజం కళాశాలకు ప్రిన్సిపాల్ గా పనిచేసిన గోవిందరాజు చక్రధర్ అనుభవం ఆయన ఎంచుకున్న కఠిన కార్యాన్ని సులభతరం చేసింది. అందుకే షడ్రసోపేతమైన విందు భోజనం లాంటి ఈరచనను ఎలా చదివి ఆస్వాదించాలో విషయ సూచిక స్థానంలో ఇలా చదవండి., అంటూ ప్రణాళికను కూడా అందించారు. దాన్ని చూసి పాఠకుడు తన అభిరుచికి తగిన అంశాన్ని ఎంచుకుని పుస్తకాన్ని చదవడం మొదలెట్టి పూర్తి చేయవచ్చు.

రామోజీరావుకు యన్‌టిఆర్‌తో సన్నిహిత సంబంధం ఉందని, ఈనాడు వల్లే యన్టీఆర్ అధికారంలోకి వచ్చారని అందరూ అనుకుంటారు. అలాంటి యన్‌టిఆర్‌తో రామోజీకి ఎందుకు చెడింది, రామోజీ చంద్రబాబును ఎందుకు చేరదీశారు? రాష్ట్ర ప్రయోజనాలా, రామోజీ ప్రయోజనాలా? ప్రముఖ పత్రికా రచయిత, ఈనాడు తొలినాటి సంపాదకులు ఎబికె ప్రసాద్ వెల్లడించిన సత్యాలను పేజి 261లో పెయిడ్ జర్నలిజానికి రామోజీ శ్రీకారం శీర్షికన చూడవచ్చు.

యన్‌టిఆర్‌ని పదవీచ్యుతుణ్ణి చేసిన కుట్రకు హైదరాబాద్‌లోని వైస్రాయ్ హోటల్ కేంద్రబిందువు అయిందని అందరూ అనుకుంటారు. నిజానికి యన్టీఆర్‌ను గద్దె దింపాలనే కుట్రకు విశాఖలోని డాల్ఫిన్ హోటల్‌లో రామోజీ చంద్రబాబులు శ్రీకారం చుట్టారనే సత్యాన్ని 244వ పేజీలో వెన్నుపోటు కుట్రకు విశాఖలోనే నాంది అనే శీర్షికన రామోజీ ఆప్తుడు, డాల్ఫిన్ హోటల్స్ పూర్వ యండి అప్పారావు అంతరంగంలో చూడవచ్చు.

వ్యాపార దక్షత, ఎత్తులు, జిత్తులు కారణంగానే పచ్చళ్ల వ్యాపారం నుండి చీటీల దాకా పత్రికల నుండి ఫిల్మ్‌సిటీ దాకా రామోజీరావు ఎదిగారని కొంతమంది అక్కసుతో, అసూయతో వ్యాఖ్యానిస్తుంటారు. నిజానిజాలు 'రామోజీ విజయం వెనుక' శీర్షికన పేజి 59లో తెలుస్తాయి. తప్పులను దిద్దుకునే ఓరిమి, ముక్కుసూటితనం, రాజీలేని మనస్తత్వం, అసమాన జ్ఞాపకశక్తి, ధారణ, పర్ఫెక్షన్ పట్ల పట్టుదల, వివేచనాత్మక విశ్లేషణ సామర్థ్యాలతో కూడిన ఆయన విలక్షణ వ్యక్తిత్వం, ఆర్థిక క్రమశిక్షణ ఆయన విజయాలకు అసలు కారణం అని రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణ, రావూరి భరద్వాజ, ఈనాడు డైరెక్టర్ ఐ.వెంకట్ వంటి ప్రముఖుల అభిప్రాయాల సారం. ప్రజాజీవితంలోని వ్యక్తుల అవినీతి, అక్రమాలను ఈనాడు పత్రిక, ఈటీవీలు వేదికగా ఉతికి పారేయిస్తున్న రామోజీరావు ఆచరణ సొంత విషయాల్లో ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలం తెలుగు వారికి సహజం. ఎడిటర్ పై రామోజీ రూ. కోటి దావా శీర్షికన 315 పేజిలోని కథనం కొంత సందేహ నివృత్తి చేయగలదు. ప్రతిష్ఠాత్మకమైన రామోజీ ఫిల్మ్ సిటీ కోసం గ్రామకంఠాలు, ఎసైన్డ్ భూములు, సమరయోధుల భూములను సైతం అక్రమంగా ఆరగించి, రెండు గ్రామాల మధ్య రోడ్డును కూడా కబ్జా చేశారని దస్తావేజులతో సహా లభించిన సాక్ష్యాధారాలను బట్టి నిజాన్ని నిర్ధారించుకున్న తరువాతే ఆంధ్రభూమి సంపాదకులు యం.వి.ఆర్. శాస్త్రి దీనికి సంబంధించిన వార్తను ప్రచురించారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటి? అని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును మీడియా ప్రశ్నిస్తే అది ప్రయివేటు భూమి అక్కడ నిర్మాణాలు చేపడితే తప్పేమిటి? అని ఎదురు దాడి చేశారాయన. అసత్యాలు ప్రచురించి తన పరువు తీశారంటూ ఆంధ్రభూమి యజమానులకు, సంపాదకులకు నోటీసులు ఇచ్చిన రామోజీ కోటి రూపాయలకు కోర్టులో పరువు నష్టం దావా వేసి, కోర్టుకు వచ్చి ఓ సారి సాక్ష్యం కూడా చెప్పారు.కానీ ఆతరువాత దాన్ని పట్టించుకోలేదు.

పట్టిన పట్టు విడవకుండా ప్రతి విషయంలోనూ చివరిదాకా పోరాడే రామోజీ పరువు నష్టం కేసును మధ్యలోనే ఎందుకు వదిలేశారో! రామోజీ అక్రమాలకు సంబంధించి మరో ఆసక్తికరమైన ఆరోపణ మార్గదర్శి అక్రమాలు. నాటి రాజమండ్రి యంపి ఉండవల్లి అరుణకుమార్ ఫిర్యాదుతో రామోజీ ఆర్థిక నేరంగా 2006లో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో సుమారు ఐదు వేల కోట్ల జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి నంత పెద్ద కేసులో రామోజీ రావు ఇరుక్కున్నాడంటే నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర రెడ్డితో సహా ఎవరూ నమ్మలేకపోయారు. కోర్టులు నమ్మాయి. అందుకే స్టే ఇవ్వడానికి కూడా నిరాకరించాయి. ఇప్పటికీ ముగియని ఆసక్తికరమైన ఈకేసు 'మార్గదర్శి వివాదంతో మరోసారి చర్చకు' శీర్షికన 289వ పేజిలో చూడవచ్చు.

ఐదు దశాబ్దాల తెలుగు రాజకీయాలు, పత్రికలు, తెలుగు దేశం పార్టీ, యన్‌టిఆర్ రాజకీయ ఉత్థాన పతనాలు, చంద్రబాబు, రామోజీల పాత్ర, ప్రయోజనాలు పండించుకున్న వైనం ఇలా వివిధ చారిత్రిక అంశాలకు సంబంధించి సాధికారిక గ్రంథం, విజ్ఞాన భాండాగారం అనదగిన పుస్తకం ఇది. తెలుగు నేలకు చెందిన రాజకీయ, పత్రికా రంగాల పరిణామాలు, పరస్పర బంధాలు, ప్రయోజనాలు తదితర అంశాలపైన ఆసక్తి కలిగిన పాఠకులు, విశేష కథనాలు వండి వార్చాలి అనుకునే రచయితలు, రాజకీయ జీవులు, పరిశోధన పత్రాలు సమర్పించాలని అనుకునే నేటి తరం పిహెచ్.డి విద్యార్థులు, రేపటి తరానికి అందించాలని భావించే గ్రంథాలయాల వారు అందరూ కొని భద్రపరచుకోతగిన విలువైన పుస్తకం. 'రామోజీరావు ఉన్నది ఉన్నట్టు.'

శివరాంప్రసాద్

సెల్ : 94404 58297

కవిత

## కాలపేటిక

దశాబ్దాలుగా
గోడకు వేలాడుతుంది.
కాలాన్ని ఖండఖండాలుగా
కత్తిరించే కళాఖండమది.
దాని అంకెల మీద
ఎక్కుతూ దిగుతూ
జీవయాత్ర సాగిస్తున్న వాణ్ని నేను.

ఓ రోజు దానితో
ఇలా ముచ్చటించాను.
'గడియారమా!
సూర్యుని తర్వాత
నువ్వే నా కర్మసాక్షివి.
జీవితంలో
నా మూడు దశలను చూస్తున్నావు.
ఇవాళ అనుభవాల బరువును
నీ ముందు కాస్త విప్పుతాను.

నా చుట్టూ జ్ఞాపకాలున్నాయి
అంటే వాటి తాలూకు
వస్తువులు లేనట్టే కద!
ఎక్కడి నుంచో ఎగిరొచ్చి
అవి నా పక్కన కూర్చున్నా
గుర్తుపట్టడం కష్టం!
లీలగా కొన్ని గుర్తున్నా
ఊగుతున్న నీ పెండ్యూలం
డస్టర్‌గా మారి
తుడిచివేస్తున్నట్టుగా స్ఫురణ.

ఇవాళటి దశ
నిన్నటి ఆవరణను కబళించినప్పుడల్లా
నా అపురూప వస్తుజాలం అదృశ్యమై
నేను కాస్తకాస్త మరణిస్తున్న భావన.

పసితనంలోని
పిన్నులూ గోలీలూ శంఖులూ
చింతగింజలూ నెమలీకలూ
పుస్తకంలోని పుటల మధ్య
అతుక్కుపోయిన పువ్వులూ
అలనాటి భేతాళకథలను
ఏ రాక్షసుడు ఎత్తుకపోయాడో!

యౌవనంలో అందుకున్న
ఉత్తరాల్లోని ముగ్ధాక్షర పంక్తుల్లో
ఆమె ముఖరేఖాచిత్రం మెరిసిపోతోంది.
టోపీ, మఫ్లర్, గరం బనీన్
ఎక్కడికి ఆవిరైపొయ్యాయో తెలియదు.
అట్లాసులోని సరిహద్దులు
ఎట్లా వుండేవి!
ఇప్పుడు మా ఊరు ఊరిలో లేదు.
చేజారిన వస్తువుల గురించి చెప్పాలంటే
చాంతాడంత జాబితా అవుతుంది.

ముఖ్యంగా నా మాతృభాష
సృష్టిలోనే
సుందరమైన విన్యాసాల్తో
వెలిగే అక్షరాలు
తీయదనమంతా కూరిన
మాటల మాధుర్యాలను
ఏ దొంగలు దోచుకుపోతున్నారో!

ఈ సుదీర్ఘయానంలో
నేను పొందినదెంత
పోగొట్టుకున్నదెంత
లాభనష్టాలను
బేరీజు వెయ్యడానికి
నీకు తెలుసు
నేను లెక్కల్లో వీక్!

వర్తమానం
గతాన్ని రద్దు చేస్తుందా
భవిష్యకాంతుల్లో
అన్నీ వెలిసి పోతున్నాయా
సకలం కలిసిమెలిసి
కాపురం చేసే స్వప్నం వొట్టి కలేనా!
ఓ నా టిక్‌టిక్‌ల రాణీ
ఇప్పుడు నేనే
ఓ యాంటిక్‌నై పోతున్నా.'

వింటూనే
గడియారం పన్నెండు గంటలు కొట్టింది
ఆ సంగీతంలో
కొత్తర్థాలు వెతుకుతున్నాన్నేను.

డా॥ ఎన్. గోపి

93910 28496

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

సమీక్ష

# వేణుగాన పరవశము



**వేణూనాదం**
రచన :
డా. నాగసూరి
వేణుగోపాల్
ఫోన్:94407 32392
పుటలు: 240,
వెల :200/-
ప్రతులకు :
నవోదయ బుక్ హౌస్,
హైదరాబాదు-27
ఫోన్ :
040 - 24652387

**క**లలో వేణువు విని, వేణువులో విరహ మధుర వేదన విని, విరహమధుర వేదనలో ప్రణయతత్వ వేదము వినిపించిన వారు డా. భుజంగరాయ శర్మ. అలాకాక యిప్పుడు వేణుగాన ధ్వని ముద్రికల్ని భద్రపరిచి మనకు మైత్రీ మధురంగా, ఉద్యోగ విరమణ కానుకగా అందిస్తున్నవారు ఆరుపదుల వయసులో, అరవై పుస్తకాల సృజనకర్తగా డా. నాగసూరి వేణుగోపాల్.

ఉద్యోగపు హడావిళ్ళలోంచి ప్రశాంతతను వెతుక్కుంటూ తీర్చి దిద్దిన ముద్రలు చిత్రాచిత్రంగా వేణునాద సుధలయ్యాయి. సంస్కృతిని వారసత్వంగా పొందేందుకు వర్తమానానికీ భవిష్యత్తుకూ ఈ వేణుగానం వారధి కాగలదు. తిండికి తిప్పలు పడే పరిస్థితిని దాటుకొని విలువల విషయంలో ఉన్నతంగా నిలచిన ఒక కళాత్మక హృదయజీవి జీవనరాగం మనకు ఒక ఆలాపనగా విన్పిస్తుంది.

స్థాన చలనం వల్ల కొత్త పరిచయాలు, కొంగ్రొత్త అనుభవాలు అక్షరాల్లో ఒదిగి సొగసులీనుతాయని పత్రికల వారు ఊహించారు కాని అది వేణుగానమై అలరారుతుందని అప్పటికి వారికి ఊహకందని విషయమే. పైగా అది స్వేచ్ఛాగానం. ఆ వేణుగానం హంసధ్వని రాగంతో గడుసుదనం నేర్పిందట! బదిలీ-మజిలీలలోని మజాను జుర్రుకుంటూ, మైత్రీ సుగంధాలను వెదజల్లుతూ, "ఎందరో మహానుభావులు... అందరికీ వందనములు" అంటూ పలవరించిన వాడు ఈ వేణుగాన లోలుడు.

"కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం, దాపరికం లేకుండా ప్రవర్తించటం, గొప్ప కామన్‌సెన్స్ నుంచి ప్రెజెన్స్ ఆఫ్ మైండ్, కష్టపడి పని చేయడం, పరుల సొమ్ముకు ఆశించకపోవటం వంటివన్నీ వంశానుగతంగా సంక్రమించిన గుణాలు. గుడిలేకపోయినా బడి వున్న ఊళ్ళో పుట్టిన పుటక ఆయనది. ఆయనలోని భావాలు, ఆయనపై ప్రభావాలు అన్నీ కలగలిసి రకరకాల ముద్రలుగ మురిపించాయి. ఎక్కడ కొనతట్టుపల్లి... ఎక్కడి గోవా...!"

ఈ భావుకునికి సుంకేసరి పూలు చూస్తే స్కూలు గుర్తుకొస్తుంది; కొండను చూస్తే ఫిజిక్స్ గుర్తుకొస్తుంది; గుర్తుకురావూ మరి.... చిన్న నాటనే కరెంట్ ఎఫైర్స్ పద్యాల్లో చదువుకొన్నవాడు కదా; అయినా తరువాత వచనం మెరుగనుకొన్న మొనగాడు కదా! జానకి రామారావు సారు ఈయనకు దారిదీపమైతే... ఈయన ఎందరెందరికి దారిదీపమయ్యాడో...

నాగసూరి నార్ల లోకంపోవడను బాగా తలకెక్కించుకున్నాడు. పై బెర్తు నుంచి ప్రబోధాలు విన్నాడు. హోసూరు నరసింహయ్యలోని సమరశీలతను పుణికి పుచ్చుకున్నాడు. ప్రవహించే పాటల్లో నుండి గుర్తొచ్చే జ్ఞాపకాలను మధురాతి మధురంగా గానం చేశాడు. అందులో నవ్వుల వెల్లువలున్నాయి; ఎడతెగని జ్ఞాపకాలున్నాయి; సైన్సు దాహం తీర్చుకున్న దాఖలాలున్నాయి; పరిశోధనలవైపు పరుగులున్నాయి. అక్కడ వర్ణ సమ్మేళనాలు గళం విప్పటం చూస్తాం; రాగాన్ని కళ్ళకు కట్టించటం, చెవులకు పట్టించటం ఉంటుంది; వచనోల్లాసాలుంటాయి; వయస్సు మీదపడినా తెలుసుకోవాలనే తపన తరగని వారు కన్పిస్తారు; తొలి చూపులోనే మదరాసు తొంగి చూచిన విధం కన్పిస్తుంది; సంగీతోత్సవాలుంటాయి; కోతికొమ్మచ్చి మిఠాయిపొట్లాలుంటాయి; జర్నలిజం చిక్కుముడులు విప్పుకోవటాలు ఉంటాయి; జర్నలిజం చిక్కుముడులు విప్పుకోవటాలు ఉంటాయి; అందుకోగల్గిన వారికి అందుకోగల్గినంత ముడిసరుకు లభిస్తుంది.

పుస్తకం అంతటా నీరక్షీర న్యాయమే; హంస గమనమే; బహుజన హితమే; మన్ననలే. చివరకు "మళ్ళీ కలుద్దాం" అనే మంచిమాటతో ఈ గానానికి దంపతుల యింపైన ముక్తాయింపు!

-రావెల సాంబశివరావు
సెల్ : 99590 89630

కవిత

## భావ విప్లవం

తెలుగెంతో తీయనిదని దేనికండి ప్రగల్భం
మాతృభాష మనుగడకై తప్పదు ఇక విప్లవం ॥తెలుగెంతో॥

కమ్మనైన అమ్మనైన మమ్మీ అని పిలవాలను
తల్లిని నిలదీయు శక్తి పిల్లలలో కలగాలని
ఆంగ్లంలో చదువొకటే అపురూపం అని చెప్పే
తండ్రిని ఎదురించు యుక్తి బిడ్డలలో రావాలని ॥తెలు॥

జరుగుతున్న సభలన్నీ సంకరమవుతూవుంటే
అడ్డు పెట్టి ఆపు బలం సభికులలో పెరగాలని
ప్రతినోట ప్రతిచోట ప్రతిమాట తెలుగైతే
అదే భావ విప్లవం...అదే భాష పల్లవం ॥తెలు॥

-మేడా మస్తాన్‌రెడ్డి
9441968930

**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**

పనికొచ్చేకథ

# అందరినీ అలరించే మంత్రమా?

సుబ్బన్న, పేద పండితుడు. ఊళ్ళో ఇంటింటికీ తిరిగి అందరినీ పొగుడుతాడు. మగ వాళ్ళని అయితే, "నువ్వు ఇంద్రుడివి, చంద్రుడివి" అంటాడు. ఆడవాళ్ళతో , "అమ్మా! నువ్వు భూదేవివి, శ్రీదేవివి" అంటాడు. ఆ పొగడ్తలు విన్న వారందరూ ముసి ముసి నవ్వులతో, సుబ్బన్నకు, కొంచెం బియ్యమో – కాయో పండో – పాలో పెరుగో ఇస్తారు. ఆ రకంగా సుబ్బన్న, ఇల్లు గడుపుకుంటూ వుంటాడు.

ఆ ఊళ్ళో రామయ్య అనే పేద రైతు మాత్రం పొగడ్తల్ని ఇష్టపడడు. పొగిడే వాళ్ళకి పిడికెడు బిచ్చం కూడా పెట్టడు.

కానీ, ఒక రోజున సుబ్బన్న, ఒక శిష్యుడితో, రామయ్య ఇంటికే బయల్దేరాడు.



సుబ్బన్నని చూడ గానే రామయ్య మొహం చిట్లించి, "ఇక్కడి కెందు కొచ్చావు సుబ్బన్నా? నీ పొగడ్తల్లో నేనూ పడతా ననుకున్నావా?" అని కస్సు మన్నాడు.

సుబ్బన్న చిరునవ్వు నవ్వుతూ రామయ్య పక్కనకూర్చు న్నాడు – "ఎంత మాట రామయ్యా! నీ గుణం తెలుసుకో లేనంత అజ్ఞానినా నేను? పొగడ్తలకు లొంగే మూర్ఖుడెవడో, వాటిని చేర నివ్వని విజ్ఞుడెవడో తెలుసుకోలేని మందమతినా నేను? మూర్ఖులైతేనే పొగడ్తల్ని నమ్ముతారు, సంతోషిస్తారు. నువ్వు అటువంటి అల్పుడివా? పొగడ్తల్లో నిజం వుండదని తెలుసుకోగలుగుతారు జ్ఞానులు. అలాంటి వాళ్ళ దగ్గిర కూడా నా పొగడ్తలు వినిపిస్తానా రామయ్యా?" అన్నాడు.

రామయ్య, భార్యని పిలిచి, "ఈయనకి సంచి నిండా బియ్యం పోసి పంపు" అని చెప్పాడు.

సుబ్బన్న శిష్యుడు, బియ్యం మూట నెత్తి మీద ఎత్తుకొని నడుస్తూ దారిలో, "గురువు గారూ! మీరు రామయ్యని కూడా చాలా బాగా పొగిడారే! అది ఆయనకి అర్థం కాలేదా?" అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఎందుకు అర్థం కాదురా అబ్బీ? ఈ భూమి మీద పొగడ్తలకు లొంగని వాడెవడురా? 'నువ్వు ఇంద్రుడివి, చంద్రుడివి' అంటే, నూటికి తొంభై తొమ్మిది మంది బుట్టలో పడతారు. ఇక ఒక్కడు మిగులుతాడు. 'నువ్వు ఇంద్రుడన్నా లొంగవు, చంద్రుడన్నా లొంగవు' అంటే, ఆ ఒక్కడు కూడా అదే బుట్టలో పడిపోతాడు. అంటే, కొంత మంది దగ్గిర, పొగిడే మాటలు మార్చాలిరా, అంతే" అని వివరించాడు గురువు.

శిష్యుడు చాలా అయిష్టంగా, "నేను గడ్డి కోసుకునో, కట్టెలు కొట్టుకునో బతుకుతాను గానీ, ఈ రకంగా అందర్నీ పొగిడి బతకను గురువు గారూ! ఇది నాకు నచ్చ లేదు" అన్నాడు.

గురువు చిరునవ్వుతో, "అలాగే చెయ్యి నాయనా! నా వంటి అల్పుడివి కావు నువ్వు. నిన్ను చూస్తున్నానుగా? నీ తత్వం వేరు అన్నాడు. – శిష్యుడు కోపంగా, 'మీరు నన్ను కూడా పొగిడి బుట్టలో వెయ్యాలని చూశారు. నేనలా పడను! మీ మూటలు మోసే పని నాకొద్దు. గడ్డి కోసుకుని బతుకుతా' అనేసి, మూటని అక్కడే పడేసి వెళ్ళిపోయాడు.

– రంగనాయకమ్మ

(ఒకటో తరగతి తెలుగు వాచకం నుంచి)

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



# ఫొటోజర్నలిస్ట్ శ్రీనివాసరెడ్డికి అమెరికన్ ఎక్సెలెన్సీ అవార్డు

## అమెరికా నుంచి ఆహ్వానం – తెలుగు రాష్ట్రాల్లో ప్రప్రథముడు

ఫొటోగ్రఫిలో విశేషంగా కృషిచేస్తూ అంతర్జాతీయంగా జరిగే పోటీలలో పాల్గొంటూ అత్యున్నత అవార్డులు పొందినవార్ని గుర్తిస్తూ అందించే అవార్డు ఈ ఏడాది మన తెలుగు ఆర్టిస్టుని వరించింది. ప్రపంచంలోనే పేరుగాంచిన ఫొటోగ్రఫి సొసైటీ ఆఫ్ అమెరికా ప్రతినిధులు 2020 సంవత్సరానికి అవార్డులను ప్రకటించారు. ఎక్సెలెన్సీ ఫొటోగ్రఫి సొసైటీ ఆఫ్ అమెరికా అనే అత్యున్నతమైన అవార్డుని ప్రముఖ ఫొటోజర్నలిస్ట్ టి. శ్రీనివాసరెడ్డిని ఎంపికచేసి ఈ మేరకు ఆహ్వానం పంపించారు. 1997 సంవత్సరంలో ఈ సంస్థలో శ్రీనివాసరెడ్డి సభ్యుడిగా చేరి అంతర్జాతీయంగా జరిగే పోటీల్లో క్రమం తప్పకుండా పాల్గొంటూ పలుమార్లు బంగారు పతకాలు సాధించారు. నలుపు తెలుపు, కలర్, నేచర్, వైల్డ్ లైఫ్, ఫొటో ట్రావెల్, ఫొటోజర్నలిజం అనే ఆరు అంశాల్లో గత రెండు దశాబ్దాల కాలంలో 67 దేశాలలో జరిగిన ఫొటోగ్రఫి పోటీలలో పాల్గొని వీరు తీసిన 4236 ఛాయాచిత్రాలు ఎంపికై ప్రదర్శింపబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమికి ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి 1986 నుండి పలు పత్రికలకు ఫొటోజర్నలిస్ట్‌గా పనిచేశారు. అత్యధిక కాలం ఇండియాటుడేకి మనరాష్ట్రం నుండి ఫొటోజర్నలిస్ట్‌గా పనిచేశారు. తన అభిరుచి మేరకు ఫొటోగ్రఫిలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌లతోపాటు ఆఫ్రికా, టాంజియానా, కెన్యాలోని గిరిజనుల జీవనశైలి పై ప్రత్యేక ఫొటో డాక్యుమెంటరీలు చిత్రీకరిస్తూ, వారి పరిశోధనలతో ఇప్పటివరకు 16 పుస్తకాలు రచించారు. పలు అంతర్జాతీయ ఫొటోగ్రఫి పత్రికల్లో పలు వ్యాసాలు రాశారు. జాతీయ, అంతర్జాతీయ ఫొటోగ్రఫి పోటీలలో గత రెండు దశాబ్దాలుగా న్యాయనిర్ణేతగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎం.ఎ. రహీమ్ ఫొటోజర్నలిస్ట్ అవార్డుని 2010 సంవత్సరంలో అందుకున్నారు. 2008 సంవత్సరంలో రామ్‌నాథ్ గోయంకా మెమోరియల్ అవార్డుతో పాటు పలుమార్లు కేంద్ర ప్రభుత్వం ఫొటోడివిజన్ అందించే అవార్డులతో పాటు, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒడిస్సా, ఢిల్లీ లలితకళా అకాడమి అవార్డులను ఫొటోగ్రఫిలో శ్రీనివాసరెడ్డి పొందారు. జాతీయ, అంతర్జాతీయ ఫొటోగ్రఫి పోటీలను విజయవాడ కేంద్రంగా నిర్వహించి ఎంతో మంది ఔత్సాహికులను ప్రోత్సాహించారు. అమెరికాలోని ది ఇమేజ్ కొలీగ్ సొసైటీకి ఛైర్మన్‌గాను, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్‌కి జర్నలిజం విభాగంకు ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. గతంలో బ్రిటిషు రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీనుండి అసోసియేట్ షిప్ హానర్‌ను గత ఏడాది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫి సంస్థ నుండి మాస్టర్ ఆఫ్ ఎఫ్.ఐ.పి అవార్డుని దేశంలోనే తొలివ్యక్తిగా అందుకున్నారు. వీరిప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యున్నత కళారత్న హంస అవార్డుని 2015 సంవత్సరంలో శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసి సత్కరించింది.

అమెరికాలోని సౌత్ డకోటా రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే ఫొటో ఫెస్టివల్ మరియు అంతర్జాతీయ సమావేశంలో ఈ అవార్డుని అందుకోవాల్సిందిగా ఫొటోగ్రఫి సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థ ఈ మేరకు ఆహ్వానం పంపింది. ఈ అవార్డుని ఉభయ రాష్ట్రాలలోని తొలి తెలుగు వాడిగా పొందటంపట్ల పలు ఫొటోగ్రఫి సంస్థలు శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలియజేశారు.


# తెలుగు మొబైల్ యాపులూ వికీ వ్యాసరచనల పోటీ

## నాలుగు లక్షల రూపాయల బహుమతులు

యాపుల పోటీకి, వ్యాసరచన పోటీకి ఇప్పటి వరకు తమ యాపులను, వ్యాసాలను పంపిన వారికి ధన్యవాదాలు. ఆశించిన సంఖ్యలో పోటీదార్లు పాల్గొననందున పోటీ గడువు తేదీని **జూలై 31,2021**కి పొడిగించటమైనది. వ్యాసరచనకు కావాల్సిన నాణ్యతా మార్గదర్శకాలను

https://telugubhashodyamasamakhya.blogspot.com

**వలపేజీకి వెళ్ళి చూడగలరు.పోటీ విజేతలకు బహుమతి ఆగష్టు 29 నాటి తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో అందజేస్తాము.**

తెలుగు భాషోద్యమ సమాఖ్య *e-mail:* tebhasapoti@gmail.com

ఫోన్: 94930 35658.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
January 2021 Vol :6, Issue 8

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

Bommidala
International



సంక్రాంతి
శుభాకాంక్షలు

బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244